ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★




పార్లమెంట్‌లో ఒకే సెషన్‌లో.. బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదించే ధోరణి! 07
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ యథాతథం 03
కాంగ్రెస్ అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడలేదు : చిన్నారెడ్డి



సంపుటి 09, సంచిక: 264 | ఆదివారం | 23-08-2026 | మహబూబ్‌నగర్
Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar
పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## హైదరాబాద్‌లో లండన్ వర్సిటీ

- ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడి
- కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో సిఎం రేవంత్ రెడ్డి బృందం భేటీ
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంలో భాగస్వామి కావాలని విజ్ఞప్తి




ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి తెలియజేశారు. లండన్ యూని వర్సిటీ సెనేట్ హౌస్‌లో శనివారం తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వ ర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. ఈ భేటీలో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్‌ఎస్‌ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్‌ఓఏఎస్)కు చెందిన ప్రతి నిధి బృందాలు, ఇతర ప్రతినిధులు కూడా ఉన్నారు. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోం దని ఆ సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా వెల్ల డించారు. యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా విస్తృత స్థాయిలో విద్యా కోర్సులు, వివిధ విద్యా కార్యక్రమాలను అందించేలా ఈ క్యాంపస్ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు వివరించారు. లండన్ యూనివ ర్సిటీకి చెందిన వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వామి కావాలని తెలం గాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాన్ని ఆహ్వానిం చారు. సిఎం నేతృత్వంలో బ్రిటన్ పర్యటనకు వెళ్లిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం నేడు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యావేత్తలతో ఫలప్ర దమైన తరువాయి 8లో



## సురవరం జీవితం స్ఫూర్తిదాయకం

- గ్రామీణ యువతపై సుధాకర్‌రెడ్డి ఆదర్శాల ప్రభావం
- వర్ధంతి సభలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వైస్ ఛాన్స్‌లర్ ఘంటా చక్రపాణి
- ఓ వ్యక్తి తన జీవితకాలంలో ఒక్కరినైనా మార్చగలిగితే గొప్ప కమ్యూనిస్టు అవుతారు.. ప్రత్యక్ష ఉదాహరణే సురవరం
- సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శికి ప్రముఖుల నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర రెడ్డి జీవితమంతా స్ఫూర్తిదాయక మని, ''ఎంత కాలం జీవించామనేది కాదు. ఎంత గొప్పగా జీవించా మనేది ముఖ్యం'' (లైఫ్ షుడ్ బి గ్రేట్ రాథెర్ థెన్ లాంగ్) అనే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన సూక్తికి సురవరం సుధాకర రెడ్డి జీవితం పర్యాయపదంగా నిలుస్తుందని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యా లయం ఉప కులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి కొనియాడారు. సమసమాజం స్థాపన అధికారంతో కాదని, కమ్యూనిస్టుల ఏకీకరణ ద్వారా మాత్రమే అది సాధ్యమని సురవరం సుధాకర్‌రెడ్డి ప్రగాఢంగా విశ్వసించేవారని, ఆ దిశగా కమ్యూనిస్టు శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో దివంగత సిపిఐ అగ్ర నేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్ల మెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సభ శని వారం మఖ్దూంభవన్‌లో జరిగింది. సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించగా, ఘంటా చక్రపాణి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సురవరం సుధాకర రెడ్డి సతీమణి సీనియర్ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయ లక్ష్మి ప్రసంగించారు. సురవరం సుధాకర్‌రెడ్డి వివిధ సందర్భాలలో వివిధ అంశాలపై రాసిన వ్యాసాలతో రూపొందించిన 'ఉద్యమా క్షరం' పుస్తకాన్ని వారు తరువాయి 12లో




ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించిన సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా




కరీంనగర్‌లో బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి. చిత్రంలో పార్టీ శ్రేణులు.

## పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

- జర్నలిజం వ్యాపారం మాత్రమే కాదు.. సామాజిక బాధ్యత
- సమాజంలోని ఘటనలను వార్తలుగా నివేదించడమే కాకుండా వివక్షను ప్రశ్నించాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- హైదరాబాద్‌లో లాంఛనంగా 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం




ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాస్వామ్యం మనుగడకు పాలకులను, అధికారంలో ఉన్నవారిని నిలదీసే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని, విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జర్నలిజం కేవలం వ్యాపారం మాత్రమే కాదని, అదొక గొప్ప సామాజిక బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రధాన ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతా టిపైకి వచ్చి ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ఆఫ్ ఇండి యా'ను శనివారం హైదరాబాద్‌లో బేగంపేటలోని ఐఎఎస్ క్లబ్‌లో డిప్యూటీ సిఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భట్టి విక్రమార్క, 'ది హిందూ' గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.రామ్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకా డమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు సంగీత బారోచ్ పిషారోటి, 'ది కారవాన్' ఎడిటర్ అనంత్ నాథ్, ఫెడ రేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షులు గౌతమ్ లాహిరీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరికు ప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు. సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం వార్తలుగా నివేదించడమే కాకుండా, వాటి అంత రార్థాన్ని, సమాజంలో నెలకొన్న వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందని డిప్యూటీ సిఎం అన్నారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హల్ ద్వానీలోని రాంలీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత అక్కడ నిర్వహించినట్లు చెబుతున్న 'శుద్ధీకరణ' కార్యక్ర మంపై భట్టి తీవ్రంగా తరువాయి 8లో



## ఏడంతస్తుల మేడ కుప్పకూలింది

### ఇద్దరు కార్మికులు దుర్మరణం


- హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఘటన
- నాలా ఆక్రమించి ఇరుకైన 50 గజాల స్థలంలో అక్రమ నిర్మాణం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- అంజయ్య నగర్‌లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్/ శేరిలింగంపల్లి

రాజధాని నగరంలో అక్రమ నిర్మాణాల అత్యాశ అమా యక కార్మికుల ప్రాణాలను బలిగొంటోంది. హైదరా బాద్‌లోని మాదాపూర్ సర్కిల్ పరిధి గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో శనివారం నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల (జి ప్లస్ 6, పెంట్‌హౌస్) భవనం పక్కకు ఒరిగి, సమీపంలో ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పై కుప్పకూలింది. ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు సమీపంలోని అపార్ట్‌మెంట్ గోడలు ధ్వంసమవ్వడమే కాకుండా, తరువాయి 8లో

## ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర భారత్'

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షులు మూడు ప్రశ్నలు
- చక్కెర ధరల పెంపు, ఇథనాల్ విధానంపై మండిపాటు



**న్యూఢిల్లీ :** పెరుగుతున్న చక్కెర ధరలు, తగ్గుతున్న నిల్వలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రంపై తీవ్ర విమ ర్శలు గుప్పించారు. మోదీ ప్రభుత్వ విధానాల చేదుతనం చక్కెర తీపిలోనూ చొరబడిందని ఎద్దేవా చేశారు. శనివారం ఖర్గే ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. ప్రధాని మోదీ ప్రభుత్వానికి మూడు సూటి ప్రశ్నలు సంధించారు. 1. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశంలో, చక్కెర నిల్వలు నేడు ఎందుకు గత 9 ఏళ్లలో కనిష్ట స్థాయికి పడిపోయాయి? ఎగుమతులను నిలిపివేసి, సుంకం లేకుండా మిలియన్ టన్నుల చక్కెరను దిగుమతి చేసుకునే పరిస్థితికి మనం ఎలా వచ్చాము? 2. మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందే ప్రజలపై తరువాయి 12లో

## అందరి ఫిర్యాదులు అందాక పరిశీలించి చర్యలు

- చిన్నారెడ్డి వివరణ అందింది, మేఘారెడ్డిని మరోసారి పిలిచి వివరణ తీసుకుంటాం
- టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి



ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి అందరి ఫిర్యాదులు అందిన తర్వాత వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామమని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి తెలి పారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన టిపిసిసి క్రమశి క్షణ కమిటీ సమావేశంలో పార్టీ నాయకుల వివాదాలు, వివాదాస్పద వ్యాఖ్యలపై సుదీర్ఘంగా తరువాయి 8లో


నాపై అవమానకర వ్యాఖ్యలు చర్యలు తీసుకోండి : సురేఖ
సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలి : అడ్లూరి 03


## నిర్లక్ష్యపు నీడలో 'నిర్మల్' పర్యాటకం!

- బాసర ఆలయంలో కనీస వసతులు కరువు
- శిథిలావస్థకు 'శ్యామ్‌గఢ్'
- అభివృద్ధికి నోచుకోని వెయ్యిగూడల మర్రి





ప్రజాపక్షం/నిర్మల్

పచ్చని ప్రకృతి, చారిత్రక కట్టడాలు, పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రాలు, అద్భుతమైన జలపాతాలు.. వెరసి నిర్మల్ జిల్లా పర్యాటక రంగానికి పెట్టింది పేరు. కానీ, పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి ఈ అద్భుతమైన పర్యాటక సంపద నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రతి ఏటా పర్యాటక అభివృద్ధి పేరుతో విడుదలవుతున్న కోట్ల రూపాయల నిధులు ఎటుపోతున్నాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చే పర్యాటక తరువాయి 8లో

## 80 శాతం మహిళలపై వేధింపులు

- 29 శాతం మంది శారీరక హింస, 6 శాతం మంది అత్యాచారాన్ని ఎదుర్కొంటున్నారు
- భద్రత పేరుతో 50 శాతం మంది మహిళలకు విద్య, ఉద్యోగ అవకాశాలు నిరాకరించబడుతున్నాయి
- పుణెలో 'ఛాత్రోన్ కీ గూంజ్' రాహుల్‌గాంధీ




**పుణె :** మహిళలు పురోగమించకుండా అడ్డుకోవడానికి సమాజంలో హింసను ఆయుధంగా వాడుతున్నారని లోక్‌స భలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 80 శాతం మంది మహిళలు వేధింపులను ఎదు ర్కొంటున్నారన్నారు. మహిళలే దేశానికి అతిపెద్ద సంపద అని పేర్కొన్న ఆయన, వారు తమ కోసం తాము నిలబడా లని, తమపై తమకు నమ్మకం ఉంచుకోవాలని సూచిం చారు. శనివారం మహారాష్ట్రలోని పుణె జరిగిన పార్టీ యువ జన అనుసంధాన కార్యక్రమం 'ఛాత్రోన్ కీ గూంజ్' (విద్యా ర్థుల గళం)లో పాల్గొని ప్రసంగించారు. మహిళలపై జరిగే మూడు రకాల హింసలను— శారీరక హింస, అవకాశా లను నిరాకరించడం ద్వారా జరిగే హింస, ఆర్థిక హింస— ప్రస్తావించారు. ప్రతి ఏటా 4.5 లక్షల ఆడ శిశువుల భ్రూణ హత్యలు జరుగుతున్నాయని, 80 శాతం మంది మహిళలు వేధింపులకు గురవుతున్నారని, 29 శాతం మంది శారీరక హింస, 6 శాతం మంది అత్యాచారాన్ని ఎదుర్కొంటున్నారని గాంధీ తెలిపారు. సామాజిక అపవాదు భయంతో 99 శాతం లైంగిక హింస ఘటనలు బయటకు రావడం లేదని ఆయన పేర్కొన్నారు. భద్రత పేరుతో 50 శాతం మంది మహిళలకు విద్య లేదా ఉద్యోగ అవకాశాలు తరువాయి 12లో




## మారిన భూమి ముఖచిత్రం!

అపోలో–8 యాత్ర (1968)లో వ్యోమగామి విలియం ఆండర్స్ తీసిన 'ఎర్త్‌రైజ్' చిత్రం అంతరిక్ష చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన ఫొటోల్లో ఒకటిగా నిలిచింది. చంద్రుడి నిర్జన ఉపరితలం వెనుక నుంచి నీలిరంగు భూమి ఉదయిస్తున్న ఆ దృశ్యం ప్రపంచానికి ఒక కొత్త దృక్పథాన్ని అందించింది. మన గ్రహం ఎంత చిన్నదో, ఎంత సున్నితమైనదో ఆ చిత్రం మానవాళికి గుర్తుచేసింది.



అనంతరం పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు అది ఒక ప్రతీకగా మారి, 1970లో ప్రారంభమైన 'ఎర్త్ డే' ఉద్యమానికి కూడా ప్రేరణనిచ్చింది. దాదాపు 58 సంవత్సరాల తర్వాత, నాసా చేపట్టిన ఆర్టెమిస్ II యాత్రలో వ్యోమగాములు చంద్రుడి సమీపం నుంచి భూమి దిగువకు జారుతున్న మరో అద్భుత దృశ్యాన్ని చిత్రీకరించారు. దీనిని 'ఎర్త్‌సెట్'గా పిలుస్తున్నారు. ఈ చిత్రాన్ని మొత్తం సిబ్బంది తరపున విడుదల చేయడం విశేషం. ఆధునిక ఉపగ్రహాలు ప్రతిరోజూ భూమి లక్షలాది చిత్రాలను పంపుతున్నప్పటికీ, ఒక మనిషి కళ్లతో చూసి తీసిన ఈ చిత్రం ప్రత్యేకమైన భావోద్వేగాన్ని కలిగిస్తుంది. ఈ రెండు చిత్రాలు కేవలం అందమైన దృశ్యాలను మాత్రమే చూపించడం లేదు. గత ఆరు దశాబ్దాల్లో భూమిపై జరిగిన పర్యావరణ మార్పులకు కూడా సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ కాలంలో వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రత గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్‌కు పైగా పెరిగింది. అడవుల నరికివేత, నగరాల విస్తరణ, వ్యవసాయ భూముల పెరుగుదల, ఆరల్ సముద్రం వంటి భారీ జలాశయాల క్షీణత వంటి మార్పులు భూమి రూపురేఖలను మార్చేశాయి. అంతేకాకుండా అంటార్కిటికాలో వేలాది చదరపు కిలోమీటర్ల మంచు ఫలకాలు కూలిపోవడం, రెండు ధ్రువాల్లో సముద్ర మంచు తగ్గిపోవడం వంటి పరిణామాలు వాతావరణ మార్పుల తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఈ మార్పుల్లో అత్యధిక భాగానికి మానవ కార్యకలాపాలే కారణం.

## చిగురించిన రాబిన్ హుడ్ చెట్టు..



ఉత్తర ఇంగ్లాండ్‌లోని ప్రసిద్ధ 'సైకమోర్ గ్యాప్' వద్ద ఉన్న సైకమోర్ చెట్టు ప్రపంచవ్యాప్తం గా ప్రకృతి ప్రేమికులను ఆకర్షించిన ఒక అరుదైన చిహ్నం. ఒంటరిగా ఒక లోయ మధ్య నిలిచిన ఈ చెట్టుకు సుమారు 150 నుంచి 200 సంవత్సరాల చరిత్ర ఉంది. అందమైన ప్రకృతి దృశ్యంలో భాగంగా నిలిచిన ఈ వృక్షం, 'రాబిన్ హుడ్: ప్రిన్స్ ఆఫ్ థీవ్స్' అనే సినిమాలో కనిపించింది. ఆ తర్వాత దీనిపేరు 'రాబిన్ హుడ్ ట్రీ'గా మారిపోయింది. 2023లో ఈ చారిత్రక చెట్టును ఉద్దేశపూర్వకంగా నరికివేయడం బ్రిటన్ అంతటా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఈ ఘటనలో చెట్టుతోపాటు సమీపంలోని రోమన్ చక్రవర్తి హాడ్రియన్ నిర్మించిన 'హార్డియన్స్ వాల్'లోని ఒక భాగం కూడా దెబ్బతింది. క్రీ.శ. రెండో శతాబ్దానికి చెందిన ఈ గోడ ప్రస్తుతం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. అయితే చెట్టు కథ అక్కడితో ముగియలేదు. నరికివేసిన తర్వాత నేలలో మిగిలిన మొద్దు నుంచి కొత్త చిగుర్లు రావడం ప్రారంభమైంది. దీనిని సహజ పునరుత్పత్తి అంటారు. సైకమోర్ వంటి కొన్ని చెట్లకు వేర్లు సజీవంగా ఉంటే, అవి మళ్లీ కొత్త కొమ్మలను పెంచుకునే సామర్థ్యం ఉంటుంది. ఈ కొత్త చిగుర్లు భవిష్యత్తులో మళ్లీ పెద్ద చెట్టుగా ఎదుగుతాయా అనేది సంరక్షణ, వాతావరణ పరిస్థితులు, వ్యాధుల నియంత్రణ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. అయినప్పటికీ, శతాబ్దాల చరిత్రను మోసిన ఈ చెట్టు మరోసారి జీవం పొందే అవకాశం ప్రకృతి పునరుజ్జీవన శక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. 'ఒక చెట్టును నాశనం చేయడానికి కొన్ని నిమిషాలు చాలు. కానీ అది పెరిగి తరతరాల జ్ఞాపకంగా మారడానికి శతాబ్దాలు పడతాయి' అనే వాస్తవాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తుంది. ప్రకృతి వారసత్వాన్ని కాపాడటం అంటే కేవలం పర్యావరణాన్ని రక్షించడం మాత్రమే కాదని, చరిత్ర, సంస్కృతి, ప్రజల భావోద్వేగాలను కూడా సంరక్షించడమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

## వ్యవసాయంలో రోబోటిక్ విప్లవం



వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, కీటకాల నియంత్రణకు శాస్త్రవేత్తలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగా అతినీల లోహిత (అల్ట్రావయొలెట్ లేదా యువి)కాంతిని ఉపయోగించే స్వయంచాలక రోబోట్లను అభివృద్ధి చేశారు. ఈ భారీ రోబోట్లు పొలాల్లో స్వయంగా సంచరిస్తూ, పంటలకు నష్టం కలిగించే కీటకాలను గుర్తించి వాటిపై యువి కాంతిని ప్రయోగించి నియంత్రించగలవు. ప్రస్తుతం రైతులు కీటకాల నివారణకు అధికంగా రసాయనిక పురుగుమందులపై ఆధారపడుతున్నారు. అయితే వీటి అధిక వినియోగం వల్ల నేల నాణ్యత తగ్గడం, నీటి కాలుష్యం పెరగడం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా ఆహార పదార్థాల్లో రసాయన అవశేషాలు మిగిలి మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. యువి ఆధారిత రోబోటిక్ వ్యవస్థలు ఈ సమస్యలకు పర్యావరణహిత ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంది. అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే కీటకాలను లక్ష్యంగా చేసుకోవడం వల్ల రసాయనాల వినియోగాన్ని తగ్గించవచ్చు. దీనివల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పంటల్లో రసాయన అవశేషాలు తగ్గుతాయి. పంటలకు మేలుచేసే తేనెటీగలు, సీతాకోకచిలుకలు వంటి పరాగసంపర్క కీటకాలను రక్షించే అవకాశం ఈ సాంకేతికత వల్ల సాధ్యమవుతుంది. .

## అరుదైన వ్యక్తిత్వం



ఉరుగ్వే మాజీ అధ్యక్షుడు జోస్ ముజికాను అరుదైన వ్యక్తిత్వంగల నాయకుడిగా పేర్కొంటారు. 2010 నుంచి 2015 వరకు ఉరుగ్వే అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన, అధికార పదవిలో ఉన్నప్పటికీ అత్యంత సాధారణ జీవనశైలిని కొనసాగించ డం ద్వారా అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందాడు. తన అధ్యక్ష జీతంలో ఎక్కువ భాగాన్ని దానం చేయడం, రాజధాని మాంటెవీడియోలోని సాధారణ ఫార్మ్‌హౌస్‌లో నివసించడం, పాత 'వోక్స్‌వాగన్ బీటిల్' కారును ఉపయోగించడం వంటి విషయాలు అతని నిరాడంబరత్వానికి ప్రతీకలు. కొంతమంది ఆయనను ప్రపంచంలోనే అత్యంత పేద దేశాధ్యక్షుడిగా అభివర్ణిస్తారు. కానీ, ఆ వాదన సరైనది కాదు. ఎందుకంటే, ముజికాకు వ్యవసాయ భూమి ఉంది, రాజకీయ అనుభవం, ప్రజాదరణ, సామాజిక ప్రభావం ఉన్నాయి. అవసరాలకు మించి సంపదను కూడబెట్టకూడదనే ఒక చైతన్యపూర్వక జీవన విధానాన్ని అవలంభించాడు. ఎప్పుడూ ఇంకా ఎక్కువ కావాలని కోరుకోవడమే నిజమైన పేదరికం అనే ఆయన భావన వినియోగవాదంపై ఒక తాత్విక విమర్శగా చూడవచ్చు. ఇది మినిమలిజం, స్టోయిసిజం వంటి ఆలోచనా ధోరణులకు దగ్గరగా ఉంటుంది. ముజికా పాలనలో ఉరుగ్వే ఆర్థిక వృద్ధిని కొనసాగించింది. అదే సమయంలో గంజాయి చట్టబద్ధీకరణ, స్వలింగ వివాహానికి చట్టబద్ధ గుర్తింపు వంటి సామాజిక సంస్కరణలు కూడా ఆయన కాలంలో జరిగాయి.

– బిఎస్ఎస్ మైత్రేయి

# ఇస్రో ఆపరేషన్స్ ప్రైవేటీకరణ ఎజండా

రోదసీ అన్వేషణలో కీలకం, దేశానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉపగ్రహాల ఉత్పత్తిని, వాటిని ప్రయోగించే వాహకాల (లాంచ్ వెహికల్స్)ను మోదీ ప్రభుత్వం ఇండియన్ స్పేస్ రీసెర్చి ఆర్గనైజేషన్ (ఇస్రో) నుంచి ప్రైవేటురంగానికి బదిలీ చేస్తున్నదా? ఇప్పుడు అమలు జరుగుతున్న చర్యలు 'ఔను' అనే సమాధానాన్ని ధృవీకరిస్తున్నాయి. ఇస్రో మరింతగా పరిశోధన, శాస్త్రీయ అన్వేషణ రోదసీ యాత్రలు, అధునాతన రోదసీ మౌలిక వసతుల నిర్మాణం వంటి వాటిపై కేంద్రీకరించే వెసులుబాటు కలిగించే నిమిత్తం ప్రైవేటురంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నది. ఇస్రో కార్యక్రమాల్లో మార్పు 2023 లో ప్రకటించిన స్పేస్ పాలసీ కింద వేగవంతమైంది. 2025 చివరలో ఎస్ఎస్ఎల్‌వి (చిన్న ఉపగ్రహ ప్రయోగ వెహికిల్) హక్కులను ఇస్రోనుంచి హెచ్ఎఎల్ రూ.511కోట్లకు వేలంలో దక్కించుకుంది. ఇది ఒక ప్రభుత్వరంగ సంస్థ నుంచి మరో ప్రభుత్వరంగ సంస్థకు బదలాయింపులా కనిపించినా, హెచ్ఎఎల్ వైఫల్యాన్ని చాటటానికి ఈ బదలాయింపు జరిగి ఉండవచ్చుననే అనుమానాలు లేకపోలేదు. ఎందుకంటే, అది తేజాస్ ఎంకె1A జెట్‌లు తదితర కీలకమైన స్వదేశీ యుద్ధ పరికరాలను నిర్ణీత సమయంలో సరఫరా చేయలేక విమర్శలు ఎదుర్కొంటున్నది.

ఇస్రోలో ప్రైవేటీకరణకు అనుసరిస్తున్న పద్ధతి రైల్వేలలో, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణకు ఆచరించిన పద్ధతులను గుర్తు చేస్తున్నది. ప్రజల డబ్బుతో ప్రభుత్వ ఆస్తులు నిర్మించటం, వాటి నిర్వహణను నిర్లక్ష్యం చేసి అవి సవ్యంగా పనిచేయటం లేదని నిందలు వ్యాప్తిలో పెట్టటం, అంతిమంగా వాటిని కారుచౌకగా ప్రైవేటు కంపెనీలకు విక్రయించి లాభాలు చేకూర్చటమే ఆ రీతి. అటువంటి లోపాయికారి ఒప్పందాల్లో అధికారులు కమిషన్‌లు, లంచాలు అందుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు.


ఇస్రో వాణిజ్య కార్యకలాపాల నిర్వహణకు న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్) అనే సంస్థ ఉండగా, ఇన్ – స్పేస్ (IN–SPACe) అనే మరో సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇస్రో ఆస్తులను వాణిజ్యపరం చేయటాన్ని (విక్రయించే) వేగిరపరచటానికే ఈ కొత్త సంస్థను ఏర్పాటు చేశారని విమర్శకులు వాదిస్తున్నారు. దాని చైర్మన్ డాక్టర్ పవన్ గోయింకా శుక్రవారం ఢిల్లీలో మాట్లాడుతూ, రొటీన్ ఉపగ్రహాలు, పిఎస్ఎల్‌వి, ఎల్‌వి ఎంకె వంటి లాంచి వెహికల్స్ ఉత్పత్తి చేయటాన్ని ఇస్రో నిలుపు చేస్తుందని, వాటి ఉత్పత్తి పూర్తిగా ప్రైవేటు, ప్రభుత్వరంగ సంస్థలకు బదిలీ అవుతుందని చెప్పారు. ఈ క్రమం ఇప్పటికే ప్రారంభమైంది. ప్రైవేటు కంపెనీలు సొంతంగా చేపట్టలేని పరిశోధన, అధునాతన టెక్నాలజీలు, శాస్త్రీయ పరిశోధన యాత్రలు, మౌలిక వసతుల నిర్మాణంపై ఇస్రో కేంద్రీకరిస్తుందన్నారు. ఎస్ఎస్ఎల్‌వి క్రమంలో హెచ్ఎఎల్‌ను అనుమతించినట్లు, పిఎస్ఎల్‌వి వేలం ఎల్‌విఎం 3 తదితర భవిష్యత్ టెక్నాలజీ బదలాయింపు క్రమంలో పాల్గొనేందుకు ప్రభుత్వరంగ సంస్థలు అనుమతించబడవని, ప్రైవేటు పరిశ్రమలు మాత్రమే ఆ వ్యాపారం చేబడతాయని కూడా డాక్టర్ గోయింకా చెప్పటం గమనార్హం. "మేము ఇప్పటికే 120 టెక్నాలజీలను ఇస్రో నుంచి ప్రైవేటురంగానికి బదిలీ చేశాం. కొత్త లాంచ్ సెంటర్ కార్యకలాపాలను ప్రైవేటు పరిశ్రమలకు ఇచ్చేందుకు ప్రభుత్వం తలపెట్టింది. వచ్చే నాలుగైదు మాసాల్లో ప్రైవేటు ఆపరేటర్ ఖరారు అవుతారని" కూడా ఆయన చెప్పారు. ఇస్రో ఆస్తులు, కార్యకలాపాల ప్రైవేటీకరణకు మోదీ ప్రభుత్వం ఎంత త్వరపడుతున్నదో కదా! రోదసీ ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి ప్రస్తుత 8 బిలియన్ డాలర్లనుంచి 44బి.డా.లకు పెంపు చేయటం ప్రభుత్వ లక్ష్యం. రక్షణశాఖ ఇప్పటికే ప్రైవేటు కంపెనీలకు 31 ఉపగ్రహాలు ఆర్డరు ఇచ్చిందట, ఇస్రో 21 ఉపగ్రహాలే ఉత్పత్తి చేస్తుందట. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో వేగవంతమైన మార్పుకు ఇది మరో సూచన.

రెండోవైపున, ఇస్రో లక్ష్యాల సాధన నెమ్మదించటాన్ని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ విమర్శించింది. ఇస్రో బడ్జెట్ పూర్తిగా ఉపయోగించకపోవటం, చంద్రయాన్–4, చంద్రయాన్–5, వీనస్ ఆర్బిటర్ మిషన్ (శుక్రయాన్ 1) సహా ప్రధానమైన అన్వేషణ కార్యక్రమాలు జాప్యం కావటాన్ని ఆ కమిటీ మార్చి 2026 నివేదిక ఆక్షేపించింది. అధునాతన టెక్నాలజీలను (ఉపగ్రహాలు, రాకెట్లు, ఆధునిక మెటీరియల్స్) తక్కువ ధరలకు ప్రైవేటు కంపెనీలకు బదిలీ చేయటాన్ని కమిటీ గట్టిగా తప్పుపట్టింది.

ఇస్రో, దాని శాస్త్రవేత్తల పట్ల నిర్లక్ష్యం, అనేక కార్యకలాపాలను ప్రైవేటీకరించటం వల్ల ఇస్రో మానవ వనరుల కొరత ఎదుర్కొంటున్నది. 100 మందికిపైగా శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది ఇటీవల రాజీనామా, వలెంటరీ రిటైర్మెంట్ తీసుకుని ప్రైవేటు రంగంలోకి వెళ్లటం తెలిసిందే. ఈ రిటైర్మెంట్లకు వేతనాలు సమస్య కన్నా వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు, పెరుగుతున్న బ్యూరోక్రటిక్ పెత్తనం కారణమని ఇస్రో మాజీ చైర్మన్ జి.మాధవన్ హెచ్చరిక చేశారు. ప్రభుత్వం ప్రైవేటీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాక రోదసీ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు మెరుగైన జీవితాన్ని ఎంచుకోవటంలో ఆశ్చర్యం లేదు. ●

# హోర్ముజ్ జలసంధిపై ట్రంప్ మడత పేచీలు

**ఆజాద్ మీర్జా**




ఇరాన్‌పై అమెరికా – ఇజ్రాయెల్ యుద్ధం దాదాపు ఆరు నెలలు పూర్తిచేసుకుంటోంది. హోర్ముజ్ జలసంధి నౌకాయానమార్గంగా తగ్గిపోయి వాగాడంబర యుద్ధక్షేత్రంగా మారింది. ఆ కార్యస్థలం ఈ వారం కొత్త దశకు చేరుకుంది. ఆ జలమార్గం "కొత్త అమెరికా భూభాగం" అంటూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ('టూత్ సోషల్'పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)తో రూపొందించిన మ్యాప్ పోస్టు చేశారు. "జలసంధి తెరుచుకుంది – పనిచేస్తున్నది" అని వక్కాణి స్తూ, "నీటిలోని మందుపాతరలన్నీ తొలగించబడినాయి లేదా పేల్చి వేయబడినాయి" అని ప్రకటించారు.

టెహరాన్ ఆ ప్రకటనను మొరటుగా పరిహసించింది – ట్రంప్ తర్కం ప్రకారం తాము కూడా కాలిఫోర్నియాను ఇరాన్ భూభాగంగా ప్రకటించగలం అని ఇరాన్ అధికారులు అన్నారు. "వాషింగ్టన్ ఇరాన్ రేవుల దిగ్బంధనం ఎత్తివేసేవరకు, ఆయిలుపై ఆంక్షలు ఎత్తివేసేవరకు, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులు విడుదల చేసేవరకు, ప్రతి ఒక్క రంగంలోనూ మిలటరీ చర్యలు నిలుపు చేసేవరకు హోర్ముజ్ జలసంధి మూసివేయబడే ఉంటుంది" అని పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బకెర్ క్వాలిబఫ్ పార్లమెంటు సభ్యులకు చెప్పారు. రెండు ప్రకటనలూ సత్యం కాబోవు. చెప్పుకునేదానికీ – వాస్తవికతకు మధ్యనున్న దూరం ఇప్పుడు ఈ సంక్షోభంలో కేంద్రబిందువుగా ఉన్న వాస్తవం.

ట్రంప్ భౌగోళిక వాదనను మానసిక ఒత్తిడి తెచ్చేటటువంటి రాజకీయ ప్రదర్శనగా చూడాలి తప్ప ఆచరణకు నోచుకున్న క్లెయింగా కాదు. జలసంధిని స్వాధీనం చేసుకోవటం, భౌతికంగా దాన్ని నిర్వహించటం అమెరికా ఉద్దేశం అయినట్లు గంభీరమైన సూచన ఏదీ లేదు. ట్రంప్ సొంత అధికారులు సైతం జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణాన్ని సుగమం చేసేందుకు నావికా దిగ్బంధనం గూర్చి మాట్లాడుతున్నారు. అయితే హోర్ముజ్ తమ భూభాగం అని వ్యూహాత్మక ప్రకటన చేయటంలో ట్రంప్ ఎత్తుగడ – జలసంధి ఇప్పటికే తెరుచుకుందని చెప్పటం ద్వారా దాని మూసివేతను నియంత్రించే అవకాశాన్ని ఇరాన్‌కు నిరాకరించటం, అదే సమయంలో ముమ్ముందు ఏదైనా విఘాతం జరిగినా అమెరికా ప్రకటిత భూభాగంపై 'కవ్వింపు'గా చిత్రించే అవకాశాన్ని అట్టిపెట్టుకోవటం.

ఇదిలా వుండగా, ఇరాన్ ఒమన్‌తో నేరుగా జలసంధి ద్వారా ఓడల రాకపోకలపై ఒక ఒప్పందం కుదుర్చుకుంది. వాషింగ్టన్‌కు ఏ మాత్రం అవకాశం కల్పించకుండా కొంత ట్రాఫిక్ పునరుద్ధరించటం ఇరాన్ ఉద్దేశం. తమ ఏర్పాటు బాటలోకి ప్రవేశిస్తే ఒమన్ పై బాంబుల వర్షం కురిపిస్తామని ట్రంప్ చేసిన హెచ్చరిక – హోర్ముజ్ తమ భూభాగం అంటూ ఆయన ప్రకటించటంలోని వాస్తవ ఆందోళనను వ్యక్తం చేస్తున్నది. జలసంధి మూతపడి ఉండటం పట్ల ఆందోళన కన్నా దాన్ని తెరిచే కథనంలో తమ కంట్రోలు చేజారుతున్నదనే భయం వాషింగ్టన్‌లో కనిపిస్తున్నది.

ఇదంతా కలిపి చూస్తే, ఇరుపక్షాలూ ఒప్పందం వైపు ప్రయాణించటం లేదు. అవి రెండూ హోర్ముజ్ జలసంధిని తెరిచేందుకు తమ సొంత నిర్ణయాల అమలుకై ప్రయత్నిస్తున్నాయి. దీనివల్ల సమీప భవిష్యత్తులో సాధారణ ట్రాఫిక్ పునరుద్ధరణ అసాధ్యమవుతున్నది. దేశంలో రాజకీయ నేపథ్యం మసకబారుతుండగా ట్రంప్ దేశం వెలుపల ధీరత్వం ప్రదర్శిస్తున్నారు. రాయిటర్స్/ఐప్‌సోస్‌పోల్ ప్రకారం ట్రంప్ ఆమోద రేటింగ్ ఈవారంలో 33 శాతానికి తగ్గింది. అది ఆయన ఈ అధ్యక్షపదవీ కాలంలో అతితక్కువ. 64 శాతం మంది అమెరికన్‌లు ఆయన విధానాలు ఆమోదించటం లేదు. ఇరాన్ యుద్ధం త్వరలో పరిష్కారం కాబోదని ప్రతి ఐదుగురు అమెరికన్‌లలో దాదాపు నలుగురు భావిస్తున్నారు."కొద్ది వారాల్లో ముగుస్తుందని" ట్రంప్ వాగ్దానం చేసిన యుద్ధం ఆర్నెల్లుగా కొనసాగుతూ ఉండటం గ్యాసోలిన్ ధరను గణనీయంగా పెంచింది. నవంబర్ మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థపైన, కాంగ్రెస్ ఎన్నికల్లో పార్టీ అవకాశాలపైన భారంగా తయారైన సంఘర్షణ పట్ల రిపబ్లికన్ వ్యూహకర్తలు ఆందోళన చెందుతున్నారు. ట్రంప్ "అమెరికా కొత్త భూభాగం" ప్రకటన చేయటానికి ఇదీ నేపథ్యం. ఈ ప్రకటన టెహరాన్ కన్నా ఎక్కువగా అమెరికా ఓటర్లకు ఉద్దేశించింది. ఇది ప్రకటనలతో పరిష్కారమయ్యే సమస్య కాదు.

ఏదో ఒక పక్షం వెనక్కు తగ్గాలి. ఆ పరిస్థితి కనిపించటం లేదు. యుద్ధం ప్రారంభించింది అమెరికా కాబట్టి ఇరాన్ సైనికంగా గట్టిగా ఎదుర్కొంటూనే తమ డిమాండ్లపై దృఢంగా ఉంది. అమెరికా సైనిక చర్యలకు సహాయ పడితే దాడులు చేస్తామని గల్ఫ్ సహకార కౌన్సిల్ (బహరైన్, కువైట్, ఒమన్, కటార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) దేశాలను ఇరాన్ హెచ్చరించటం దాని తెగింపును సూచిస్తుంది. అమెరికా–ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తులు కుదిర్చిన "మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ " కాలం గతించి పేరుకు తప్ప ఆచరణ లో జీవంలేని కాగితంగా మారింది. అందువల్ల సమగ్రమైన పరిష్కారం జరగాలంటే యుద్ధరంగంలో లేదా ఆర్థిక రంగంలో నాటకీయమైన మలుపు సంభవించి ఒక పక్షం వెనక్కు తగ్గాలి. లేదా అమెరికా – ఇరాన్‌లు తమ వాదోపవాదాలు కొనసాగించుకుంటూనే, ఒమన్ ఇరాన్‌తో కుదుర్చుకున్న నౌకాయాన మార్గంద్వారా ఆయిలు, ఇతర వాణిజ్య సరుకు ఓడల రవాణాను పాక్షికంగానైనా అనుమతించాలి. లేనట్లయితే ప్రపంచ ఇంధన ధరలు నిత్యం పెరుగుతూ ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అదీ ట్రంప్‌కే చేటు చేస్తుంది.

ప్రపంచంలో ఆయిలు దిగుమతుల్లో మూడవ అతిపెద్ద స్థితిలో ఉన్న భారత్ తన క్రూడ్ ఆయిలు అవసరాల్లో 88 శాతం దిగుమతులపై ఆధారపడి ఉంది. అందువల్ల గల్ఫ్ సంక్షోభం దెబ్బ నేరుగా తగులుతుంది. దాని దిగుమతుల్లో 40–50 శాతం, ఎల్ఎన్‌జి, ఎల్‌పిజి దిగుమతుల్లో అత్యధికం హోర్ముజ్ జలసంధి ద్వారానే జరగాలి. తమ కొనుగోలును 40దేశాలకు విస్తృతం చేసినప్పటికీ నిత్యం టెన్షన్ తప్పదు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆయిలు దిగుమతుల వల్ల పరిస్థితి కొంత మెరుగైనప్పటికీ, దిగుమతుల వ్యయం భారీగా పెరుగుతున్నది. భారత్‌తో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇబ్బందుల పాల్జేస్తున్న ట్రంప్ చివరకు సాధించేది ఏమీ ఉండదు– పరాజయం లేదా పరాభవం తప్ప!

# విలీనం వద్దు.. పాలిటెక్నిక్‌లను బలోపేతం చేయాలి!



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

తెలంగాణలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న సాంకేతిక విద్యకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు వెన్నెముకగా ఉన్నాయి. ఎన్నో దశాబ్దాలుగా ప్రతి విద్యాసంవత్సరం వేలాదిమంది విద్యార్థులకు డిప్లొమా విద్యను అందిస్తూ, ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు మార్గం చూపుతున్న పాలిటెక్నిక్ విద్య వ్యవస్థకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం జీఒనెం.97 తీసుకువచ్చి పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలనే ప్రభుత్వ నిర్ణయం విద్యార్థుల్లో, అధ్యాపకుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో 59 ప్రభుత్వ,54 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా లక్ష మంది విద్యార్థులు పాలిటెక్నిక్ విద్య చదువుతున్నారు. పాలిటెక్నిక్ విద్య చదివే వారిలో అత్యధికులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులే. అందులో పాలిటెక్నిక్ విద్యను ఎక్కువగా బాలికలే చదివేది.

నైపుణ్య విద్యను అభివృద్ధి చేయడం పేరుతో ఇప్పటి కే ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను, ఐటీఐలను, ఎటిసి విద్యారంగాలను స్కిల్ ఇండియా యూనివర్సిటీలో విలీనం చేయడం పరిష్కారం కాదు. ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచే స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను విలీనం చేయడం పాలిటెక్నిక్ విద్యను కార్పొరేటీకరించే కుట్రలో భాగంగానే జరుగుతున్నట్లు అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వ ప్రవేట్ భాగస్వామ్యంతో స్కిల్ యూనివర్సిటీ నిర్వహణలో ఉన్నది కాబట్టి ఆ యూనివర్సిటీకి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే యూనివర్సిటీ వారు ఫీజులు పెంచి విద్యార్థుల దగ్గరి నుండి నిధులు రాబట్టే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థులపై ఫీజుల భారం పడే అవకాశం ఉంది. ఒకవేళ ఫీజు లు పెంచితే వేలాది మంది విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యకు దూరమయ్యే అవకాశం లేకపోలేదు. స్కిల్ యూనివర్సిటీపై మాకు వ్యతిరేకత లేదు కానీ ఈ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను దాని పరిధిలో కలిపే నిర్ణయాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నాం.

పాలిటెక్నిక్ విద్య అనేది కేవలం స్కిల్ ట్రైనింగ్ సెంటర్ కాదు. ఇది గుర్తింపు పొందిన సాంకేతిక విద్యా వ్యవస్థ. డిప్లొమా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఇంజినీరింగ్ విద్యలోకి వెళ్లే అవకాశాలను కల్పించే కీలకమైన విద్యా మార్గం. అలాంటి వ్యవస్థను మరో సంస్థ పరిధిలోకి తీసుకెళ్లే ముందు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం ఆలోచించాలి. ఉన్న వ్యవస్థ అభివృద్ధికి కృషి చేయాల్సింది పోయి ఇలాంటి నిర్ణయం ఎందుకని? దీని వెనుక ఆలోచన ఏందని? ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పాలిటెక్నిక్ విద్య ప్రైవేట్ పరం కానుంది అనే ఆందోళనలో విద్యార్థులు ఉన్నారు.






**ప్రభుత్వం దృష్టికి కొన్ని అంశాలు?**

పాలిటెక్నిక్ కళాశాలలు స్కిల్ యూనివర్సిటీలో విలీనం అయితే విద్యార్థుల డిప్లొమా గుర్తింపు, ఉన్నత విద్య అవకాశాలు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయి? ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో చదువుతున్న పేద విద్యార్థులపై పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహణలో ఉండే స్కిల్ యూనివర్సిటీలో భవిష్యత్తులో అదనపు ఫీజుల భారం పడదని ప్రభుత్వం హామీ ఇవ్వగలదా? ఆ నమ్మకం లేదు విద్యార్థులకు ఎందుకంటే అక్కడ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నది అంత పారిశ్రామిక వేత్తలే కాబట్టి.

పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా, సరైన ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేయకుండా కేవలం వ్యవస్థను మార్చడం వల్ల విద్యార్థులకు వచ్చే ప్రయోజనం ఏమిటి? సమస్య పాలిటెక్నిక్ విద్యలో ఉందా? లేక దానికి అవసరమైన నిధులు, అధ్యాపకులు, మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యంలో ఉందా? అనే ప్రశ్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కలుగుతుంది. ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వెనుక ఉద్దేశ్యం ఏంటి?

**విలీనం కాదు.. బలోపేతం చేయాలి**

ప్రభుత్వం చేయాల్సింది పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో కలపడం కాదు. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆధునిక సాంకేతిక విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఆధునిక ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయాలి. పరిశ్రమలతో అనుసంధానం చేసి ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు పెంచాలి. క్యాంపస్ ప్లేస్‌మెంట్లను బలోపేతం చేయాలి. విద్యార్థులకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలి. డిప్లొమా తర్వాత ఉన్నత విద్యకు వెళ్లే అవకాశాలను మరింత విస్తరించాలి. స్కిల్ యూనివర్సిటీని అభివృద్ధి చేయాలంటే కొత్త అవకాశాలు సృష్టించాలి కానీ ఉన్న ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీన పరచకూడదు.

ప్రభుత్వ విద్యాసంస్థలను ఒక్కొక్కటిగా కొత్త పేర్లు, కొత్త విధానాల పేరుతో పునర్వ్యవస్థీకరించడం వల్ల చివరకు పేద విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్య దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యను మార్కెట్ అవసరాలకు మాత్రమే పరిమితం చేయకుండా, విద్యార్థుల సామాజిక, విద్యా హక్కులను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు, విద్యార్థి సంఘాలతో బహిరంగ చర్చ నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న రోజు నుండి ఇప్పటివరకు విద్యార్థులంతా రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకొని స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేసే నిర్ణయాన్నిల వెంటనే ఉపసంహరించుకోవాలి.

# డిసెంబర్‌లోగా సచివాలయంలో సోలార్ పార్కింగ్ పనులు పూర్తి

- సిఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, ఆర్ఓబి పనుల్లో వేగం పెంచాలి
- రూ.5,159 కోట్లతో 3,918 కి.మీ.రోడ్ల పనులు మంజూరు
- అధికారులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయంలో చేపడుతున్న సోలార్ కార్ పార్కింగ్ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా సిఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్ పథకం కింద చేపడుతున్న బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి) పనుల్లో వేగం పెంచాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం ఆర్అండ్‌బి శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్మిస్తున్న షెడెడ్ పార్కింగ్ (సోలార్ కార్ పార్కింగ్) పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సోలార్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వస్తే సచివాలయానికి అవసరమైన సుమారు 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా నెలవారీ విద్యుత్ బిల్లులో దాదాపు 16 శాతం ఆదా అవుతుందని మంత్రి తెలిపారు.

**3,918 కి.మీ. రోడ్ల పనులు..**

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.5,159 కోట్లతో 3,918 కి.మీ. మేర 316 రోడ్డు పనులను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. వీటిలో కొన్ని పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మరికొన్ని చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.868 కోట్లతో చేపట్టిన 422.36 కి.మీ. రోడ్ల పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. హై లెవెల్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సేతుబంధన్ పథకం కింద రూ.76 కోట్లతో చేపడుతున్న నార్కట్‌పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. మిర్యాలగూడ, నందిపహాడ్ బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. క్షేత్రస్థాయిలో అధికారులు మరింత కష్టపడి పనిచేయాలని, నాణ్యమైన రోడ్ల నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో ఆర్అండ్‌బి శాఖ ఇఎన్‌సి (అడ్మిన్) లింగారెడ్డి, సిఇలు వసంత్ నాయక్, వనజ, ధర్మారెడ్డి, డిసిఇ అహ్మద్ అబ్దుల్ అలీ, ఇఇ రూప్ కరణ్, డిఇ రూపారాణి, ఎఇఇ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దు రాజకీయ కక్షే

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు కావడం రాజకీయ కక్షలో భాగమేనని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. సిఎం అమెరికా పర్యటన వ్యక్తిగత పర్యటన కాదని, తెలంగాణకు పెట్టుబడులు, విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతికత, ఉపాధి అవకాశాలు తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి విజ్ఞాన, విద్య, నైపుణ్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడం తగదన్నారు. అంతర్జాతీయ విద్యా, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించవచ్చని చెప్పారు. రాజకీయ కక్షలు ఉంటే రాజకీయ వేదికపై ఎదుర్కోవాలి తప్ప యువత భవిష్యత్తును, తెలంగాణ అభివృద్ధిని రాజకీయాలకు బలిచేయరాదని మంత్రి హితవు పలికారు.

**కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజల ఆస్తి.. లోపాలపై నిగ్గు తేల్చాల్సిందే**

కాళేశ్వరం ప్రాజెక్టు ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అది తెలంగాణ ప్రజల ఆస్తి అని, బ్యారేజీల నిర్మాణపరమైన లోపాలపై నిగ్గు తేల్చడంతో పాటు ప్రజాధనానికీ ప్రయోజనం చేకూర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తు భద్రతపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా సమగ్ర శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో వెలుగుచూసిన నిర్మాణపరమైన సమస్యలను కేవలం ఒక బ్యారేజీకి సంబంధించిన అంశంగా కాకుండా, ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం దీర్ఘకాలిక భద్రత, నాణ్యత, జవాబుదారీతనానికి సంబంధించిన అంశంగా చూడాల్సి ఉందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లోని పియర్లపై కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నిర్వహించిన కాంక్రీటు నాణ్యత పరీక్షల్లో లోపాలను గుర్తించిన నేపథ్యంలో ప్రతి అంశాన్ని నిపుణుల సాంకేతిక పరిశీలన ద్వారా నిర్ధారించాల్సి ఉందన్నారు. 19వ పియర్‌లో 73.3 శాతం, 18వ పియర్‌లో 65.5 శాతం, 20వ పియర్‌లో 61.1 శాతం ,17వ పియర్‌లో 50.5 శాతం, 21వ పియర్‌లో 49.9 శాతం, 16వ పియర్‌లో 41.3 శాతం వరకు నాణ్యత లోపాలు ఉన్నట్లు గుర్తించారని చెప్పారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుకు నష్టం ఎందుకు జరిగిందో, బాధ్యత ఎక్కడ ఉందో, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో తమ ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. కేంద్ర సంస్థలు, నిపుణుల సూచనలు, సాంకేతిక పరీక్షల ఫలితాల ఆధారంగానే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు.

# పేద ప్రజల పక్షపాతిగా చెరగని ముద్ర

- సురవరం ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపు




**ప్రజాపక్షం/కరీంనగర్ :** పేద ప్రజల పక్షపాతిగా అలుపెరగని పోరాటాలు చేసి కార్మికుల,కర్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నతమైన గొప్ప మేధావిగా, కమ్యూనిస్టు యోధుడుగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్న సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి కొనియాడారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబమంతా కమ్యూనిస్టు భావజాలం, అభ్యుదయ భావాలతో నిండి ఉందని, ఆయన పెద్దనాన్న సురవరం ప్రతాప రెడ్డి నిజాం కాలంలో తెలుగు సాహిత్యంతో గోల్కొండ పత్రికను స్థాపించారని, సాయుధ పోరాట సమయంలో ఆయన కుటుంబమంతా పోరాటంలో పాల్గొన్నారని, ఆయన వారసత్వాన్ని సుధాకర్ రెడ్డి పుణికిపుచ్చుకున్నారని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ నాయకునిగా ప్రస్థానం ప్రారంభించిన సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి, యువజన సంఘాలకు రాష్ట్ర, జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించే నాయకునిగా ఎదిగారని, కరువుకు నిలయమైన రాష్ట్రంలో సాగు, తాగునీరు కోసం జరిగిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా జరిగిన ఉద్యమంలో బాష్ప వాయువు, లాఠీచార్జిలు, ఫైరింగ్‌కు కూడా ఆయన బెదరకుండా ముందుండి నిలిచారని గుర్తు చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం, సమాచార హక్కు చట్టం, భూ సంస్కరణల చట్టం అమలు చేయడంలో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, సమ్మయ్య, న్యాలపట్ల రాజు, సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపల్లి రాజు, బామండ్లపెల్లి యుగేందర్, మచ్చ రమేష్, దుడ్డేల సమ్మయ్య, బోనగిరి మహేందర్, బూడిద సదాశివ, పిట్టల శ్రీనివాస్, నాయకులు సునావత్ శ్రీనివాస్, అల్లేపు రాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

**సురవరం సుధాకర్ రెడ్డి పాట విడుదల**

సురవరం సుధాకర్ రెడ్డి స్మృతికి గీతాన్ని ఎస్.కె మీరా రచించగా, గడిపె మల్లేష్ సంగీతం, గానం చేసిన పాటను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు. సుధాకర్ రెడ్డిపై పాట రాసిన ఎస్.కె.మీరాను, సంగీతం సమకూర్చి పాడిన గడిపె మల్లేష్‌ను వెంకటరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల సమ్మయ్య, సదానందం, సిపిఐ నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, సమ్మయ్య, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ యథాతథం

- కోర్టులో ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపిస్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయదని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పథకాలపై హైకోర్టులో విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు కాకపోవడంతో కోర్టు స్టే విధించిందని, విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే కౌంటర్‌తో పాటు వెకేట్ పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ అంశంపై హియరింగ్ కూడా పూర్తయిందని వెల్లడించారు.

**ప్రభుత్వ విధానంలో భాగమే సంక్షేమ పథకాలు..**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో భాగమని మంత్రి అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలవడం, ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. హైకోర్టు ప్రభుత్వం తరఫున వినిపించిన వాదనలను పరిగణనలోకి తీసుకుని అనుకూల నిర్ణయం వెలువడుతుందన్న నమ్మకం ఉందన్నారు. పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించే పథకాల విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. పథకం ఆగిపోవాలని కోరుకోవడం, ప్రభుత్వం ఇబ్బందుల్లో పడాలని ఆశించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. పేద ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పథకాల విషయంలో రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అవసరమైతే ప్రతిపక్షాలు కూడా న్యాయస్థానంలో ఇంప్లీడ్ అయి పేద ప్రజల ప్రయోజనాల కోసం తమ వాదనలు వినిపించాలని మంత్రి సూచించారు. న్యాయపరమైన అంశాలను పరిష్కరించుకుంటూనే అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరం అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడలేదు

క్రమశిక్షణ కమిటీ నోటీసుకు వివరణ ఇచ్చిన గడ్డం చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా తాను ఎప్పుడూ మాట్లాడలేదని, గోపాల్‌పేటలో ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయ ప్రారంభోత్సవంలో కూడా ఎవరి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయలేదని టిపిసిసి సీనియర్ నాయకులు డాక్టర్ జి.చిన్నారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు టిపిసిసి క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు మల్లు రవికి లిఖితపూర్వక వివరణ అందజేశారు. గోపాల్‌పేటలో ఆగస్టు 16న జరిగిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా డాక్టర్ చిన్నారెడ్డి వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఆయన వివరణ కోరుతూ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. దీనికి స్పందించిన ఆయన స్థానిక ఎమ్మెల్యేపై అనుచితంగా ప్రసంగించినట్లు వచ్చిన ఆరోపణలను ఖండించారు. గత కొంతకాలంగా ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వివక్షపై తమ ఆవేదనను మాత్రమే కార్యక్రమంలో వ్యక్తం చేశానని, ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదని వివరణలో తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని, పార్టీ క్రమశిక్షణకు ఎప్పుడూ కట్టుబడి ఉంటానని డాక్టర్ చిన్నారెడ్డి స్పష్టం చేస్తూ నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీని కోరారు. తాను విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కలిగి ఉన్నానని, సుదీర్ఘకాలంగా పార్టీలో కొనసాగుతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలను, పార్టీ అగ్రనేతలను తాను ఎంతో గౌరవిస్తానని, అలాంటి నేతలకు వ్యతిరేకంగా మాట్లాడే ప్రశ్నే లేదన్నారు.

# నాపై అవమానకర వ్యాఖ్యలు.. చర్యలు తీసుకోండి

- నా వెనుక కుట్ర నడిపిస్తున్న అసలు వ్యక్తులను గుర్తించాలి
- టిపిసిసి క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనపై, తన కుటుంబ సభ్యులపై పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు బహిరంగంగా అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం వెనుక ఉండి నడిపిస్తున్న అసలు వ్యక్తులను నిష్పాక్షికంగా గుర్తించి, వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని టిపిసిసి క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవిని కోరుతూ ఆమె లేఖ రాశారు. క్రమశిక్షణా కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినప్పటికీ, తనను లక్ష్యంగా చేసుకుని బహిరంగంగా విమర్శలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. కమిటీ విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్లు చేయడం, తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం ద్వారా క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే అంశాన్ని కూడా విచారించాలని కోరారు. సీనియర్ బిసి మహిళా నాయకురాలైన తనపై తీవ్ర వ్యాఖ్యలతో సామూహిక దాడులు జరుగుతున్న సమయంలో పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోందని సురేఖ లేఖలో పేర్కొన్నారు. తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్ చేయడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పార్టీ నాయకత్వం పరిశీలించాలని కోరారు. పార్టీ క్రమశిక్షణపై తనకు పూర్తి గౌరవం ఉందని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడి ఉందని పేర్కొంటూ, ఆ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణా కమిటీని కోరారు.

**సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలి**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తప్పు పట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖను సోదరిలా భావిస్తున్నానని ఆమె కుమార్తె ముఖ్యమంత్రిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డిని మెజారిటీ ఎమ్మెల్యేలు నాయకుడిగా ఎన్నుకున్నారన్న అంశం పార్టీ నిర్ణయాలు, నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు.

## బిసిలను కులాల వారీగా లెక్కించాలి

- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే జనగణన 2027లో ఓబిసి, బిసి కులాల వారీగా జనగణన చేపట్టాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ లేఖ రాశారు. లేఖలో ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగానే బిసిల కులాల గణనను కూడా తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. 1931 తర్వాత బిసిల కులాల వారీ జనాభాకు సంబంధించి ప్రామాణిక సమాచారం అందుబాటులో లేదని పేర్కొన్నారు. 2011 సామాజిక ఆర్థిక కులగణనలో భారీగా భిన్నమైన కుల ఎంట్రీలు నమోదై డేటా విశ్వసనీయతపై సమస్యలు తలెత్తాయని తెలిపారు. జనగణనలో కులాల పేర్లు, పర్యాయపదాలు, ఉపకులాలు, ప్రాంతీయ పేర్లను ప్రామాణీకరించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్రాల ఓబిసి, బిసి జాబితాలను జనగణన డేటాబేస్‌తో అనుసంధానం చేయాలని కోరారు. బిసిలకు సంబంధించిన ఖచ్చితమైన కులాల వారీ డేటా రిజర్వేషన్లు, సంక్షేమం, విద్య, ఉపాధి విధానాలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. జనగణన 2027లో బిసి కులాల గణన శాస్త్రీయంగా, ఏకరీతిగా, విశ్వసనీయంగా జరిగేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని జి.నిరంజన్ డిమాండ్ చేశారు.


GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ

NIT No.17, పని పేరు: 4 పనుల కోసం జిహెచ్ఎంసి, ఆర్‌జెడ్, అత్తాపూర్ సర్కిల్-20 పరిధిలోని వివిధ ప్రాంతాలలో CC రోడ్డు నిర్మాణం, SWD RCC NP3 450 mm పైప్‌లైన్ పునర్నిర్మాణం, అలాగే RCC 600 mm డయా NP3 పైప్‌లైన్ ఏర్పాటు, 450 mm డయా NP3 పైప్‌లైన్ ఏర్పాటు, **అంచనా విలువ / ఇసివి:** రూ.63.55 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:** 24.08.2026 మ.2.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:** 28.08.2026 మ.2.40గం.ల వరకు, **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అత్తాపూర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9492067578, ఇ-మెయిల్ ఐడి: eec20.attapur@gmail.com.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అత్తాపూర్ సర్కిల్-20, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 8480-PP/CL/ADVT/2026-27, Date: 22-08-2026


# ఫోన్ ట్యాపింగ్ కేసులో.. 'వీడని' చిక్కుముడి!

- ఏళ్లు గడుస్తున్నా ముగియని దర్యాప్తు.. వరుసగా నోటీసులు.. విచారణలు
- వందలాది మంది వాంగ్మూలాలు నమోదు.. కీలక వ్యక్తుల చుట్టూ ఇంకా 'సిట్' దర్యాప్తు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. కేసు నమోదై ఏళ్లు గడుస్తున్నప్పటికీ దర్యాప్తు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా కాంగ్రెస్ నాయకుడు మానవతారాయికి సిట్ నోటీసులు జారీ చేయడంతో మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులను సిట్ విచారించింది. అయినప్పటికీ అసలు ట్యాపింగ్ వెనుక ఉన్న పూర్తి వ్యవస్థ, నిర్ణయాలు తీసుకున్నవారు, ఆదేశాలు ఇచ్చినవారు ఎవరు? అనే ప్రశ్నలకు తుది సమాధానం కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

**2024లో మొదలైన కేసు.. ఇంకా కొనసాగుతున్న విచారణ**

హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో 2024 మార్చిలో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైంది. అదే ఏడాది జూన్‌లో తొలి చార్జిషీట్ దాఖలైంది. అందులో అప్పటి ఎస్ఐబి మాజీ అధికారి టి.ప్రభాకర్‌రావు, డిఎస్‌పి ప్రణీత్‌రావు, అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్‌డి రాధాకిషన్‌రావు, వ్యాపారవేత్త శ్రవణ్‌కుమార్‌లను నిందితులుగా పేర్కొన్నారు. కానీ తొలి చార్జిషీట్‌తో కేసు ముగిసిపోలేదు. దర్యాప్తు పరిధి క్రమంగా విస్తరించింది. రాజకీయ నాయకులు,




అధికారులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల వాంగ్మూలాలను సిట్ నమోదు చేస్తూ వచ్చింది. 2026 ఆగస్టు నాటికి 600 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. కేసులో కీలక వ్యక్తులకు వరుసగా నోటీసులు జారీ కావడం ఇప్పుడు సాధారణ పరిణామంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను సైతం సిట్ విచారించింది. ఆయనను ప్రశ్నించిన సందర్భంగా ఫోన్ ఇంటర్‌సెప్షన్‌కు సంబంధించిన నిబంధనలు, అనుమతుల అంశాలపై ప్రధానంగా ప్రశ్నలు వచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అదే సమయంలో పలువురు రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి కూడా సిట్ వివరాలు సేకరించింది. 2026 లోనూ ఈ విచారణల పరంపర కొనసాగుతోంది. అంటే కేసు దర్యాప్తు కేవలం గతంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఘటనలను గుర్తించడానికే పరిమితం కాకుండా ఎవరి ఆదేశాలతో? ఏ వ్యవస్థ ద్వారా? ఎవరెవరి ఫోన్లు? ఏ ఉద్దేశంతో? అనే అంశాల చుట్టూ విస్తరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**600కుపైగా సాక్షులు.. ఇంకా ఎవరెవరు?**

ఒక క్రిమినల్ కేసులో 600 మందికి పైగా సాక్షుల



వాంగ్మూలాలు నమోదు చేయడం దర్యాప్తు ఎంత విస్తృతంగా సాగుతోందో సూచిస్తోంది. అయితే ఇంతకాలం దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరో ప్రశ్న కూడా ముందుకొస్తోంది. ఇంత పెద్దస్థాయిలో దర్యాప్తు జరుగుతున్నప్పుడు అసలు తుది నివేదిక ఎప్పుడనేదే ఇప్పుడు రాజకీయ, న్యాయవర్గాల్లో ఆసక్తి కలిగిస్తున్నది. సిట్ ఇప్పటికే తొలి చార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ, మరిన్ని అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తోంది. అదనపు చార్జిషీట్ దాఖలు చేసే ప్రక్రియపై కూడా 2026 ఆగస్టులో పోలీసు వర్గాలు దృష్టి సారించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసు సాధారణ క్రిమినల్ కేసుల మాదిరిగా కాకుండా సాంకేతిక, రాజకీయ, పరిపాలనా అంశాలతో ముడిపడి ఉంది. ఫోన్ ఇంటర్‌సెప్షన్‌కు సంబంధించిన రికార్డులు, డిజిటల్ ఆధారాలు, కాల్ డేటా, అధికారిక అనుమతులు, అప్పటి అధికారుల పాత్ర, ట్యాపింగ్‌కు గురైన వ్యక్తుల వాంగ్మూలాలు వంటి అనేక అంశాలను పరస్పరం సరిపోల్చాల్సి ఉంటుంది. అందుకే దర్యాప్తు విస్తరించే కొద్దీ కొత్త వ్యక్తుల పేర్లు, కొత్త ఆధారాలు, కొత్త ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

**ట్యాపింగ్ వ్యవహారానికి ముగింపు ఎప్పుడు?**

రెండేళ్ల కాలం గడిచినా కేసులో కొత్త కొత్త పరిణామాలు వెలుగులోకి వస్తుండటం ఈ వ్యవహారం ఎంత సంక్లిష్టంగా మారిందో తెలియజేస్తోందని పోలీసువర్గాలు అంటున్నాయి. ''నోటీసులు జారీ అవుతున్నాయి. విచారణలు జరుగుతున్నాయి. వాంగ్మూలాలు నమోదవుతున్నాయి. చార్జిషీట్‌లు దాఖలవుతున్నాయి. మళ్లీ కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్‌కు అసలు బాధ్యులు ఎవరు? ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? మొత్తం వ్యవహారం వెనుక ఉన్న నిజం ఎప్పుడు బయట పడుతుంది?'' అని రాజకీయ, ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.


ST.JOHN'S P.G. COLLEGE
Chengicherla (V), Medipally(M), Medchal - Malkajgiri (Dist)
(Approved by AICTE, Affiliated to O.U) Ph: 9949490652, 9849139745
CATEGORY "B" (NRI/ MANAGEMENT Quota) NOTIFICATION
Non minority Institute
MBA: 54 & MCA: 18 Seats
Application Fee Rs. 500/- Contact between 10am and 4pm on or before 24th August 2026 Admissions are subject to ratification by TGCHE/OU Fee Reimbursement is not Applicable
Candidates to pay tuition Fee. Processing Fee.
Apply Online: www.stjohnspgcollege.in Contact : 9849139745, 9603216358



భీమ్‌గల్ మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, నిజామాబాద్ జిల్లా

నెం. E1/August/ad/2026 | కొటేషన్ నోటీసు | తేదీ: 22.08.2026

ఏజెన్సీలు / కాంట్రాక్టర్ / అధీకృత డీలర్ లేదా తయారీదారుల నుండి ఈ క్రింద పేర్కొన్న పనులకు సీల్డ్ కొటేషన్లకు ఆహ్వానించడమైనది.

**పని వివరాలు: 1) 4 వీలర్ ఆటో టిప్పర్స్**
1250 కేజీల సామర్థ్యంతోపాటు హైడ్రాలిక్ లిఫ్ట్ ఉండాలి. జిపిఎస్, 70 హెచ్‌పి మరియు కనీసం 3-సిలిండర్ ఇంజన్, ఎల్ఎన్‌టి టెక్నాలజీ(నో యాడ్ బ్లూ) ఐదు సంవత్సరాలు/రెండు లక్షల కి.మీ ప్రయాణం చేయగల ఇంజను వారెంటీ మరియు గేర్ బాక్స్ వారంటీ ఉండాలి. 10x5, 6x3 స్పెయిన్‌లెస్ స్టీల్‌తో కూడిన బోడీ ఉండాలి. (అడుగున 3 ఎంఎం, పక్కవైపుల 2ఎంఎం మందం ఉండాలి) 70 శాతం డ్రై, 30 శాతం వెట్ పార్టిషన్స్‌తో 1400-1500 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగి ఉండాలి.అదేవిధంగా మైక్ సెట్ మరియు మున్సిపల్ బ్రాండ్ పెయింటింగ్ / లోగోతో పైభాగంలో రోలింగ్ కవర్ ఉండాలి. చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్ మరియు బీమా తదితరాలు కూడా ఉండాలి.
**2)ట్రాలర్‌తో కూడిన ట్రాక్టర్:** i)ఇంజన్ 40 హెచ్‌పి, కనీసం 3 సిలిండర్లు, చల్లని నీరు, పేరుగాంచిన హెచ్‌పి కేటగిరీ బ్రాండ్ డీజిల్: 39-42 హెచ్‌పి సింక్రోమెష్ / స్థిరమైన మెష్ పిటిఓ: 540 ఆర్‌పిఎం, హైడ్రాలిక్స్: 1500-1800 kgf లిఫ్టింగ్ సామర్థ్యం, పవర్ స్టీరింగ్ ఫ్యూయల్ ట్యాంక్: 55-65 లీటర్ల సామర్థ్యంతో చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్ మరియు బీమా తదితరాలు ఉండాలి. ట్రాలీ: 85-100 సిఎఫ్‌టి మరియు హైడ్రాలిక్ లిఫ్టింగ్‌తో సింగిల్ యాక్సిల్,హెవీ డ్యూటీ ఎంఎస్ షీట్‌తో రెడ్ ఆక్సైడ్‌తో రెండుసార్లు కోటింగ్ వేసి ఉండాలి. దీంతోపాటు మున్సిపాలిటీ ఆమోదిత బ్రాండ్ కలర్‌ను మున్సిపల్ లోగోతోపాటు లెటరింగ్ ఇతర టూల్‌బాక్స్ రిఫ్లెక్టర్స్, నంబర్ ప్లేటు, ట్రాక్టర్, ట్రాక్టర్ ట్రాలర్‌పై ముద్రితమై ఉండాలి. ఐఎఆర్‌ఎ/ ఆర్‌టిఓ ఆమోదం ఉండాలి.
**3) నీటిని జిమ్మేందుకు వీలుగా ట్రాక్టర్ ట్రాలీపై అమర్చిన నీటి ట్రాక్టర్:** 5000 లీటర్లు సామర్థ్యం+ 2% ట్యాంక్ సైడ్‌లో ఎంఎస్ షీట్ పెయింటింగ్: ఫుడ్‌గ్రేడ్ ఎపోక్సీ 2 కోటింగ్‌లు వేయాలి. వెలుపల: రెండు కోటింగ్‌లు రెడ్ ఆక్సైడ్ వేయాలి దాంతోపాటు మున్సిపాలిటీ ఆమోదిత బ్రాండ్ కలర్‌తో లోగో మరియు లెటరింగ్ డ్రైన్ వాల్వ్, నీటి పరిమాణాన్ని కొలిచే ఇండికేటర్, రిఫ్లెక్టర్, మడ్‌గార్డ్స్, నంబరు ప్లేటు తదితరాలు ఉండాలి.
**4) వినాయక చవితి, దసరా, బతుకమ్మ మరియు ఇతర పండుగలకు ఏర్పాట్లు**
విద్యుత్ దీపాలు, క్రేన్లు, శిక్షణ పొందిన గజఈతగాళ్ళు, బ్యారికేడింగ్, టెంట్లు, కుర్చీలు, లెడ్‌ప్రాజెక్టర్, మైక్ సెట్, డ్రమ్స్, రావణదహన బొమ్మ, కలరింగ్, ఆకుపచ్చ చాపలు, సైడ్‌వాల్స్ మరియు ఇతరాలు.
**5) ట్రాక్టర్‌కు అనుసంధానించి ఉండే ఎర్త్ ఆగరింగ్ మెషీన్:**
చెట్లు నాటేందుకు అనువైన మరియు ఎలాంటి మొక్కలు నాటడానికైనా వీలుగా ఉండే గోతులు తవ్వడానికి అనువుగా ఉండాలి. భూమిలో అత్యంత బలంగా రంధ్రాలుచేసి డ్రిల్లింగ్ చేసే యంత్రం.
**6) ట్రాక్టర్ సహాయంతో వీధులు ఊడ్చేందుకు వీలుగా ఉండే యంత్రం:** పురపాలక సంఘం, వీధి, రోడ్లు శుభ్రం చేయడానికి పక్కవైపుల బ్రష్‌లు మరియు నీరు చిలికే సదుపాయం ఉండాలి.
**7) వన మహోత్సవం:** 6X8 సైజులో మొక్కల సంచులు, 8x10 మరియు 10x12 సైజులలో సంచులు కావాలి. ఇళ్ళకు పంపిణీ చేసేందుకు వీలుగా ఉండాలి. మరియు మొక్కలు నాటే కార్యకలాపాలు,వెదురు బొంగులు, మొక్కలను సంరక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేసే ఇనుప జల్లెడలు తదితరాలు.
**8) ఇంటింటికీ డస్ట్‌బిన్లు:** 10-15 లిట్ ఓపెన్ ఆకుపచ్చ, నీలం రంగు చెత్త బుట్టలు తడిసిన, ఎండిన చెత్త సేకరణకు.
**9) పారిశుద్ధ్య కార్మికులకు మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి దుస్తులు:** సాధారణ చొక్కా మరియు ప్యాంట్, చీరలు, యూనిఫామ్ చొక్కాలు మరియు ప్యాంట్లు, రేడియం జాకెట్లు.
**10) నానావిధ అవసరాలు:** బ్లీచింగ్ మరియు లైమ్ పౌడర్, ట్రాక్టర్, జెసిబి, రోజువారీ వేతనంపై పనిచేసే ఆటో డ్రైవర్స్, రోజువారీ వేతనంపై పనిచేసే ఎలక్ట్రీషియన్, ఆన్‌లైన్‌లో ప్రతి టెండరు వేసేందుకు మరియు ఆన్‌లైన్ ఇ-టెండర్ల సేకరణ, చెట్లు కత్తిరించే యంత్రం, ట్రాక్టర్ టైర్లు, బ్యాటరీలు, LED డ్రైవర్స్, ఎలక్ట్రిక్ పోల్ బాక్సు, జాకెట్లు, నిచ్చెన, బూట్లు, ఎబి కేబుల్స్ మరియు ఇతర పనులు.

25.08.2026 వ తేదీ సాయంత్రం 4.00 గంటల సమయానికి కొటేషన్లను కార్యాలయానికి అందజేయాలి.

ఇతర సమాచారం కోసం మరియు మరిన్ని వివరాలకోసం 8519850388, 9133484671 ఫోన్ నంబర్లకు కార్యాలయం పని గంటలలో సంప్రదించాలి.

DIPR R.O. No. : 8487-PP/CL/ADVT/2026-27, Date: 22-08-2026 సం/- కమిషనర్

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

ప్రజాపక్షం/వంగూర్: మండల పరిధిలోని జాజాల శివారులోని దందుభి వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న జాజాల గ్రామానికి చెందిన రాజిరెడ్డి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాధవరెడ్డి పేర్కొన్నారు.

## మల్‌రెడ్డిపల్లిలో విషాదం

### పాము కాటుతో చిన్నారి మృతి



ప్రజాపక్షం/దామరగిద: దామరగిద్ద మండల పరిధిలోని మల్‌రెడ్డిపల్లి గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ముశ్రీ ఫా మాణిక్యప్ప కుమారుడు శివ కార్తికేయ (18 నెలలు) పాము కాటుకు గురై మృతి చెందాడు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపగా, కుటుంబ సభ్యులు శోక సంద్రంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, శనివారం అర్ధరాత్రి సమయంలో శివ కార్తికేయ తన తల్లిదండ్రులతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్నాడు. అదే సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన ఓ విషసర్పం చిన్నారిని కాటేసినట్లు తెలుస్తోంది. చిన్నారి ఏడవడంతో కుటుంబ సభ్యులు మేల్కొని పరిశీలించగా పరిస్థితి ఆందోళనకరంగా కనపించింది. వెంటనే అతడిని సమీప ఆసుపత్రికి తరలించారు. అయితే చిన్నారి ఆరోగ్యం వేగంగా విషమించడంతో వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 18 నెలల పసిబిడ్డ అకాల మరణంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. బంధువులు, గ్రామస్తులు చిన్నారి మృతి పై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గ్రామంలో శివ కార్తికేయ మృతితో మల్‌రెడ్డిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పసి వయస్సులోనే చిన్నారి మృతి చెందడం ప్రతి ఒక్కరినీ కలచివేసింది.

## చిన్న సన్నకారు మహిళా రైతులను ఎఫ్‌సిసిల్లో చేర్పించాలి



ప్రజాపక్షం/వీపనగండ్ల: మండల పరిధిలోని ప్రతీ గ్రామంలో ఉన్న చిన్న, సన్నకారు మహిళా రైతులందరినీ మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో సభ్యులుగా చేర్పించాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్‌లు సుధాకర్,రవీందర్, డీపీఎం ప్రభాకర్, శిరీష సూచించారు. ఈమేరకు వీపనగండ్ల మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వీఓఏలు, ఏపీఎం, సీసీలు, ఎఫ్‌సిసి సిఇఒ ప్రవీణ్, మహిళా సమాఖ్య సిబ్బందికి శనివారం అవగాహన, దిశానిర్దేశ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ 15 మంది మహిళా రైతులతో ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సభ్యులు ఎంత మొత్తంలో ఈక్విటీ నగదు జమ చేస్తే, అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా జమ చేస్తుందని తెలిపారు. ఎఫ్‌పీసీల ద్వారా వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలను బల్క్‌గా కొనుగోలు చేయడం వల్ల రైతులకు తక్కువ ధరకే అంతుబాటులోకి వస్తాయని చెప్పారు. అలాగే ప్రభుత్వం అందించే వివిధ రకాల సబ్సిడీలను పొందే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఏపిఎం మద్దిలేటి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాల ఎత్తం చిట్టెమ్మ పాల్గొన్నారు.

## సురవరం చిత్రపటానికి నివాళి




ప్రజాపక్షం/గద్వాల్ రూరల్: ప్రజల కోసమే నిరంతరం పరితపించి పోరాడిన కమ్యూనిస్టు దిగ్గజం సురవరం అని సిపిఐ, ఎఐఎస్‌ఎఫ్, ప్రజా సంఘాల నాయకులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ప్రముఖ కమ్యూనిస్టు జాతీయ నేత, మేధావి, మాజీ పార్లమెంటు సభ్యులు, సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి తొలి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన పోరాటాలను నాయకులు గుర్తు చేసుకున్నారు. పేదలు, కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల కోసం సురవరం సుధాకర్ రెడ్డి జీవితాంతం చేసిన సేవలను కొనియాడారు. ప్రజా ఉద్యమాల బలోపేతానికి, సామాజిక న్యాయ సాధనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ నాయకులు నాగర్‌దొడ్డి వెంకటరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిట్టెం కిష్టన్న, జిల్లా సమితి సభ్యులు ఆశన్న, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎల్కూర్ రంగన్న, ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, నాగన్న, టీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు పరమేశ్వరయ్య, స్థానిక నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ రేవతి



ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై మక్తల్ ఎస్ఐ 2 రేవతి విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల తీరు, మోసగాళ్లు అనుసరిస్తున్న విధానాలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రేవతి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో జరుగుతున్నాయని, విద్యార్థులు ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ యాప్స్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఈమెయిల్స్‌ను నమ్మవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైనట్లయితే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని, ఆర్థిక మోసం జరిగితే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ రేవతి తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని, తమ కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ప్రజలకు కూడా అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని ఎస్ఐ రేవతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

### సెప్టెంబర్ 12న జాతీయ లోక్ అదాలత్
### జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు




ప్రజాపక్షం/నారాయణపేట్: రాజీమార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు లోక్ అదాలత్ అత్యంత సమర్థవంతమైన వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. సెప్టెంబర్ 12న నిర్వహించనున్న మూడో జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.నారాయణపేట్ జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్, పోలీస్ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడారు. కక్షిదారులకు లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించి, వీలైనన్ని ఎక్కువ కేసులను రాజీమార్గంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.జూన్ 20న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా 5,300 కేసులు పరిష్కరించగా నారాయణపేట్ జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా 18వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, సంబంధిత సిబ్బందిని ఆయన అభినందించారు.పలు కేసుల పరిష్కారానికి చర్యలుసెప్టెంబర్ 12న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ కేసులు, నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఎన్ఐ యాక్ట్ సేవలు, ఎగ్జిక్యూషన్ పిటిషన్లు ఇపి సైబర్ నేరాల కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్లకు సంబంధించిన కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కార ప్రక్రియను కూడా యథావిధిగా కొనసాగించేలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జీ వింద్యనాయక్, ప్రిన్సిపాల్ జూనియర్, సివిల్ జడ్జి కే అవినాష్, డీఈఈ రాములు, డి.శ్రీనివాసులు, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## నేడు చలో హైదరాబాద్ కార్యక్రమం

### టిఎస్‌సిపిఎస్ఇయు జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి నరసింహ రావు



ప్రజాపక్షం/కల్వకుర్తి: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేస్తూ కల్వకుర్తి డివిజన్‌లో టిఎస్‌సిపిఎస్ఇయు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి నరసింహ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం సబ్ రిజిస్ట్రార్, మున్సిపల్, ఎంపిడిఒ, తహసీల్దార్, వ్యవసాయ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో చలో హైదరాబాద్ పోస్టర్లను విడుదల చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండు చేశారు. భారీ బహిరంగ సభకు డివిజన్, జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతో హాజరై ప్రభుత్వానికి తమ సమస్యను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు, కల్వకుర్తి డివిజన్ అధ్యక్షులు రాజేందర్‌తో పాటు రాజకుమారి, వినోద్, శేఖర్, మహేశ్వరి, శ్రీనివాసులు, రఘురాం పాల్గొన్నారు.

## ఇంటింటికి మొక్కల పంపిణీ



ప్రజాపక్షం/కల్వకుర్తి: పట్టణ పరిధిలోని 10వ వార్డులో పచ్చదనాన్ని పెంపొందించే లక్ష్యంతో కౌన్సిలర్ షేక్ ఏజాస్ ఆధ్వర్యంలో ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఉదయం కౌన్సిలర్ షేక ఏజాస్ స్వయంగా వార్డులోని పలు వీధుల్లో తిరుగుతూ నివాస గృహాల వద్దకు వెళ్లి ప్రజలకు మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. వార్డును పచ్చదనంతో నింపి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే తమ ముఖ్య ఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ షేక్ ఏజాస్ తో పాటు మొహమ్మద్ అకీల్, మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజా పోరాటాల సూర్యుడు సురవరం

### సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్



ప్రజాపక్షం/వనపర్తి: ప్రజా పోరాటల సూర్యుడు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. శనివారం సిపిఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ ఎఐఎస్‌ఎఫ్‌లో విద్యార్థినేతగా జీవితం ప్రారంభించి ఎఐవైఎఫ్ నేతగా ఎదిగి కార్మిక కర్షక బడుగు బలహీన వర్గాల పక్షాన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా, అనంతరం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగారు అన్నారు. రెండుసార్లు ఎంపిగా పనిచేశారు. జీవితమంతా ఉద్యమాలతోనే గడిచిందన్నారు. కమ్యూనిస్టుగా ఆదర్శభావాలతో నిరాడంబర జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. వలస జిల్లా బతుకులన వెలుగులోకి తెచ్చిన సురవరంఉమ్మడి పాలమూరు వలస బతుకులపై అయన పలు వేదికల్లో గళమెత్తారన్నారు. కరువు జిల్లా ప్రాజెక్టుల నిర్మాణం అవసరం నొక్కి చెప్పటమే గాక ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారన్నారు. పాలమూరు జిల్లా ఆకలి చావులను రాష్ట్ర కేంద్ర పాలకుల దృష్టికి ఇచ్చేందుకు జిల్లా నుంచి హైదరాబాద్‌కు పాదయాత్రలు నడిపారని, ఆకలి చావులను నివారించేందుకు పార్టీ పక్షాన అన్నం, అంబలి కేంద్రాల ఏర్పాటుకు కృషి చేశారన్నారు.వనపర్తి జిల్లాతో సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఆయన ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్దులు కావాలన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్, సిపిఐ పట్టన సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిన్న కురుమన్న, సురేష్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు సభ్యురాలు వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి

### కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్




ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడంతో పాటు అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శనివారం ప్రజావాణి సమావేశ మందిరంలో విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఎఫ్ఎల్ఎన్ ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించి, డిగ్రేడ్ లో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలని సూచించారు. పాఠశాల వయస్సు ఉన్న ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పీజీఐలో జిల్లాకు మెరుగైన స్థానం వచ్చేలా పాఠశాలల పనితీరు, హాజరు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులపై దృష్టి పెట్టాలని ఆదేశించా రు. భవితా కేంద్రాల్లోని ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి ఈనెల 31 లోగా సదరం సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్టీ విద్యార్థులకు రాజీవ్ విద్యా దీవెన ద్వారా అందే ఉపకార వేతనాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అం దేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలు బలమైన పునాదిగా నిలిచేలా ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ ఏ.రమేష్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కోటాజి, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.

## నల్ల బ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయుల నిరసన



ప్రజాపక్షం/పానుగల్: నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి నాగార్జున విద్యాలయ ప్రిన్సిపాల్ రూపారెడ్డిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తూ పానుగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరారు. గంజాయి, డ్రగ్స్, మద్యసానం తదితర చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మధ్య ఉండాల్సిన గౌరవ మర్యాదలు మారుతున్న మార్కెటీకరణ, డ్రగ్స్ కల్చర్ వలన అనేక దుష్పరిణామాలకు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రతి జిల్లాకు ఒక మానసిక కౌన్సిలర్ నియమించి ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని అభిప్రాయపడ్డారు అనంతరం ఉపాధ్యాయులందరూ ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎమ్ నాగలీల, ఉపాధ్యాయులు కిరణ్ కుమార్, వెంకట్ స్వామి, శేఖర్ నాయుడు, వెంకయ్య, లక్ష్మణ్, ఆనంద్, మద్దిలేటి, ఖాజా మైనొద్దీన్, మల్లేష్, మల్లేష్ చారి, ఆనంద్ గౌడ్, విజయ్, నరసింహ, విజయలక్ష్మీ, శ్రీలత, పావని, తదితరులు పాల్గొన్నారు.

# కంచుపాడులో సురవరం ప్రథమ వర్ధంతి

### నివాళులర్పించిన సిపిఐ నేతలు



ప్రజాపక్షం/అలంపూర్: జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఉండవెల్లి మండలం కంచుపాడు గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కంచుపాడు గ్రామం ఆయన నివాసంలో ఘనంగా నివాళులర్పించారు. సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం సిపిఐ మండల కార్యదర్శి నాగార్జున మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి ఉద్యమ స్ఫూర్తితో అలంపూర్ నియోజకవర్గ రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ ప్రధాన నినాదాలైన నీరు, నిధులు, నియామకాలు మన నియోజకవర్గంలో ఆనాటి నుండి ఈ నాటి వరకు నెరవేరలేదన్నారు. రెండు వైపులా జలాశయాలు నిండుగా ఉన్నా చుక్క నీరు కూడా ఉపయోగించుకోలేని దుస్థితిలో ఉన్నాం. కాబట్టి రైతులు ఉద్యమ బాటలో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి కంచుపాడు గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సహకరించడంతో సుమారు 5000 మంది మహిళలు సొంత ఉపాధి పొందారని అలాగే కంప్యూటర్ కోచింగ్ ద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి రామకృష్ణ, యువజన సమైక్య మాజీ అధ్యక్షుడు ఎస్.వీరాంజనేయులు, బాలకృష్ణా రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



ప్రజాపక్షం/ఉట్కూర్: ఉట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బోయిన్‌పల్లి కాశమ్మ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఖీ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు చిన్న వెంకటయ్య, జీర్నల్లి కృష్ణ, సంటి హన్మంతు, సాలే లక్ష్మ య్య, మాల శ్రీనివాస్, యువ నాయకులు బోయిన్‌పల్లి, నరేష్ కుమార్, సంటి రాము, కాట్రాజ్, సత్యం, అంజి తదితరులు పాల్గొన్నారు.

## నిధుల కొరతతో పార్థివ వాహన సేవలకు బ్రేక్

### పేదల చివరి ప్రయాణానికీ కష్టాలే
### రెండేళ్లుగా నిధుల విడుదలతో జాప్యం
### ఇంధనం, మరమ్మతుల ఖర్చులకూ ఇబ్బందులు
### ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్




ప్రజాపక్షం/నారాయణపేట్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పేద నిరుపేద కుటుంబాలకు అత్యంత కీలకంగా మారిన పార్థివ వాహన సేవలు నిధుల కొరతతో నిలిచిపోయే పరిస్థితికి చేరుకున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కుటుంబ సభ్యుడిని కోల్పోయిన విషాద సమయంలో మృతదేహాన్ని స్వగ్రామానికి ఉచితంగా తరలించే ఈ సేవలకు నిధుల కొరత ఏర్పడటంతో వాహనాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. తెలంగాణ ప్రభుత్వం 2016 లో రాష్ట్రవ్యాప్తంగా 50 పార్థివ వాహనాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మృతి చెందిన పేద, నిరుపేదల మృతదేహాలను ఉచితంగా స్వగ్రామాలకు తరలించే సేవలను ప్రారంభించింది. జీవీకే ఈఎంఆర్ఐ యాజమాన్యం ఆధ్వర్యంలో ఈ సేవలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలోనూ పార్థివ వాహనాలు అందుబాటులో ఉన్నాయి. రోజుకు సగటున రెండు మృతదేహాలను స్వగ్రామాలకు తరలిస్తూ బాధిత కుటుంబాలకు ఈ వాహనాలను అండగా నిలుస్తున్నాయి. రెండేళ్లుగా నిధుల జాప్యం అయితే గత సుమారు రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి సేవల నిర్వహణకు అవసరమైన నిధులు సకాలంలో విడుదల కావడం లేదని తెలుస్తోంది. దీంతో వాహనాలకు ఇంధనం, మరమ్మతులు, ఇతర నిర్వహణ ఖర్చులు భరించడం నిర్వాహకులకు భారంగా మారినట్లు సమాచారం నిధుల కొరత ఇలాగే కొనసాగితే ఎప్పుడైనా పార్థివ వాహన సేవలు నిలిచిపోయే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పేదలకు పెద్ద అండ కుటుంబ సభ్యుడి మృతితో తీవ్ర విషాదంలో ఉన్న పేద కుటుంబాలకు మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడం మరో ఆర్థిక భారంగా మారుతుంది. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తే వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వ పార్థివ వాహన సేవలు పేద కుటుంబాలకు ఎంతో ఊరట కలిగిస్తున్నాయి. చివరి ప్రయాణంలోనూ ప్రభుత్వ అండగా నిలుస్తున్న ఈ సేవలకు నిధుల కొ రతపై ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి పేదలకు అత్యవసరంగా ఉపయోగపడుతున్న పార్థివ వాహన సేవలు ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిచిపోకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పెం డిం గ్‌లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయడంతో పాటు, వాహనాల ఇంధనం, మరమ్మతులు, నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నా రు. పేదల చివరి ప్రయాణానికి భరోసాగా నిలుస్తున్న ఈ సేవలను నిరంతరాయంగా కొనసాగించేలా ప్ర భుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా రు.

# ప్రజా సేవల్లో పారదర్శకతే లక్ష్యం

### పోలీస్ సిబ్బంది సాంకేతిక నైపుణ్యాలు పెంచుకోవాలి: ఎస్పి



ప్రజాపక్షం/నారాయణపేట్: ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన జవాబుదారీతనంతో కూడి పోలీస్ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్పి డాక్టర్ వినీత్ పోలీసు సిబ్బందికి సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బంది ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం నారాయణపేట్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఎస్పి సమగ్రంగా తనిఖీ చేశారు. ముందుగా పో లీసు సిబ్బంది పరేడ్ నిర్వహించి టర్న్ అవుట్‌ను పరిశీలించారు.అనంతరం స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, మాల్ఖానా, ఆయుధాగారం, వివిధ విభాగాల పనితీరు, సిబ్బంది క్రమశిక్షణ యూ నిఫాం, నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చే ప్రతీ ఒక్కరితో మర్యాదగా వ్యహరించాలని ఎస్పీ సూచించారు. అందిన ఫిర్యాదులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఫి ర్యా దుదారులకు రసీదు అందించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, ప్రజల భద్రత కోసం సిసి కెమెరాలను సమర్థవంతంగా వినియోగించాలని సూ చించారు. రానున్న పండుగలను దృష్టిలో ఉంచుకుని ప్రతీ గ్రామంలో కనీసం నాలుగు సిసి కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాలు, ట్రా ఫిక్ ఉల్లంఘనలు, రౌడీషీటర్లు హిస్టరీ షీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పరిశుభ్రతను పాటించాల ని, ప్రహరీ చుట్టూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.పర్యావరణ పరిరక్షణలో భాగంగా రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్పి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి డిఎస్‌పి మహేష్, సిఐ శివశంకర్, ఎస్ఐ సతీష్ రెడ్డి , ఎస్‌బి ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి, సిసిఎస్ ఎస్ఐ విజయ్ భాస్కర్, ఎస్ఐ 2 మన్యం, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు తనిఖీలు

ప్రజాపక్షం/ధన్వాడ: మత్తుపదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ధన్వాడ మండల కేంద్రంలో ఈగల్ ఫోర్స్ టీం నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ఎస్ఐ మహేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా బస్టాండ్ పాన్ షాపులు, కిరాణం తదితర ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా రవాణా చేస్తున్నా లేదా సరఫరా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నిపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పీసీ పరమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత


### ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు




**ప్రజాపక్షం/సూర్యాపేట (నూతనకల్)** : అక్రమంగా పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు నూతనకల్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఆత్మకూర్(ఎస్) మండలం, రామన్నగూడెం గ్రామానికి చెందిన చలమల్ల వీరస్వామి అతని కుమారుడు చలమల్ల లెనిన్, మిర్యాల గ్రామానికి చెందిన పిడిఎస్ బియ్యం డీలర్ కృష్ణారెడ్డి వద్ద నుండి సుమారు 25 క్వింటాళ్ల బియ్యాన్ని కిలోకు రూ.15 చొప్పున కొనుగోలు చేశారు. అనంతరం ఆ బియ్యాన్ని అశోక్ లేలాండ్ మిని గూడ్స్ వాహనం నంబర్ టిఎస్07 యుజె 0634లో లోడ్ చేసుకొని మామిళ్లమడవ గ్రామ శివారులోని కోళ్లఫారానికి తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు నూతనకల్ పోలీసులు మిర్యాల గ్రామ శివారులో వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 25 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడం లేదా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, విద్యార్థుల ఆరోగ్య రక్షణకు దాతలు ముందుకు వచ్చి సహకారం అందించడం ఎంతో అభినందనీయమని శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సురక్షితమైన నీరు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గార్లపాటి రాఘవ రెడ్డి, గార్లపాటి కరుణాకర్‌రెడ్డి, కంచర్ల లక్ష్మీ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ ప్లాంట్‌ను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఆర్ వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన దాత గార్లపాటి శేఖర్‌రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లావూరి బాలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పెద్ద గాయం ఉపేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, దాతలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లావూరి బాలు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయ సమావేశం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులోజాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. 2026 సెప్టెంబర్ 12వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో, అధిక సంఖ్యలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించి, కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందించాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జి.సబిత, సీనియర్ సివిల్ జడ్జి కమ్ చైర్మన్, మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్.శిరీష,అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి వి.రత్నకుమారి,సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి డి.సత్యయ్య పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్లో రాజీపడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకొని వీలైనన్ని ఎక్కువ కేసులను స్నేహపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి రామన్నపేట సబ్‌ఇన్స్పెక్టర్, మోత్కూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్తో పాటు కోర్టు కానిస్టేబుళ్లు హాజరయ్యారు.జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు న్యాయశాఖ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్కల స్వైరవిహారం భయాందోళనలో రోగులు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వీధి కుక్కల సంచారం తీవ్రంగా పెరగడంతో రోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.ఆసుపత్రి ప్రధాన గేటు నుండి లోపలి వరకు,వరండాలో,రోగులు వైద్యులను సంప్రదించే ఓపీ గదుల్లోకి, వార్డుల్లోకి సైతం కుక్కలు యథేచ్ఛగా ప్రవేశిస్తున్నాయని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం,ఆహార వ్యర్థాలు పేరుకుపోవడంతో కుక్కలు గుంపులుగా చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చికిత్స కోసం వచ్చే గర్భిణీలు,బాలింతలు,చిన్నారులు, వృద్ధులు కుక్కలను చూసి భయంతో వణికిపోతున్నారు.రాత్రి వేళల్లో ఆసుపత్రిలో ఉండే రోగులకు కుక్కలు మరింత ఇబ్బందిగా మారాయని, కొన్నిసార్లు రోగుల మంచాల కిందే పడుకుంటున్నాయని తెలిపారు.దీనివల్ల అంటు వ్యాధులు, ఇన్ఫెక్షన్లు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిని సురక్షితంగా మార్చాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.




# రియాక్టర్ పేలి భారీ విధ్వంసం

- హెజెలో ఫార్మా కంపెనీ తాత్కాలికంగా సీజ్
- ముగ్గురు దుర్మరణం,ఒకరి పరిస్థితి విషమం,8మందికి తీవ్ర గాయాలు
- మృతుని కుటుంబానికి రూ.2.80 కోట్ల పరిహారం
- గాయపడ్డ వారికి మెరుగైన చికిత్సకు పూర్తి బాధ్యత
- కంపెనీ తెరిచే వరకు కార్మికులకు వేతనాలు చెల్లింపు
- బాధితులకు అండగా ఉంటామని అదనపు కలెక్టర్ భాస్కరరావు వెల్లడి









**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : హెజెలో ఫార్మా కంపెనీలో ప్రమాదవశాత్తు రియాక్టర్ పేలి భారీ విధ్వంసంలో ముగ్గురు దుర్మరణం 9 మంది తీవ్రంగా గాయపడ్డ నేపథ్యంలో కార్మికుల భద్రత ప్రమాణాల దృష్ట్యా కంపెనీని తాత్కాలికంగా సీజ్ చేస్తున్నట్టు అదనపు జిల్లా కలెక్టర్ భాస్కరరావు ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు నోటీస్ జారీ చేశారు. వివరాల్లోకి వెళితే హెజెలో బల్క్ డ్రగ్ కంపెనీలో రియాక్టర్ పేలి భారీ విధ్వంసం సృష్టించిన సంఘటన శుక్రవారం రాత్రి సుమారు గం 10.20ని.లకు యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు ధాటికి కంపెనీలో మూడవ షిఫ్ట్ లో పనిచేస్తున్న 18 మంది కార్మికుల్లో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.9మంది తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రులను పోలీసులు హుటాహుటిన మెరుగైన చికిత్స కోసం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు తరలించారు. ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న రసాయన పరిశ్రమ సంఘటన స్థలాన్ని శనివారం కలెక్టర్ సందర్శించి బాధిత కుటుంబాలకు కంపెనీ పూర్తి బాధ్యత వహిస్తుందని డిమాండ్లను యాజమాన్యం ఒప్పుకుందని మీడియా సమక్షంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదానికి గల ముఖ్యమైన కారణాలను వివరించారు. థర్డ్ షిఫ్ట్ పై విధులు నిర్వర్తిస్తున్న మృతులు లిక్విడ్ అమోనియం, హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో అబ్నార్మల్ మిశ్రమం కారణంగా రియాక్టర్ లో ఒక్కసారిగా పేలుడు సంభవించిందని తెలిపారు. ప్రమాదంలో నల్లగొండ జిల్లా వాసి చెన్ను నాగిరెడ్డి(31), ఖమ్మం జిల్లా వాసి నాగనబోయిన నరేష్ కుమార్(29)లో స్పాట్ లోనే మృతి చెందగా సూర్యాపేట జిల్లాకు చెందిన రానబోతు రాజశేఖర్(38) చికిత్స పొందుతూ శనివారం మరణించారు. క్షతగాత్రులైన ఎనిమిది మందిలో మేద శ్రీహరి,వేదుల చెన్నకేశవులు పరిస్థితి విషమంగా ఉంది. చెన్నారెడ్డి శివకుమార్, మరెళ్ళ యోహాను, వేదుల చిన్న, కంభంపాటి ఏసుదాసు, దూడల శివశంకర్, సాకేటి గణేష్ పెంట్యాల రవిలు యశోద, సన్‌షైన్ హాస్పిటల్స్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక అందజేయాలని పోలీసులను ఆదేశించినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2.80 కోట్ల పరిహారం అందజేస్తుందని, బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు మెరుగైన వైద్యం కోసం పూర్తి ఖర్చులు చెల్లించేందుకూ, వైద్యం చేసినా గాయాల నుండి కోలుకోలేని కార్మికులకు నెలవారి జీతం చొప్పున జీతభత్యాలు చెల్లించేందుకు యాజమాన్యం పూర్తి బాధ్యత వహించేందుకు ఒప్పుకుందని వెల్లడించారు. కంపెనీని తిరిగి తెరిచే వరకు 360మంది కార్మికులకు యాజమాన్యం జీతాలు చెల్లిస్తుందని చెప్పారు. బాధిత కుటుంబాలకు యాజమాన్యం పూర్తిగా న్యాయం చేయడానికి సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. అదనపు ఆర్డీవో శేఖర్ రెడ్డి, తాసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, డిఏస్పి మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిశ్రమల డిప్యూటీ కమిషనర్ చంద్ర శేఖర్, పొల్యూషన్ బోర్డ్ ఈఈ వెంకన్న, సీఐలు సతీష్, మన్మధ రెడ్డి, ఎస్సైలు జగన్ భాస్కర్ రెడ్డి, శ్రీకాంత రెడ్డి, డిఎంహెచ్వో మనోహర్, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి ఉన్నారు.



## న్యాయ,పోలీసు వ్యవస్థల సమన్వయంతోనే సత్వర న్యాయం

**ప్రజాపక్షం/నల్లగొండ** : వివిధ కేసులలో సత్వర న్యాయం అందించడంలో న్యాయ, పోలీసు వ్యవస్థల మధ్య సమన్వయం, సహకారం ఎంతో అవసరమని ప్రిన్సిపల్ జిల్లా జడ్జ్ పి.వసంత్ అన్నారు. శనివారం ఉదయాదిత్య భవన్‌లో కేసుల పరిష్కారంలో పై నిర్వహించిన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఒక నాణేనికి ఇరువైపులా ఉన్నట్లుగానే వివిధ కేసుల పరిష్కారంలో న్యాయ,పోలీస్ వ్యవస్థలు ఉంటాయని అన్నారు. కేసుల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేసేందుకు రెండు వ్యవస్థల మధ్య సరైన సమన్వయం అవసరమని, వివిధ కేసుల పరిష్కారంలో ప్రత్యేకించి కష్టతరమైన కేసుల్లో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించడంలో పోలీసు సహకారం అవసరమని తెలిపారు. ఇటీవల జరిగిన ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసును జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ నేతృత్వంలో జిల్లా పోలీసులు సమర్థవంతంగా ఛేదించి నిందితులను త్వరగా పట్టుకోవడాన్ని జిల్లా జడ్జి అభినందించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రిమినల్,అండర్ ట్రయల్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల సత్వర పరిష్కారంలో సమన్వయం ఎంతో అవసరమన్నారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో కేసుల పరిష్కారానికి పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలోఅదనపు జడ్జి కె. కవిత, పోలీస్, న్యాయ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బిఎల్‌ఏల కృషి అభినందనీయం

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్




**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్2026 రెండో విడత ప్రక్రియపై దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శిక్షణ శిబిరంలో దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొని బూత్ లెవెల్ ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలు నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు ఎన్యూమరేష్ ఫారాలను అందించారని తెలిపారు. సర్‌కు ముందు దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,69,098 మంది ఓటర్లు ఉండగా, ఆగస్టు 17న ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో 2.32,283 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మొత్తం 36,815 మంది ఓటర్లను వివిధ కారణాలతో తొలగించినట్లు తెలిపారు. తొలగించిన ఓటర్లలో 7,451 మంది మరణించిన వారు, 7629 మంది డూప్లికేట్ ఓటర్లు, 395 మంది ఆయా చిరునామాల్లో లేనివారు ఉన్నారని, మరో 21,313 మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు గుర్తించినట్లు ఎంఎల్‌ఏ వివరించారు. ప్రస్తుత ఓటరు జాబితాలో 51,427 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఎంఎల్‌ఏ తెలిపారు. ఇందులో 4,784 మంది నో మ్యాపింగ్, 46,643 మంది లాజికల్ ఎర్రర్స్ కింద ఉన్నారని పేర్కొన్నారు. వీరికి సంబంధించి ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 27 వరకు ఆయా గ్రామాల్లోనే గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తారని తెలిపారు. ఈకార్యక్ర మంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్‌నేత, సర్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, ఉపా ధ్యక్షులు వెంకటయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్య దర్శులు, నియోజకవర్గ అన్ని మండలాల అధ్యక్షులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## చిన్నారుల రక్షణ అందరి బాధ్యత : లక్ష్మి శారద



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సమాజంలో చిన్నారులకు సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ పి. లక్ష్మి శారద స్పష్టం చేశారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు (జిల్లా బాలల పరిరక్షణ అధికారులు) నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సును జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె. నరసింహతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అత్యంత కీలకమైన దశ అన్నారు. ఈ దశలో పిల్లలకు కేవలం తిండి, నిద్ర, చదువు మాత్రమే సరిపోవన్నారు. వారి మానసిక, భావోద్వేగ ఎదుగుదలకు తగిన ప్రేమ, సంరక్షణ, సమాన అవకాశాలు అందించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కు, ఆరోగ్యం, రక్షణను ప్రతి బాలుడికి అందేలా చూడాలన్నారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం చట్టరిత్యా నేరమని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కోరారు. అదే సమయంలో మగ పిల్లలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వారి సమస్యలను తెలుసుకుని తగిన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. బడులు, వసతి గృహాల్లో పిల్లల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ముఖ్యంగా 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల ఆలోచనా విధానం రూపుదిద్దుకునే దశ అన్నారు. పోలీసు శాఖ ద్వారా మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పోలీస్ భరోసా, పోలీస్ అక్క, షీ టీమ్స్ వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయని జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ సెక్రటరీ ఫర్హీన్ కౌసర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మమత, జువెనైల్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపాల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అపూర్వ రవళి, జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ పాల్గొన్నారు.

## ప్రజల మనిషి సురవరం సుధాకర్ రెడ్డి



### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి ,లొడంగి శ్రావణ్ కుమార్

**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నడిపిన ప్రజల మనిషి సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి ,లొడంగి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా నల్లగొండ మ గ్దూమ్ భవన్ లో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నాయకుడిగా మొదలైన రాజకీయ ప్రస్థానం,సిపిఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి గా నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా,జీవితమంతా రైతులు, కూలీలు, కార్మికుల మధ్యతరగతి ప్రజల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు. అణగారిన వర్గ ప్రజల హక్కులకై నిరంతరం పోరాటాలు సాగించారు. నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల కోసం డిండి నుండి నల్లగొండ వరకు పాదయాత్ర నిర్వహించి ఫ్లోరైడ్ సమస్యల పై పార్లమెంట్లో సుదీర్ఘ ఉపన్యాసం చేసి దేశ ప్రజల ను నల్గొండ వైపు తిప్పిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి, నాయకులు ముండ్ల ముత్యాలు ఎం నందం ,కె నారాయణ,కొమటిరెడ్డి ప్రద్యుమ్న రెడ్డి,యూసుఫ్, బాసాని వెంకటయ్య,సీతారాములు కౌసల్య,విజయ వీరయ్య పాల్గొన్నారు.

### ఉద్యమ కెరటం కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/మోటకొండూర్** :మోటకొండూరు మండల కేంద్రంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం ఆధ్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న బోళ్ల శీను, బీరకాయల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ మోటకొండూరు మండల నాయకులు బుగ్గ శ్రీశైలం, లక్ష్మీనారాయణ, సిపిఐ మండల సమితి సభ్యులు పల్లె శీను, ఎండి.శంషుద్దీన్, సూదగాని వెంకన్నపాల్గొన్నారు.

### సురవరం ఆశయాలే మార్గం

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరెడ్డి ఆశయాలే మా మార్గమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో స్వర్గీయ సురవరం సుధాకర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం హక్కుల కోసం కార్మికుల, రైతుల పక్షాన ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో సురవరం కృషి వామపక్ష ఉద్యమాలకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, దొంతగాని సత్యనారాయణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ చెనగాని సైదులు, సుందరి పద్మ, యల్లావుల రమేష్, ఉమ, జక్కుల రమేష్, జడ వెంకన్న, చక్రాల స్టాలిన్, రవీందర్‌రెడ్డి, బత్తిని మల్లయ్య, రమణ పాల్గొన్నారు.



## ఎండిపోతున్న వరినార్లు...

# దు:ఖ 'సాగరం'లో అన్నదాతలు!



**ప్రజాపక్షం/హాలియా:** ఎల్‌నినో ప్రభావం రైతులను అతలాకుతలం చేస్తుంది. శ్రీశైలం ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం డ్యాం నీటితో కళకళలాడుతుంది. కానీ దిగువన ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతుంది. రెండు నెలలు వర్షాలు పడకపోతే అప్పుడే కరువు చాయలు అలముకున్నట్లుగా అనిపిస్తున్న తీరు ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. కనీసం కడుపు నింపుకునేందుకు నాలుగు తిండిగింజలు పండించుకునే పరిస్థితి లేకపోవడంతో రానున్న రోజులు మరింత కఠినంగా ఉండబోతున్నాయనే హెచ్చరికలు ప్రస్తుత వాతావరణం తెలియజేస్తుంది. సాగర్ ఆయకట్టుకు ఒక్క పంటకు నీరురాని పరిస్థితి ఏర్పడితే దీని ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో ప్ర స్తుత పరిస్థితులు చెబుతున్నాయి. సాగర్ ప్రా జెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆయకట్టు రైతు లు ఆగస్టు నాటికైనా సాగునీరు వస్తుందని నమ్మకంతో ముమ్మరంగా వరినార్లు పోశారు. కానీ రైతుల ఆశలపై వాతావరణం నీళ్లు చల్లడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు.నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలో ప్రతి ఏడు పది లక్షల ఎకరాలకు పైనే వరి సాగు చేస్తుంటారు. కానీ ఈ ఖరీఫ్ సీజన్లో వర్షభావ పరిస్థితులు ఏర్పడి ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారుగా వ్యవసాయ బావులు, బోర్ల కింద ఒక లక్ష ఎకరాలలో వరి సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆగస్టు నెల వచ్చినా వర్షాలు పడకపోవడంతో ఇక ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్నట్లే అని చెప్పాలి. ఎగువ శ్రీశైలం డ్యాం నిండాలంటే మరో 25 టిఎంసిల నీరు అవసరం ఉంది. ఒక వేళ శ్రీశైలం డ్యాం నుండి దిగువ సాగర్ డ్యాంకు నీటిని వదిలినా ఈ ఖరీఫ్ సాగు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే వరి నార్లు పోసిన రైతులకు కొద్ది గొప్పో నీటి అవకాశం ఉండడం వలన దానిని కాపాడుకోగలిగారు. ఏ అవకాశం లేని రైతులు ఇప్పటివరకు వరి నార్లు కూడా పోయకుండా ఆకాశం వైపే వరుణి రాక కోసం ఎదురుచూస్తున్నారు.

# శాంతియుత వాతావరణంలో ప్రదర్శనలు

### సిపి వి.సి.సజ్జనర్
### మిలాద్ ఉన్ నబీ వేడుకలపై సమావేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలో ఈ నెల 26న నిర్వహించనున్న పవిత్ర మిలాద్‌ఉన్‌నబీ ఊరేగింపు (జులూస్)ను శాంతియుత, ప్రశాంత వాతావరణంలో ఘనంగా జరుపుకోవాలని నగర పోలీస్ కమిషనర్ వి.సి సజ్జనర్ పిలుపునిచ్చారు. బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో శనివారం 'మర్కజ్ ఏ మిలాద్ జులూస్ కమిటీ' ప్రతినిధులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ప్రవక్త జన్మదినం శాంతి, సౌభ్రాతృత్వాలకు ప్రతీక అని, ఆయన అందించిన శాంతి సందేశాన్ని చాటి చెప్పేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గత మూడేళ్లుగా వినాయక నిమజ్జనాలు, మిలాద్ వేడుకలు ఒకే సమయంలో వచ్చినప్పటికీ.. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా తమ ర్యాలీలను వాయిదా వేసుకొని నగర పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించిన కమిటీ పెద్దలకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే విధమైన సమన్వయం కొనసాగాలని ఆకాంక్షించారు. ఊరేగింపు నిర్వహణకు సంబంధించి నిర్దేశిత సమయానికే ర్యాలీని ప్రారంభించి, నిర్ణీత గడువులోగా ముగించాలని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిజెలు, అధిక శబ్ద కాలుష్యం కలిగించే సౌండ సిస్టమ్స్‌పై పూర్తి నిషేధం ఉందని, కేవలం ఆధ్యాత్మిక వాతావరణానికే ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. మైనర్లు వాహనాలు నడపడం, బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్ చేయడం, సైలెన్సర్లు తొలగించి చేసే ర్యాష్ డ్రైవింగ్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. నిర్ణీత తేదీకి ముందే ఎలాంటి బైక్ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో విద్యుత్ దీపాలంకరణల వద్ద భద్రతా ప్రమాణాలు పాటించాలని, జెండాలు విద్యుత్ తీగలకు తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అన్నదాన కేంద్రాల వద్ద ట్రాఫిక్ స్తంభించకుండా వలంటీర్లు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.అంతకుముందు పోలీస్ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ సిపి బందోబస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. బోనాల ఉత్సవాల తరహాలోనే మిలాద్ వేడుకలను ప్రశాంతంగా పూర్తి చేసేలా క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలన్నారు. సున్నిత ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ప్రధాన ఊరేగింపును డ్రోన్లు, సిసిటివిల ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు, విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసేవారిపై, రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఊరేగింపు వాహనాలకు ముందస్తుగా స్టిక్కర్లు కేటాయిస్తున్నామని, అత్యవసర సమయాల్లో సంప్రదించేందుకు ప్రత్యేక సమన్వయ వాట్సాప్ గ్రూపు, హెల్ప్ లైన్ నంబర్ ఏర్పాటు చేశామన్నారు.

## ఆదర్శ నేత సురవరం సుధాకరరెడ్డి

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య



**ప్రజాపక్షం/కొందుర్గు:** సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి మహా త్యాగశీలి అని, ఆదర్శ నేతని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్దుల జంగయ్య అన్నారు. శనివారం సురవరం సుధాకరరెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా కొందుర్గు మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లేడు చౌదరిగూడ మండల కార్యదర్శి, జిల్లా సమితి సభ్యులు జిల్లెల వెంకటేష్, నాయకులు జంగయ్య, సి.జంగయ్య, బి.యాదయ్య, ఎండి రఫీ, రాములు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులను మోసం చేస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి, దివ్యాంగులకు న్యాయం చేయాలని నెట్వర్క్ అఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీ ఆర్గనైసెషన్స్ తరుపున ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా క్యాంపు కార్యాలయంలో పలువురు దివ్యాంగులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు దివ్యాంగులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారులు తప్పనిసరి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని శంకర్‌పల్లి ఎంపిడిఒ వి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. 24న శంకర్‌పల్లి మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపిడిఒ వి.ప్రవీణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## సిసి కెమెరాలతో నేరాల నియంత్రణ

### కొందుర్గు ఎస్ఐ రవీందర్ నాయక్



**ప్రజాపక్షం/కొందుర్గు:** సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని ఎస్ఐ రవీందర్ నాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన నాలుగు సిసి కెమెరాలను ఎస్ఐ రవీందర్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీందర్ నాయక్ మాట్లాడుతూ ఒక్క సిసి కెమెరాల వంద మందితో సమానమని, ప్రతి ఒక్కరు వారి నివాస ప్రాంతాలు, వ్యాపార సముదాయాల్లో విధిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కొందుర్గు పోలీసులు, ఎస్‌ఓటి పోలీసులు ఉన్నారు.

## ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అంధించాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నామని తొమ్మిదిరేకుల సర్పంచ్ బిసా కవిత కరుణాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ నరేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అవినాష్ గౌడ్, జీపిఓ కృష్ణయ్య, వార్డు సభ్యులు పోగుల నర్సింలు, నరేష్, లచ్చిరామ్‌నాయక్, నాగిళ్ల ప్రేమలత యాదయ్య, కందెన సంతోష శివయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తక్షణమే లక్ష్మీదేవిపల్లి పనులు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు త్వరగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పెండింగ్ ప్రాజెక్టుల జేఏసి చైర్మెన్ మిద్దెల సత్యనారాయణ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోకన్వీనర్లు రవీంద్రనాథ్, అర్జునప్ప, బిజిలి సత్యం, తిరుమలయ్య, మందారం నరసింహులు, ఆకాష్, రాములు పాల్గొన్నారు.

## కడ్తాల్‌కు 30 పడకల ఆసుపత్రి



**ప్రజాపక్షం/కడ్తాల్:** హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను శనివారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షులు పోతుగంటి అశోక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండల కేంద్రంలో 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పోతుగంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు

## చెరువుల అభివృద్ధిని పరిశీలించిన హైడ్రా కమిషనర్





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో రెండో విడత చేపట్టిన చెరువుల పునరుద్ధరణ పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాచుపల్లిలోని ఎర్రకుంట, నిజాంపేటలోని తుర్కచెరువు, మూసాపేటలోని కామునిచెరువు అభివృద్ధి పనులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎర్రకుంట వద్ద మురుగునీటి సమస్యను పరిష్కరించేందుకు జిపిఆర్ లే ఔట్‌లో కాలువ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుర్కచెరువు వద్ద ఆలయాలన్నింటిని ఒకే చోటికి తెచ్చేందుకు త్వరలో ఆలయ కమిటీలు, స్థానికులతో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. మురుగునీరు చేరకుండా 1,200 మీటర్ల పైప్ లైన్ నిర్మించనున్నట్టు వెల్లడించారు. చెరువుల్లో దుర్గంధం, దోమల బెడద తగ్గడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కమిషనర్‌కు శాలువతో సత్కరించారు.

## గణేశ్ నిమజ్జనానికి పటిష్ట ఏర్పాట్లు

### మున్సిపల్ కమిషనర్
### వినయ్‌కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న వినాయక చవితి, నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి ఆదేశించారు. తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో జోనల్ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నిమజ్జన మార్గాల్లో గుంతల పూడ్చివేత, ప్యాచ్‌వర్క్ పనులను ముందుగానే పూర్తి చేయాలని, కేబుల్ వైర్లు, చెట్ల కొమ్మల వంటి అడ్డంకులను తొలగించాలని సూచించారు. ప్రధాన చెరువులు, బేబీ పాండ్‌ల వద్ద క్రేన్లు, ముందస్తు భద్రతా చర్యలు, విద్యుత్ దీపాలు, తాగునీరు, మొబైల్ టాయిలెట్ల సదుపాయాలు కల్పించాలన్నారు. ఊరేగింపు మార్గాల్లో ప్రతి 34 కిలోమీటర్లకు ఒక 'గణేశ్ యాక్షన్ టీమ్' చొప్పున ఏర్పాటు చేసి, 24 గంటల పాటు మున్సిపల్ పారిశుధ్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్, జోనల్ కమిషనర్లు రాధీక గుప్త, సచిత్ గగ్వార్, వికాస్ మహతో తదితరులు పాల్గొన్నారు

## రంగారెడ్డి డిసిసి అధ్యక్ష పదవిపై కాంగ్రెస్‌లో సందడి

### జిల్లాకు ఎఐసిసి పరిశీలకుడు..
### అభ్యర్థులతో అభిప్రాయ సేకరణ


**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకి నూతన జిల్లా అధ్యక్షుడి(డిసిసి) ఎంపిక ప్రక్రియలో భాగంగా కర్ణాటక ఎమ్మెల్సీ, ఎఐసిసి కార్యదర్శి పి.వి.మోహన్ పరిశీలకుడిగా రంగారెడ్డి జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎల్‌బి.నగర్ మందమల్ల చౌరస్తా సమీపంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి టిపిసిసి పరిశీలకులుగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈ.వి.శ్రీనివాస్‌రావు హాజరయ్యారు. డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరితో పరిశీలకులు సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితులు,పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, నాయకులు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై అభిప్రాయాలను పరిశీలకులకు వివరించారు.

**డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసిన అభ్యర్థులు...** సమావేశంలో డిసిసి అధ్యక్ష పదవికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల పేర్లు పరిశీలకుల దృష్టికి వచ్చాయి. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం... చల్లా నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి, ఎ.శ్రీనివాస్‌గౌడ్, రఘునందన్ రెడ్డి, చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, కొత్తకుర్మ శివకుమార్, ఇసిశేఖ గౌడ్, ఎస్.గోపాల్ రెడ్డి, నాగేందర్ రెడ్డి, మాల్ రెడ్డి రామ్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, దర్శన్, ఎం.డి. జమీర్, ,జి.మహిపాల్ యాదవ్, బొక్క చెన్నారెడ్డి, దీప భాస్కర్‌రెడ్డి, భీమ్ భరత్, రాజశేఖర్, వెంకటేష్ గౌడ్, గౌరీ సతీష్, జనార్దన్ రెడ్డిలు డిసిసి అధ్యక్షుడి ఎంపిక కోసం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సమావేశంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆసక్తిని రేకెత్తించింది.పార్టీ అధిష్టానం త్వరలో నూతన డిసిసి అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉండటంతో నాయకులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది.




## చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి





### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** చేనేత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను నూతనంగా ఎన్నికైన చేనేత సహకార సంఘం కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేనేత సహకార సంఘాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఇచ్చిన హామీలను ప్రణాళిక బద్ధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు. చేనేత కార్మికులు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేత వస్త్రాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని గుర్తు చేశారు. చేనేత కార్మికులు ఉత్పత్తి చేసే దుస్తులకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం తరుపున అనేక అవకాశాలను చేనేత కార్మికులకు కల్పిస్తున్నామని వివరించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం అధ్యక్షుడు ఈసనగారి రామస్వామి, ప్రధాన కార్యదర్శి చెన్న బాలరాజు, కోశాధికారి అడ్డెట్ల రాజు, డైరెక్టర్లు ఉడుత శేఖరయ్య, ఈసనగారి అంజయ్య, ఈసనగారి శివకుమార్, రాజేష్‌లు పాల్గొన్నారు.

### విద్యారంగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిన మహనీయుడు రాజా బహద్దూర్

విద్యారంగంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పేద విద్యార్థులకు విద్యా అవకాశాలు కల్పించిన మహనీయుడు రాజా బహద్దూర్ వెంకట్‌రాంరెడ్డి అని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న రాజా బహద్దూర్ వెంకట్‌రాంరెడ్డి జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ రాజా బహద్దూర్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు సమాజానికి ఉపయోగపడే విధంగా సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడంతోపాటు విద్యా అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. వారి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమనే విషయాన్ని గుర్తు చేశారు. పోలీస్ అధికారిగా పని చేస్తూ సమాజ అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి వారి చేసిన సేవలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్, రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కొప్పుల మదన్ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి, భార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీధర్, మాజీ జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు పెంటయ్య, మురళీమోహన్, రాజునాయక్, బచ్చలి నరేష్ పాల్గొన్నారు.

### వెనుకబడిన వర్గాల విద్యాభివృద్ధికి వారి మార్గం స్ఫూర్తిదాయకం

వెనుకబడిన వర్గాల విద్యాభివృద్ధికి రాజా బహద్దూర్ వెంకట్‌రాంరెడ్డి చూపించిన మార్గం స్ఫూర్తిదాయకమని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న వెంకట్‌రాంరెడ్డి జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ సమాజంలో విద్యా వెలుగులు నింపేందుకు, యువతకు మెరుగైన భవిష్యత్‌ను అంధించేందుకు వారు చేసిన కృషి ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. వారి ఆశయ స్ఫూర్తిగా యువతకు మెరుగైన భవిష్యత్ అంధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వంకాయల నారాయణరెడ్డి, లక్ష్మీ నరసింహారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మెన్ వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజా రామేశ్వర్‌రెడ్డి, రాములు, కౌన్సిలర్లు శారద శేఖర్, వాణి పాండురంగారెడ్డి, వసంత శ్రీనివాస్, గోపాల్‌లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు సమష్టి కృషి అవసరం

### సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్






**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోహైదరాబాద్‌లో రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడం, ప్రజల్లో బాధ్యతాయుతమైన రహదారి వినియోగంపై అవగాహన పెంచడం లక్ష్యంగా హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సర్వేజనా ఫౌండేషన్,సైబరాబాద్ పోలీసులు సంయుక్త "ఐడియాల్ టౌన్ ఆన్ రోడ్ సేఫ్టీ హైదరాబాద్ "కార్యక్రమాన్ని సిపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్,జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్( ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్ తో కలిసి హాజరయ్యారు.హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తరఫున కార్పొరేట్ అఫైర్స్ ఆపరేటింగ్ హెడ్ ప్రభు నాగరాజ్, సర్వేజనా ఫౌండేషన్ తరపున చైర్మన్ డాక్టర్ ఎ.వి.గురువారెడ్డి, సిఇఒ డాక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఒక కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతే,ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక,సామాజిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ హెల్మెట్, సీట్‌బెల్ట్ వంటి రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. తనకు గతంలో జరిగిన ఒక ప్రమాదంలో సీట్‌బెల్ట్ ధరించి ఉండటం వల్ల తీవ్ర గాయాలు కాకుండా బయటపడిన అనుభవాన్ని సిపి పంచుకున్నారు. ఈ అనుభవం ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాల్సిన అవసరాన్ని తెలియజేస్తుందన్నారు.

### ఇంజినీరింగ్ పరమైన లోపాలు గుర్తించాలి

రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించే సమయంలో హోండా సంస్థ ప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో రహదారి రూపకల్పనలో లేదా ఇతర ఇంజినీరింగ్ పరమైన లోపాలు ఉంటే గుర్తించి, వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ట్రాఫిక్ సన్‌ప్రీత్ సింగ్ కోరారు.

### సురక్షిత రహదారుల నిర్మాణం

ఈ సందర్భంగా సర్వేజనా ఫౌండేషన్ సిఇఒ డా.బి.జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు సురక్షిత రహదారుల నిర్మాణం, సమర్థవంతమైన ఎన్‌ఫోర్స్‌మెంట్, అత్యవసర వైద్య సేవలు కీలకమని అన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం మరింత ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం సర్వేజనా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఎ.వి.గురువారెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు వైద్య సేవలు అందించిన తన అనుభవం రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారించేలా చేసిందన్నారు. ప్రమాదాల తర్వాత ప్రాణాలను కాపాడటంతో పాటు, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో 2022లో సర్వేజనా ఫౌండేషన్‌ను స్థాపించినట్లు తెలిపారు. పాదచారులు,సైక్లిస్టులు, ద్విచక్ర వాహనదారులు అత్యంత ప్రమాదానికి గురయ్యే వర్గాలని పేర్కొంటూ, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, పిల్లలకు తగిన భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిబంధనల పాటింపు ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. విలువైన జీవితానికి సురక్షిత ప్రయాణం సేఫ్ రోడ్స్ ,సేఫ్ లివ్స్" అనే సందేశంతో ప్రజల్లో రోడ్డు భద్రతపై నిరంతర అవగాహన కల్పించడం, బాధ్యతాయుతమైన రహదారి వినియోగాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

తెలంగాణా ప్రభుత్వము

ఫారం-6

(ప్రాథమిక ప్రకటన)

(చట్టం 30/2013 లోని 11(1) మరియు సబ్ రూల్-1, రూల్ 19 ప్రకారం)

| | |
|---|---|
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ ఆర్.సి.నెం. సి/313/2024 | తేది: 31-07-2026 |
| జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2353/2026 | తేది: 03-08-2026 |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/58/2026 | తేది: 05-08-2026 |

ఈ దిగువ నిర్దిష్ట పరచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం, ఊటుపల్లి గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం ఎ. **25.12 1/2 గుంటలు** ప్రజా ప్రయోజనం నిమ్మిత్తం అనగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ క్రింద 12L - డిస్ట్రిబ్యూటరీ కెనాల్, ప్యాకజి నెం.1 ఊటుపల్లి గ్రామము, ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నదని భావించినందున భూసేకరణ, పుణరావాస, పునఃనిర్మాణం కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారిచేయనైనది.

భూసేకరణ వలన భూ నిర్వాసితులయ్యే కుటుంబాలు ఏమియులేవు. నిర్వాసిత కుటుంబాల పుణరావాస, పునఃనిర్మాణం అంశాలకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అధికారిగా నియమించబడినారు. కావున ఈ ప్రాజెక్ట్ క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం ఊటుపల్లి గ్రామంలోని విస్తీర్ణం ఎ. **25.12 1/2 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచయనైనది.

షెడ్యూల్

గ్రామం:: ఊటుపల్లి మండలం:: అన్నపురెడ్డిపల్లి జిల్లా :: భద్రాద్రికొత్తగూడెం

| క్ర. సం. | సర్వే నెం. (సెటిల్మెంట్ ప్రకారం) | సర్వే నెం. (పహాణీ ప్రకారం) | సర్వే నెం. (భూభారతి ప్రకారం) | భూమి (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించవలసిన విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: అనుభవదారుని పేరు | చెట్లు & కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 1. | 122/ 2 | 122/EE 121/E | 122/ఈ 121 | పట్టా | మెట్ట | 1.10 | పోల్కంపల్లిసందీప్ త:వెంకటేశ్వరరావు | పోల్కంపల్లిసందీప్ త:వెంకటేశ్వరరావు | యూకలిప్టస్ |
| 2. | 122/ 2 | 128/E | 128/ఇ | పట్టా | మెట్ట | 0-06 | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | యూకలిప్టస్ |
| 3. | 122/ 2 | 122/A A/A | 122/ఆ /అ | పట్టా | మెట్ట | 0-25 | జిల్లెల్లా ఉషారాణి, భర్త : రాంబాబు | జిల్లెల్లాఉషారాణి, భర్త : రాంబాబు | యూకలిప్టస్ |
| 4. | 123/ 2 | 123/U U | 123/ ఊ/3 | పట్టా | మెట్ట | 0-16 | జోలపల్లి సాంబశివరావు త:చందర్ రావు | జోలపల్లి సాంబశివరావు త: చందర్ రావు | యూకలిప్టస్ |
| 5. | 123/ 2 | 123/E E | 123/ఈ | పట్టా | మెట్ట | 0-09 1/2 | జోలపల్లి పిచ్చయ్యతండ్రి: చంద్రయ్య | జోలపల్లి సత్యనారాయణ త:పిచ్చయ్య | యూకలిప్టస్ |
| 6. | 123/ 2 | 123UU /1 | 123/ ఊ/1/1 | పట్టా | మెట్ట | 0-13 | వేముల సుబ్బయ్య త:పిచ్చయ్య | మామిళ్ళపల్లి వెంకటేశ్వరరావు త:పాపారావు | యూకలిప్టస్ |
| 7. | 123/ 2 | 123/U | 123/ఉ/ 1 | పట్టా | మెట్ట | 0-9 1/2 | బోయినపల్లి సుభద్రభ: సాంబయ్య | బోయినపల్లి సుభద్ర భ: సాంబయ్య | యూకలిప్టస్ |
| 8. | 123/ 2 | 123/E | 123/ ఊ/2/3 | పట్టా | మెట్ట | 0-05 | పెనుగొండ జమలయ్య త:వెంకటేశ్వర్లు | పెనుగొండ జమలయ్య త:వెంకటేశ్వర్లు | యూకలిప్టస్ |
| 9. | 123/ 2 | 123/Lu | 123/ ఊ/2/2 | పట్టా | మెట్ట | 0-05 | పెనుగొండ లక్ష్మ య్యతండ్రి: వెంకటేశ్వర్లు | పెనుగొండ లక్ష్మ య్యతండ్రి: వెంకటేశ్వర్లు | యూకలిప్టస్ |
| 10. | 123/ 2 | 123/U U/1 | - | పట్టా | మెట్ట | 0-16 | వేముల సుబ్బయ్యతండ్రి : పిచ్చయ్య | మామిళ్లపల్లి మురళీకృష్ణ త:పాపారావు | యూకలిప్టస్ |
| 11. | 123/ 2 | 123/U U | 123/ ఊ/1/2 | పట్టా | మెట్ట | 0-10 | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | యూకలిప్టస్ |
| 12. | 124/2 | 124/A A | 124/ఆ | పట్టా | మెట్ట | 0-34 | జొల్లపల్లి సాంబశివరావు త:చంద్రావు | జొల్లపల్లి సాంబశివరావు త: చంద్రావు | యూకలిప్టస్ |
| 13. | 125/ 2 | 125/A | 125/అ | పట్టా | మెట్ట | 0-16 | బొల్లంపల్లి తిరుపతయ్య త:రాఘవయ్య | బోయినపల్లి రాజేష్ త: జగన్మోహన్రావు | యూకలిప్టస్ |
| 14. | 125/ 2 | 125/E | 125/ఇ | పట్టా | మెట్ట | 0-17 | బత్తుల జమలయ్య త:వెంకటస్వామి | బత్తుల జమలయ్య త:వెంకటస్వామి | యూకలిప్టస్ |
| 15. | 125/ 2 | 125/E E | 125/ఈ | పట్టా | మెట్ట | 0-17 1/2 | వేముల వెంకటేశ్వర్లు త:ముత్యాలు | వేముల వెంకటేశ్వర్లు త:ముత్యాలు | యూకలిప్టస్ |
| 16. | 125/ 2 | 125/A A | 125/ఆ | పట్టా | మెట్ట | 0-18 1/2 | జొల్లపల్లి సాంబశివరావు త:చందారావు | జొల్లపల్లి సాంబశివరావు త:చందారావు | యూకలిప్టస్ |
| 17. | 125/ 2 | 125/U | 125/ఉ | పట్టా | మెట్ట | 0-02 | బత్తుల జమలయ్య త:వెంకటస్వామి | బత్తుల జమలయ్య త:వెంకటస్వామి | యూకలిప్టస్ |
| 18. | 127/ 2 | 127/A | 127/ఆ | పట్టా | మెట్ట | 0-14 | జోలపల్లి సాంబశివరావు త: చంద్రావు | జోలపల్లి సాంబశివరావు త: చంద్రావు | యూకలిప్టస్ |
| 19. | 127/ 2 | 127/E E | 127/ఈ | పట్టా | మెట్ట | 0-08 | జోలపల్లి పిచ్చయ్య త: చంద్రయ్య | జోలపలి సత్యనారాయణ త:పిచయ్య | యూకలిప్టస్ |
| 20. | 127/ 2 | 127/U | 127/ఉ/ 1 | పట్టా | మెట్ట | 0-06 1/2 | బోయినపల్లి సుభద్ర త:సాంబయ్య | బోయినపల్లి సుభద్ర త:సాంబయ్య | యూకలిప్టస్ |
| 21. | 127/ 2 | 127/E | 127/ఇ | పట్టా | మెట్ట | 0-02 1/2 | వీరమనేని నాగేశ్వరావు త:పాపయ్య | పెనుగొండ జమలయ్య త:వెంకటేశ్వర్లు | యూకలిప్టస్ |
| 22. | 127/ 2 | 127/E | 127/ఇ | పట్టా | మెట్ట | 0-02 1/2 | వీరమనేని నాగేశ్వరావుతండ్రి : పాపయ్య | పెనుగొండ లక్ష్మ య్యతండ్రి: వెంకటేశ్వర్లు | యూకలిప్టస్ |
| 23. | 127/ 2 | 123/U U | 123/ ఊ/1/2 | పట్టా | మెట్ట | 0-03 | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | యూకలిప్టస్ |
| 24. | 128/ 2 | 123/U U | 123/ ఊ/1/2 | పట్టా | మెట్ట | 0-08 | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | యూకలిప్టస్ |
| 25. | 128/ 2 | 128/E | 128/ఇ | పట్టా | మెట్ట | 0-11 | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | యూకలిప్టస్ |
| 26. | 128/ 2 | 121/A | 121/అ | పట్టా | మెట్ట | 0-20 | జిల్లెల్లా ఉషారాణి భ: రాంబాబు మామిళ్లపల్లి | జిల్లెల్లా ఉషారాణి భ: రాంబాబు మామిళ్లపల్లి | యూకలిప్టస్ |
| 27. | 129/2 | 129/ బూ/ఉ /1 | 129/ బూ/ఉ /1/1 | పట్టా | మెట్ట | 1-02 | ఉమామహేశ్వ రావు త:భాస్కరావు | ఉమామహేశ్వ రావు త:భాస్కరావు | యూకలిప్టస్ |
| 28. | 129/2 | 129/U 129RU /AA/1 | 129/ఉ 129/ బూ/ ఆ/2 | పట్టా | మెట్ట | 0-19 | పోల్కంపల్లి భద్రారావు త:నర్సయ్య | పోల్కంపల్లి భద్రారావు త:నర్సయ్య | యూకలిప్టస్ |
| 29. | 129/2 | 129/R U/AA | 129/ బూ/ ఆ/1 | పట్టా | మెట్ట | 0-20 | పోల్కంపల్లి వరలక్ష్మి భ: ప్రకాశరావు | పోల్కంపల్లి ప్రకాశరావు త: వెంకటసుబ్బయ్య | యూకలిప్టస్ |
| 30. | 129/2 | 129Ru /AA/1 142/G ha/A/1 | 129/ బూ/ ఆ/2 142/ ఘ/అ/ అ1 | పట్టా | మెట్ట | 0.35 | పోల్కంపల్లి భద్రారావు త:నర్సయ్య | పోల్కంపల్లి భద్రారావు త:నర్సయ్య | యూకలిప్టస్ |
| 31. | 129/2 | 133/A | 133/అ | పట్టా | మెట్ట | 0-15 | బోయినపల్లి రాజేశ్వరి భ: పాపారావు | బోయినపల్లి రాజేశ్వరి భ: పాపారావు | యూకలిప్టస్ |
| 32. | 129/2 | 129/R uU | 129/ బు/1/ ఊ | పట్టా | మెట్ట | 0-18 1/2 | మామిళ్లపల్లి శ్రీనివాసరావు త:రామారావు | మామిల్లపల్లి వెంకటేశ్వరరావు, త:కోటేశ్వరావు | యూకలిప్టస్ |
| 33. | 129/2 | 131/A A | 131/ఆ/ 1 | పట్టా | మెట్ట | 0-07 | పోల్కంపల్లి కమల భ:విజయ రామారావు | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | యూకలిప్టస్ |
| 34. | 129/2 | 131/A A | 131/ఆ/ 2 | పట్టా | మెట్ట | 0-07 | ఇమ్మనేని కళావతి భ: మల్లికారున రావు | ఇమ్మనేని కళావతి భ:మల్లికారున రావు | యూకలిప్టస్ |
| 35. | 129/2 | 129/R u/A/2 | 129/ బు/2 | పట్టా | మెట్ట | 0-07 1/2 | మొక్కరాల జ్యోతిర్మయి భ: ప్రసాద్ | మొక్కరాల జ్యోతిర్మయి భ: ప్రసాద్ | యూకలిప్టస్ |
| 36. | 129/ 3 | - | - | - | మెట్ట | 0-09 | - | రోడ్డు | యూకలిప్టస్ |
| 37. | 129/ 4 | 128/A A | 128/ఆ 129/ఆ /ఆ | పట్టా | మెట్ట | 0.39 3/4 | మామిళ్లపల్లి నరేంద్రబాబు త:భాస్కర్ | మామిళ్లపల్లి నరేంద్రబాబు త:భాస్కర్ | యూకలిప్టస్ |
| 38. | 129/ 4 | 129/R u | 129/ బు/1 | పట్టా | మెట్ట | 0-0 1/4 | మామిళ్లపల్లి ప్రసాద్ త:కృష్ణారావు | మామిళ్లపల్లి ప్రసాద్ త:కృష్ణారావు | యూకలిప్టస్ |
| 39. | 130/ 2 | 130/E E | 130/ఈ | పట్టా | మెట్ట | 0-12 1/2 | మామిళ్లపల్లి నరేంద్రబాబు త:భాస్కరావు | మామిళ్లపల్లి నరేంద్రబాబు త:భాస్కరావు | యూకలిప్టస్ |
| 40. | 131/ 2 | 131/A A | 131/ఆ/ 1 | పట్టా | మెట్ట | 0-19 1/2 | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | వరి |
| 41. | 131/ 2 | 131/A A | 131/ఆ/ 2 | పట్టా | మెట్ట | 0-19 1/2 | ఇమ్మనేని కళావతి భ:మల్లికార్జునావు | ఇమ్మనేని కళావతి భ:మల్లికార్జునావు | వరి |
| 42. | 131/ 2 | 131/U/ 2 | 131/ఉ/ 3 | పట్టా | మెట్ట | 0-19 | మొక్కరాల జ్యోతిర్మయి భ: ప్రసాద్ | మొక్కరాల జ్యోతిర్మయి భ: ప్రసాద్ | వరి |
| 43. | 131/ 2 | 131U/1 | 131/ఉ/ 1 | పట్టా | మెట్ట | 0-16 | మామిల్లపల్లి సాయిసుమన్ త:రామారావు | మామిల్లపల్లి సాయిసుమన్ త:రామారావు | వరి యూకలిప్టస్-80 |
| 44. | 131/ 2 | 131/A A | 131/ఆ/ 1 | పట్టా | మెట్ట | 0-05 | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | వరి |
| 45. | 131/ 2 | 131/E | 131/ఇ | పట్టా | మెట్ట | 0-01 | పోల్కంపల్లి ప్రకాశరావు త: వెంకటసుబ్బయ్య | పోల్కంపల్లిప్రకాశ రావు త: వెంకటసుబ్బయ్య | వరి |
| 46. | 132/ 2 | 131/E | 131/ఇ | పట్టా | మెట్ట | 0-0 1/2 | పోల్కంపల్లి ప్రకాశరావు త: వెంకటసుబ్బయ్య | పోల్కంపల్లి ప్రకాశరావు త: వెంకటసుబ్బయ్య | వరి |
| 47. | 132/ 2 | 131/A A | 131/ఆ/ 1 | పట్టా | మెట్ట | 0-04 | పోల్కంపల్లి కమల భ:. విజయ రామారావు | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | వరి |
| 48. | 132/ 2 | 131/A A | 131/ఆ/ 2 | పట్టా | మెట్ట | 0-03 3/4 | ఇమ్మనేని కళావతి భ: మల్లిఖార్జున రావు | ఇమ్మనేనికళావతి భ: మల్లిఖార్జున రావు | వరి |
| 49. | 134/2 | 134/A | 134/అ /2 | పట్టా | మెట్ట | 0-13 1/4 | మామిల్లపల్లి సాయిసుమన్ త:రామారావు | మామిల్లపల్లి సాయిసుమన్ త:రామారావు | వరి |
| 50. | 134/2 | 134/U | 134/ ఊ | పట్టా | మెట్ట | 0-09 1/2 | బోయినపల్లి రామారావు త:. అమ్మయ్యా | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | వరి |
| 51. | 134/2 | 135/A | 135/ఆ | పట్టా | మెట్ట | 0-06 1/2 | వీరమనేని కృష్ణారావు త:వెంకయ్య. | వీరమనేని కృష్ణారావు త:వెంకయ్య | వరి |
| 52. | 134/2 | 134/E E | 134/ ఈ | పట్టా | మెట్ట | 0-05 | పోల్కంపల్లి మురళీకృష్ణ త: ధనుంజయరావు | పోల్కంపల్లి మురళీకృష్ణ త:. ధనుంజయరావు | వరి |
| 53. | 134/2 | 134/E | 134/ఇ/ 1 | పట్టా | మెట్ట | 0-01 | పోల్కంపల్లి వరలక్ష్మి భ: ప్రకాశరావు | పోల్కంపల్లి వరలక్ష్మి భ: ప్రకాశరావు | వరి |
| 54. | 139/2 | 139/A | 139/అ | పట్టా | మెట్ట | 0-02 | వేముల రంగారావు, తండ్రి: శేషయ్య | పోల్కంపల్లి భద్రరావు త:నర్సయ్య | వరి |
| 55. | 140/2 | 137 | 137/ఆ | పట్టా | మెట్ట | 0-07 | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | వరి |
| 56. | 140/2 | 140/A A | 140/ఆ | పట్టా | మెట్ట | 1-01 | వీరమనేని కృష్ణఅర్జునరావు త:వెంకయ్య | వీరమనేని కృష్ణఅర్జునరావు త:వెంకయ్య | వరి |
| 57. | 140/2 | 130/A A | 130/అ /2 | పట్టా | మెట్ట | 0-17 | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | |
| 58. | 142/1/ 2 | 142/Jn a/E | 142/జ్ఞ/ ఇ | పట్టా | మెట్ట | 0-17 1/2 | పోల్కంపల్లి విజయ కుమారి భ: ధనుంజయరావు | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజయరావు | |
| 59. | 142/1/ 2 | 142/G ha/A/ A/1 | 142/ ఘ/అ/ అ1 | పట్టా | మెట్ట | 0-08 1/2 | పోల్కంపల్లి భద్ద్రావు త:నర్సయ్య | పోల్కంపల్లి భద్ద్రావురావు త:నర్సయ్య | |
| 60. | 142/1/ 2 | 142/G na/A | 142/జ/ అ/2- | పట్టా | మెట్ట | 1-31 | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజయావు | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజయావు | |
| 61. | 142/1/ 2 | 142/G na/A | 142/జ్ఞ/ ఆ/1/1/1 | పట్టా | మెట్ట | 0-06 | పోల్కంపల్లి శ్రీనివాసరావు త:ధనుంజయావు | పోల్కంపల్లి శ్రీనివాసరావు త:ధనుంజయావు | |
| 62. | 142/1/ 2 | 142/G na/A | 142/జ్ఞ/ ఆ/1/1/1 | పట్టా | మెట్ట | 0-20 | పోల్కంపల్లి శ్రీనివాసరావు త: ధనుంజయరావు | పోల్కంపల్లి శ్రీనివాసరావు త: ధనుంజయరావు | |
| 63. | 142/1/ 2 | 142/E E | 142/ ఈ/1/3 | పట్టా | మెట్ట | 2-32 | పోల్కంపల్లి సాయిసంతోష్ త:కనకారావు | పోల్కంపల్లి సాయిసంతోష్ త:కనకారావు | పామాయిల్-161 |
| 64. | 142/1/ 2 | 142/G na/A | 142/జ/ అ/2 | పట్టా | మెట్ట | 0-08 3/4 | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజయావు | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజయావు | |
| 65. | 142/1/ 2 | 142/A /U | 142/జ/ అ/1/1/ 2 | పట్టా | మెట్ట | 0-01 /4 | సన్నెపల్లి సత్యనారాయణ త:కృష్ణారావు | సన్నెపల్లి సత్యనారాయణ త:కృష్ణారావు | |
| | | | విస్తీర్ణం : 25.12 1/2 | | | | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాశితులు పునరావాసం మరియు పునఃనిర్మాణం చట్టం, 2013 (నెం. 30/2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబదిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది. భూమీయొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I గారి కార్యాలయంలో ఉంచనైనది సంబధిత వ్యక్తులు ఏదైన పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖి చేసుకోవచ్చును.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణ సంబంధిత సెక్షన్12 ప్రకారం పైతెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టాడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారిచేసిన తేదినుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూమి హక్కు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టారాదు.

భూసేకరణ విషయాలో సంబందించిన భూయజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టం 15వ విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం/భూసేకరణ అధికారి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ వారికి ఇట్టి ప్రకటన జారీచేసిన (60) దినములలోపల ఏమైనా అభ్యంతరములున్న/ యెడల తమ అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసి ఉన్నది.

| | | |
|---|---|---|
| సం/- | సం/- | సం/- |
| యం.వి.రవింద్రనాథ్ | డి.వేణుగోపాల్ | అంకిత్ ఐ.ఏ.ఎస్., |
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీతరామ ఎత్తిపోతల ప్రాజెక్ట్, యూనిట్-1, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | అదనపు కలెక్టర్ (రెవిన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా |


DIPR RO NO. 738/LA/PP/Advt/Pub/2026-27

పార్లమెంట్‌లో ఒకే సెషన్‌లో..

# బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదించే ధోరణి!

## ఎత్తిచూపిన 'పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా' విశ్లేషణ

**న్యూఢిల్లీ :** లోక్‌సభలో సమగ్ర చర్చలకు తావులేకుండా ఒకే సెషన్‌లో బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదించే ధోరణిని పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా విశ్లేషణ ఎత్తిచూపింది. 18వ లోక్‌సభలో ఇప్పటివరకు ప్రవేశపెట్టిన బిల్లులలో సగానికి పైగా బిల్లులను, వాటిని ప్రవేశపెట్టిన అదే సమావేశంలో, ఉభయసభలలో ఆమోదం పొందాయని, గత ఏడాదికాలంగా ఈ ధోరణి విపరీతంగా పెరిగిపోతున్నదని పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ డేటా విశ్లేషణ వెల్లడించింది. పిఆర్ఎస్ సమావేశాల వారీ డేటా విశ్లేషణ ప్రకారం...ఈ లోక్‌సభ ఏర్పడినప్పటి నుంచి ప్రవేశపెట్టిన 64బిల్లులలో 34లేదా 53శాతం బిల్లులు అవి ప్రవేశపెట్టబడిన సమావేశాలలోనే ఉభయ సభలలో ఆమోదించబడ్డాయి. 16వ లోక్‌సభలో ఈ నిష్పత్తి 33శాతంగా ఉంది. అదే సమయంలో ప్రవేశపెట్టబడని 189బిల్లులలో 63బిల్లులు అదే సమావేశంలో ఆమోదం పొందాయి. 17 వలోక్‌సభ హయాంలో ఇది దాదాపు రెట్టింపు అయ్యి 62శాతానికి చేరుకుంది. ఆ సమయంలో ప్రవేశపెట్టిన 190బిల్లుల్లో 117 బిల్లులు అదే సెషన్‌లో ఆమోదం పొందాయని పిఆర్ఎస్ డేటా తెలిపింది. అయితే, పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల పనితీరును పరిశోధించి, పర్యవేక్షించే ఒక స్వతంత్ర, లాభాపేక్షలేని సంస్థ అయిన పిఆర్ఎస్ నిర్వహించే రికార్డుల ప్రకారం 18వ లోక్‌సభ ఈ విషయంలో నిదానంగా ప్రారంభమైంది. 2026 బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన 10బిల్లులలో 5బిల్లులు అదే సమావేశంలో ఆమోదం పొందాయని పిఆర్ఎస్ డేటా వెల్లడించింది. ఆగస్టు 13న ముగిసిన వర్షాకాల సమావేశాలలో ఈ ధోరణి అత్యంత స్పష్టంగా కనిపించిందని, ఈ సమావేశాలు ముగియక ముందే ప్రవేశపెట్టిన 12బిల్లుల్లో 11 బిల్లులు ఆమోదం పొందినట్లు పిఆర్ఎస్ విశ్లేషణ వివరించింది. పెండింగ్‌లో ఉన్న బిల్లు కేవలం ఒకే ఒక్క ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ బిల్లు–2026మాత్రమేనని పేర్కొంది. ప్రభుత్వం



అసలు లెజిస్లేటివ్ ఎజెండాలో ప్రవేశపెట్టి ఆమోదించడం కోసం 5 బిల్లులు, పరిశీలన, ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న రెండు బిల్లులు జాబితా చేయబడ్డాయని, కానీ పార్లమెంట్ చివరికి ఆమోదించిన 11 బిల్లులలో ఆరు అసలు ఎజెండాలో ప్రవేశపెట్టడం కోసం జాబితా చేయబడినవేనని వెల్లడించింది.ప్రభుత్వం ఎజెండాలో పరిశీలన, ఆమోదం కోసం జాబితా చేయబడిన రెండు పెండింగ్ బిల్లుల్లో అంటే..వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్‌ఏ)బిల్లు,–2025, ఫారిన్ కంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ (ఎఫ్‌సిఆర్‌ఏ) బిల్లు, 2026 ఏదీ ఆమోదం పొందలేదని పిఆర్ఎస్ డేటా విశ్లేషణ తెలియజేసింది. విబిఎస్‌ఏ బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీ ఇంకా తన నివేదికను సమర్పించలేదు. కాగా, ఎఫ్‌సిఆర్‌ఏ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో దానిని పార్లమెంట్ సంయుక్త కమిటీకి నివేదించారు. ఒక బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ, అది ఆమోదం పొందేప్పటికి మధ్య తక్కువ వ్యవధి ఉండటం వల్ల, ప్రతిపాదిత చట్టాన్ని పరిశీలించడానికి ఎంపీలకు సమయం తక్కువగా ఉంటుందని, అలాగే, సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపే అవకాశాలు పరిమితం అవుతాయని పిఆర్ఎస్ గతంలోనే ఎత్తిచూపిన విషయం తెలిసిందే. వర్షాకాల సమావేశాలలో పలు బిల్లులపై చర్చించేందుకు వెచ్చించే సమయమే ఈ ఆందోళనకు దారితీసిందని తెలిపింది. పిఆర్ఎస్ ప్రకారం...బిల్లులను ప్రవేశపెట్టే మంత్రి తప్ప మరే ఎంపీ మాట్లాడకుండానే 9బిల్లులు ఆమోదం పొందాయని, 11బిల్లులలో 7 బిల్లులు 5 నిమిషాలు లేదా అంతకంటే తక్కువ సమయంలోనే ఆమెదం పొందినట్లు వివరించింది. 2024బడ్జెట్ సమావేశాలలో ప్రవేశపెట్టిన 11బిల్లుల్లో ఏ ఒక్కటీ ఆ సమావేశంలో ఉభయ సభల ఆమోదం పొందలేదని, ఆ తర్వాత జరిగిన శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టిన నాలుగు బిల్లులు సైతం సమావేశాలు ముగిసేనాటికి పెండింగ్‌లోనే ఉన్నాయని పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా విశ్లేషణ తెలియజేసింది. 2024శీతాకాల సమావేశాలలో పార్లమెంట్‌లో ఆమోదం పొందిన ఏకైక బిల్లు, గత బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన భారతీయ వాయుయాన్ విధేయక్, 2024 మాత్రమేనని పిఆర్ఎస్ పేర్కొంది. 2025 నుంచి ఈ నమూనా మారింది. జులై 20నుంచి ఆగస్టు 13వరకు జరిగిన ఈ ఏడాది వర్షాకాల సమావేశాలలో 19 సిట్టింగ్‌లు జరిగాయని, నీట్–యుజి పేపర్‌లీక్, జంతర్‌మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్య, అయోధ్యలోని రామ మందిరం నుంచి విరాళాల చోరీ పదేపదే అంతరాయాలు ఏర్పడటంతో, లోక్‌సభ తన నిర్ణీత సమయంలో కేవలం 15శాతం మాత్రమే పనిచేయగా, రాజ్యసభ 33శాతం పనిచేసిందని పిఆర్ఎస్ డేటా రీసెర్చ్ విశ్లేషించింది.

# వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

## కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బిజెపి తీర్మానం



**న్యూఢిల్లీ :** వందేమాతరం విషయంలో కాంగ్రెస్ 'బుజ్జగింపు రాజకీయాలకు' పాల్పడుతోందని బిజెపి శనివారం ఆరోపించింది. రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే ఏ పార్టీ లేదా వ్యక్తి గొప్పవారు కాదని స్పష్టం చేసింది. వందేమాతరం గేయంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బిజెపి ఓ తీర్మానాన్ని ఆమోదించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బుజ్జగింపుల కోసం జాతీయ గేయం గౌరవం విషయంలో ఎలాంటి రాజీని అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఢిల్లీలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. వందేమాతరం ఘనమైన వారసత్వాన్ని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి ఒక భారీ ప్రచారాన్ని ప్రారంభిస్తామని బిజెపి పేర్కొంది. ఈ తీర్మానానికి సంబంధించిన వివరాలను నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వందేమాతరాన్ని 'స్వచ్ఛమైన జాతీయ భావానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ప్రకటనను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆరు చరణాలతో కూడిన సంపూర్ణ జాతీయ గేయాన్ని, వందేమాతరంతో ముడిపడిన దేశ స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను యువత అర్థం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని నబీన్ వివరించారు.

# గూర్ఖా సమస్యపై మరో కమిటీ

## మధ్యవర్తి పంకజ్ కుమార్ సింగ్ నేతృత్వం



**సిలిగురి :** పశ్చిమ బెంగాల్‌లో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న గూర్ఖా అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, గూర్ఖా నాయకులు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య శనివారం కీలక సమావేశం జరిగింది. పర్వత ప్రాంత ప్రజల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత రాజకీయ పరిష్కారం కనుగొనడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమే లక్ష్యంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సువేందు అధికారి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ఈ కొండ ప్రాంతానికి చెందిన ఇతర ముఖ్య ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం అనంతరం బిజెపి ఎంపి రాజు బిస్తా మీడియాతో మాట్లాడుతూ గూర్ఖా సమస్యపై తుది ఒప్పందాన్ని రూపొందించడానికి కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. 'మధ్యవర్తి పంకజ్ కుమార్ సింగ్ నాయకత్వంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. నేటి ఒప్పంద ముసాయిదాను ఖరారు చేయడానికి ఈ కమిటీ కృషి చేస్తుంది' అని బిస్తా చెప్పారు. అక్టోబర్ 2025లో, ఈ సమస్య పరిష్కారం కోసం అధికారిక ప్రభుత్వ మధ్యవర్తిగా పదవీ విరమణ చేసిన ఐపిఎస్ అధికారి, మాజీ డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ పంకజ్ కుమార్ సింగ్‌ను హోం మంత్రిత్వ శాఖ నియమించింది. రాజకీయ చర్చలకు నాయకత్వం వహించడం, గూర్ఖా వర్గం దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించడంపై ఆయన పాత్ర కేంద్రీకృతమై ఉంటుంది. 1988లో గూర్ఖా ఒప్పందం కుదిరిన తేదీతో శనివారం నాటి సమావేశం ఏకీభవించడం వల్ల ఇది ఒక చారిత్రాత్మక రోజు అని డార్జిలింగ్ ఎంపి బిస్తా పేర్కొన్నారు. ప్రత్యేక 'గూర్ఖాలాండ్' రాష్ట్రం కోసం జరిగిన హింసాత్మక ఉద్యమం తర్వాత, కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (జిఎన్ఎల్ఎఫ్) మధ్య కుదిరిన ఆ ఒప్పందం 'డార్జిలింగ్ గూర్ఖా హిల్ కౌన్సిల్' (డిజిఎచ్‌సి) ఏర్పాటుకు దారితీసింది. 'పర్వత ప్రాంత ప్రజల పోరాట చరిత్ర నాలుగు దశాబ్దాలకు పైగా సాగింది; ఈ కాలంలో గతంలోని వామపక్ష, టిఎంసి ప్రభుత్వాలు అక్కడి ప్రజల ఆకాంక్షలను అణచివేశాయి. మా ప్రజలు చేసిన త్యాగాలలో దాదాపు 2,000 మంది ప్రాణాలు కోల్పోవడం, 5,000 మందికి పైగా నిరాశ్రయులవ్వడం, మహిళలు హింసకు, అత్యాచారానికి గురికావడం వంటివి ఉన్నాయి' అని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో వివిధ వర్గాల ప్రతినిధులు తమ ఆందోళనలను, అంచనాలను వెల్లడించగా, పర్వత ప్రాంత ప్రజల సమస్యలను ఎలా పరిష్కరించాలని భావిస్తున్నారో అధికారి కూడా వివరించారని బిస్తా తెలిపారు. 'అన్ని వర్గాల వాదనలు విన్న తర్వాత, రాబోయే రోజుల్లో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఎలా కనుగొంటారో వివరిస్తూ షా సమావేశాన్ని ముగించారు' అని ఆ ఎంపి తెలిపారు. డార్జిలింగ్ కొండ ప్రాంత వ్యవహారాలపై ఎన్నికలకు ముందు బిజెపి ఇచ్చిన హామీకి అనుగుణంగా, రాజ్యాంగ పరిధిలో ఉంటూనే అక్కడి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత రాజకీయ పరిష్కారం కనుగొనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరుగుతుందని భావించారు. అమిత్‌షాతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి అధికారితో పాటు గూర్ఖా జనముక్తి మోర్చా (జిజెఎం) అధినేత బిమల్ గురుంగ్, ఆ పార్టీ సీనియర్ నేత రోషన్ గిరి, జిఎన్ఎల్ఎఫ్ అధినేత మన్ ఘిసింగ్, కొండ ప్రాంతానికి చెందిన పలువురు రాష్ట్ర మంత్రులు, బిజెపి ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నిరసనల వలయంలో జార్ఖండ్



## స్కూళ్లలో మౌలిక సదుపాయాల కోసం విద్యార్థులు, పరీక్షల రద్దు కోసం యువత, ఉపాధి కోల్పోతామన్న భయంతో ఉద్యోగులు నిరసనలు

రాంచి : జార్ఖండ్‌లో విద్యార్థులు, యువత, ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలతో అధికార యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మొన్నటి వరకు నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, వాటిని రద్దు చేయాలని ఉద్యోగార్థులు నిరసనలు, నిరాహారదీక్షలు చేయగా, నేడు పరీక్షల రద్దు నోటిఫికేషన్లపై హైకోర్టు స్టే విధిస్తుండడంపై మరోసారి ఆందోళనకు దిగారు. ఇంకో వైపు పరీక్షల రద్దుతో భయాందోళనకు గురవుతున్న ఉద్యోగాలు సచివాలయం ఎదుట నిరసనలు చేస్తున్నారు. తాజాగా పాఠశాలల్లో సరైన వసతులు లేవంటూ విద్యార్థులు ర్యాలీలు చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల్లోనూ అసహనం పెల్లుబికింది. కాగా, తమ ప్రధాన డిమాండ్ అయిన పరీక్షల రద్దు నిర్ణయాన్ని హైకోర్టులో సమర్థవంతంగా సమర్థించుకోవడంలో విఫలమై, హేమంత్ సోరెన్ ప్రభుత్వం తమను మోసం చేసిందని నిరసనకారులు ఆరోపించారు. ఈ ఆందోళనకారులకు బిజెపి మద్దతు ప్రకటించింది మరియు విద్యార్థుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని విమర్శించింది. మరోవైపు, బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను వాడుకుంటోందని అధికార జెఎంఎం ఆరోపించింది. జార్ఖండ్ నియామక పరీక్షలలో అవకతవకలపై 26 రోజుల పాటు సాగిన ఆందోళనను, 22 ఉద్యోగ పరీక్షలను రద్దు చేస్తూ, మరో 23 పరీక్షలపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సద్దుమణిగేలా చేసింది. అయితే, ఈ నిర్ణయం పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుండి మరో నిరసనకు దారితీసింది. ఉద్యోగం కోల్పోతామనే భయంతో వారిలో చాలామంది హైకోర్టును ఆశ్రయించారు. వారి అభ్యర్థనలను విచారించిన జార్ఖండ్ హైకోర్టు, నియామక పరీక్షలను రద్దు చేస్తూ జారీ చేసిన పలు ప్రభుత్వ నోటిఫికేషన్లపై స్టే విధించింది. దీంతో పరీక్షల రద్దును వ్యతిరేకిస్తున్న వారిలో అసహనం పెరిగింది. ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న జెపిఎస్‌సి జెఎస్ఎస్‌సి రిఫార్మ్స్ మంచ్ సభ్యులు శుక్రవారం ఇక్కడి జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. హజారీబాగ్, గిరిడ్డీలలో కూడా ఇలాంటి నిరసనలే జరిగాయి.

### పాఠశాల విద్యార్థుల ర్యాలీ

ఇదిలా ఉండగా, కోడెర్మాలోని కస్తూర్బా గాంధీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో నెలకొన్న అవకతవకలు, అధ్వాన్నమైన మౌలిక సదుపాయాలకు నిరసనగా, సుమారు 300 మంది విద్యార్థినులు శుక్రవారం బ్లాక్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ విద్యార్థులు సత్గవాన్ బ్లాక్ కార్యాలయం వరకు దాదాపు 8 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్ర సందర్భంగా పలువురు విద్యార్థినులు స్పృహ కోల్పోవడంతో, వారిని వైద్య చికిత్స కోసం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించినట్లు సమాచారం. పాఠశాలలోని వివిధ సమస్యలపై విద్యార్థులు పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15న వారు పాఠశాల ప్రాంగణంలో నిరసన చేపట్టగా, అనంతరం బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (బిడిఒ) మనోజ్ కుమార్ రవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు పాఠశాలను సందర్శించారు. అయితే, వారం గడిచినా ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు నిరాశకు గురయ్యారు. దీంతో వారు బ్లాక్ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసనను పునఃప్రారంభించారు. నాసిరకం ఆహారం, విద్యా వ్యవస్థ దుస్థితిపై ఆగ్రహించిన విద్యార్థులు, 'విద్య మా హక్కు, మా హక్కులను సాధించుకోవాలని పిల్లలం నిశ్చయించుకున్నాం' వంటి నినాదాలు చేస్తూ, ప్లకార్డులు పట్టుకుని బ్లాక్ హెడ్ క్వార్టర్స్ వరకు ర్యాలీగా వెళ్లారు. పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులు, పారిశుధ్య సిబ్బంది, తాగునీటి సౌకర్యాలు వంటి ప్రాథమిక సౌకర్యాల కొరత ఉందని విద్యార్థిని రాధికా కుమారి ఎత్తి చూపింది. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో జిల్లా విద్యాధికారి ముకుల్ రాజ్ బ్లాక్ కార్యాలయానికి చేరుకుని, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు. పాఠశాలలోని లోపాలను త్వరలో సరిదిద్దుతామని, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆ హామీతో, విద్యార్థులు తమ పాఠశాలలకు తిరిగి వెళ్లారు.

# రాహుల్ నివాసం వద్ద సిక్కులు ఆందోళన


**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ నివాసం ముందు హైడ్రామా నడిచింది. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల కుటుంబ సభ్యులు, పలువురు సిక్కు నాయకులు నిరసనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ మాజీ నేత సజ్జన్ కుమార్‌ను కొందరు కాంగ్రెస్ నాయకులు హీరో, ఆదర్శప్రాయుడు' (రోల్ మోడల్) అని అభివర్ణించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన కేసులో దోషిగా తేలిన సజ్జన్ కుమార్ గురువారం మృతి చెందిన విషయం విదితమే. కాగా, ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ (డిఎస్‌జిఎంసి) అధ్యక్షుడు హర్మీత్ సింగ్ కాల్కా, ప్రధాన కార్యదర్శి జగదీప్ సింగ్ కహ్లోన్ నాయకత్వంలో నిరసనకారులు, భారీ పోలీసు బారికేడ్ల మధ్య రాహుల్ గాంధీ నివాసం 5, సునేహ్రి బాగ్ రోడ్ వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుల్లో దోషిగా తేలిన సజ్జన్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నిజంగానే 'హీరో'గా భావిస్తోందా లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిఎస్‌జిఎంసి నాయకుడు ఒకరు డిమాండ్ చేశారు. 'సజ్జన్ కుమార్ మరణం తర్వాత, ఆయన మా హీరో అని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవి. సజ్జన్ కుమార్ తమ హీరోనా కాదా అనే విషయంపై రాహుల్ గాంధీ ఈ రోజే స్పష్టత ఇవ్వాలి' అని ఆ నాయకుడు అన్నారు. కాంగ్రెస్ నాయకుడు దీపేందర్ సింగ్ హూడా చేసిన వ్యాఖ్యను ప్రస్తావిస్తూ, సిక్కు సమాజానికి రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని డిఎస్‌జిఎంసి నాయకుడు డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం నిరసనకారులు భారీగా తరలిరావడంతో పోలీసులు రాహుల్ నివాసం చుట్టూ భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు.

## ఇరాక్ చమురు ట్యాంకర్లకు ఇరాన్ అనుమతి

టెహ్రాన్: హోర్ముజ్ జలసంధిలో రాకపోకలను నిలిపివేసినప్పటికీ ఇరాక్ చేసిన అనేక అభ్యర్థనల తర్వాత జలసంధిలో కీలకమైన అనేక చమురు ట్యాంకర్ల ప్రయాణం చేసేందుకు ఇరాన్ పాలకులు అంగీకరించారు. తమ చమురు ట్యాంకర్లను అనుమతించాలని అనేక విధాలుగా ఇరాక్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తుల తర్వాత ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ఆ దేశ చమురు ట్యాంకర్లు జలసంధిలో ప్రయాణించేందుకు ఒప్పుకున్నాయి.ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ గురువారం బాగ్దాద్‌లో పర్యటించి ఆ దేశ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ చమురు ట్యాంకర్లను జలసంధిలో రవాణాకు అనుమతించాలని ఇరాక్ నాయకులు కోరారు. తమ విజ్ఞప్తిని ఇరాన్ నాయకులు అంగీకరించారని ఇరాక్ అధ్యక్షుడు నిజార్ అమిది 'బాగ్దాద్ డైలాగ్ పాలసీ కాన్ఫరెన్స్'లో శనివారంచెప్పారు. టర్కీ,సిరియా,జోర్డాన్ ఓడరేవుల నుండి చమురు ఎగుమతులు చేయడానికి తమ దేశం కృషి చేస్తోందని ఇరాక్ ప్రధానమంత్రి అలీ అల్-జైదీ చెప్పారు. జలసంధిని గడచిన మార్చి నుండి మూసివేయడంవల్ల ఇరాక్ చమురు ఎగుమతులు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. యుద్ధానికి ముందు రోజుకు 140 నౌకలు హోర్ముజ్ జలసంధిలో ప్రయాణం చేసేవి. కానీ ఈ ఆంక్షలు ఐఆర్‌జిసి అమలు చేయడంవల్ల,అక్రమ మార్గాల్లో వెళుతున్న నౌకలపై క్షిపణి–డ్రోన్ దాడులు చేయడంవల్ల రోజుకు 11 నౌకలు మాత్రమే ప్రయాణం చేసే పరిస్థితి వచ్చింది.

# అమెరికా వైఖరితో విఫలమైన కెనడా చర్చలు

- ఒప్పందం చివరి నిమిషంలో మార్పులు అన్యాయం
- డాలర్‌కి డాలర్ సుంకం విధిస్తాం: కెనడా ప్రధాని కార్నీ



ఒట్టావా: కెనడాపై అమెరికా విధించిన భారీ సుంకాల సమస్యపై చర్చలు విఫలమయ్యాయి.దీంతో విస్తారంగా కెనడా నుండి దిగుమతయ్యే అనేక రకాల వస్తువులపై 50 శాతం అమెరికా సుంకాలు శనివారం నుండీ అమలులోకి వచ్చాయి.కెనడా కూడా అమెరికాపై భారీస్థాయిలో ప్రతీకారంగా సుంకాలు విధించేందుకు సిద్ధమైంది. చర్చల చివరి నిమిషంలో ఒప్పందాలలో అమెరికా ప్రతినిధులు చేసిన మార్పులను కెనడా తీవ్రంగా ప్రతిఘటించింది. చివరి నిమిషంలో ఒప్పందంలో మార్పులు అన్యాయం, ఆర్థిక అంశాలకు సంబంధంలేనివి, అంతేకాకుండా ఏ ఒప్పంద విశ్వసనీయతకైనా ఈ నిబంధనలు పరీక్షించేవిగా ఉన్నాయని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ విమర్శించడంతో ఆ దేశ ప్రతినిధులు చర్చల నుండి వైదొలగారు. తమ దేశీయ మార్కెట్లలోకి ప్రవేశించే కెనడా వస్తువులకు ఎవ్వరికీ ఇవ్వనంత ప్రాధాన్యత ఇస్తామని ట్రంప్ ప్రభుత్వం భరోసా ఇచ్చినప్పటికీ కెనడా తిరస్కరించింది. 1930 నాటి సుంకాల చట్టం కింద విధించిన ఈ 50 శాతం టారిఫ్‌లతో కెనడాకు తీవ్ర నష్టం వాటిల్లనున్నది. సుంకాలు తగ్గించాలని కోరుతూ అమెరికాతో కెనడా ప్రతినిధులు చేస్తున్న చర్చలు చివరి నిమిషంలో స్తంభించిపోయాయి. 20 బిలియన్ల విలువైన వస్తువులపై 50 శాతం సుంకాలు అమలులోకి తెస్తున్నట్లు అమెరికా పేర్కొంది. అమెరికా విధించే ప్రతి డాలరు సుంకానికీ ప్రతిగా తాము కూడా ఒక డాలరు సుంకం అమెరికా నుండి కెనడాకు వచ్చే దిగుమతులపై విధిస్తామని మార్క్ కార్నీ ప్రకటించారు. చర్చల్లో ఆ దేశం తరఫున పాల్గొన్న ప్రధాన ప్రతినిధి జెమిసన్ గ్రీర్ మాట్లాడుతూ, వారాలక్రితం అంగీకరించిన నిబంధనల ప్రకారం ఒప్పందం ఖరారు చేసేందుకు కెనడా తిరస్కరించిందన్నారు. చర్చల నుండి వైదొలగుతున్నట్లు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రకటించారు. ఆగస్టు 19వ తేదీ గడువు దాటాక 50 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ రెండు నెలలక్రితమే ప్రకటించారు. దీంతో జులై నుండీ ఇరు దేశాల ప్రతినిధులమధ్యా చర్చలు జరుగుతున్నాయి. అమెరికాకు అనుకూలంగా ఒక మంచి వాణిజ్య ఒప్పందానికి ఇరు దేశాల ప్రతినిధులు దగ్గరగా ఉన్నారని ప్రకటించిన ట్రంప్ సుంకాల అమలు తాత్కాలికంగా నిలిపివేశారు. గడువు ముగియడానికి కొద్దిసేపటి ముందు చర్చల్లో పురోగతి కనిపించినప్పటికీ, ఈ ఒప్పందం కెనడా ప్రజల ప్రయోజనాలు నెరవేర్చేలాలేదని మార్క్ కార్నీ చెప్పడంతో ప్రతినిధులు చర్చల నుండి వైదొలగారు.

గత ఏడాది జనవరిలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటికే దశాబ్దాలుగా వివిధ దేశాలతో అమలులో ఉన్న సుంకాల వ్యవస్థను తల్లక్రిందులు చేశారు. అనేక దేశాలతో వ్యాపారం చేస్తున్నప్పటికీ తమ దేశానికి అన్యాయం జరుగుతోందని, ఇతర దేశాలు భారీఎత్తున తమ డాలర్లు తీసుకుపోతున్నాయని, వారు చాలా చాలా తక్కువ సుంకాలు చెల్లించి ఎక్కువ డాలర్లు తిరిగి తీసుకుంటున్నారని, ప్రతిదేశంతో సమానస్థాయిలో దిగుమతి సుంకాలను అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించిన తర్వాత అమెరికా దిగుమతి సుంకాల ఆదాయం గణనీయంగా పెరిగింది.



## ట్యునీషియాలో వామపక్ష ప్రజా ప్రదర్శనలు

దేశంలో దాహం, అంధకారం, ధరల విపత్తు

ట్యునిస్: ఉత్తర ఆఫ్రికా మెఘర్బ్ ప్రాంత దేశం ట్యునీషియాలో ప్రజలను తీవ్ర నీటి కొరత వెంటాడుతోంది.దీంతోపాటు విద్యుత్ కోతలు, ధరల పెరుగుదల, గణనీయస్థాయిలో క్షీణించిపోయిన ప్రజల కొనుగోలు శక్తి,నిత్యావసర వస్తువుల కొరత, ఆదాయలేమి వంటి సమస్యలు ట్యునీషియన్లను వెంటాడుతున్నాయి. కొద్ది నెలలుగా ఈ సమస్య ఉధృత రూపం దాల్చింది. దీంతో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో వందలాది ప్రజలు వీధులలోకి వచ్చి ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తున్నారు. ప్రతిపక్షంగా ఉన్న వామపక్ష నాయకులు సహా పలు సంస్థలు, సంఘాలు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. ట్యునీషియా విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుంది, ఈ పరిస్థితుల్లో తాము అండగా నిలబడతామని వామపక్షాలకు చెందిన ప్రతిపక్ష నాయకుడు ఎజెద్దీన్ హాజ్జీ చెప్పారు. దేశాన్ని ఎంతమాత్రం పట్టించుకోని వ్యక్తి పరిపాలన సాగిస్తున్నాడని దేశాధ్యక్షుడు కైస్ సయీద్‌పై మండిపడ్డారు. దేశాధ్యక్షుడు ఇప్పటికే అనేక మందిపై ఉగ్రవాద ముద్ర వేసి జైళ్లకు తరలించారు.

నీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. దేశ అధ్యక్షుడు కైస్ సయీద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలో విపరీతంగా పెరిగిపోయిన విద్యుత్ కోతలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నారని, విద్యుత్ కోతలవల్ల అంధకారంలో మగ్గిపోతున్నారని వారు నినాదాలు చేశారు. "దాహం—అంధకారం" అంటూ ప్రదర్శకులు సర్వత్రా ప్లకార్డులు ప్రదర్శించారు. ఒకవైపు దేశంలో తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ స్థితిలో నీటి కొరత ప్రజలను భయపెడుతోంది. "ట్యునిస్ ప్రజలు అవమానాలమధ్య బ్రతుకుతున్నారు, వారికి నీరు లేదు, విద్యుత్ సరఫరాలేదు, స్వేచ్ఛలేదు..." అని మాజీ ప్రజాప్రతినిధి సమీర్ బెన్ అమోర్ విమర్శించారు.అదేవిధంగా రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని కూడా డిమాండ్ చేశారు. ట్యునీషియన్ ఫోరం ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ రైట్స్ చెప్పిన సమాచారం ప్రకారం, ఇటీవలి వారాల్లో ట్యునీషియా దేశవ్యాప్తంగా వందలకొద్దీ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. వీటిల్లో ఎక్కువగా నీటి కొరత పరిష్కారం, విద్యుత్ సరఫరా కోసమే.

## చర్యలు (మొదటి పేజీ తరువాయి)

చర్చించినట్లు ఆయన వెల్లడించారు. సమావేశం అనంతరం కమిటీ వైస్ చైర్మన్ ఎ.శ్యామ్ మోహన్‌తో కలిసి మల్లు రవి మీడియాతో మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ ఇచ్చిన వివరణను, కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కమిటీ పరిశీలించిందని, ఈ వ్యవహారంపై చాలా మంది నాయకులు ఫిర్యాదులు చేస్తున్నారని, అందరి ఫిర్యాదులు అందిన తర్వాత పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి వెల్లడించారు. సొంత కూతురు చేసిన వ్యాఖ్యలను కనీసం మంత్రిగా ఖండించాల్సిన బాధ్యత కొండా సురేఖపై ఉందని, అయితే సహజ న్యాయ సూత్రాల ప్రకారం తనకు ఆ వ్యాఖ్యలతో సంబంధంలేదని చెబుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ నిబంధనల ప్రకారం ముందుకెళ్తుందని మల్లు రవి తెలిపారు. రాజగోపాల్‌రెడ్డిపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఈ అంశాన్ని సుమోటోగా తీసుకోవాలా? లేదా? అనే విషయాన్ని కమిటీ పరిశీలిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కూడా పరిశీలించామని మల్లు రవి తెలిపారు. ఆయనపై ఎమ్మెల్యే మేగారెడ్డి ఫిర్యాదు చేశారని, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణను కూడా కమిటీ పరిశీలించిందన్నారు. ఫిర్యాదు చేసిన మేగారెడ్డిని మరోసారి పిలిచి వివరణ తీసుకున్న అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆదిలాబాద్‌లో జరిగిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి, సంజీవ రెడ్డిల మధ్య జరిగిన వివాదంపై ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత ఎల్‌బి నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన మధు యాష్కిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు గాంధీ భవన్ వేదికగా తన అనుచరులతో గొడవకు దిగినందుకే ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు.

# అమెరికా ఆర్థిక ఆంక్షలను దీటుగా ఎదుర్కొంటాం

- ఇరాన్ స్పీకర్ ఘాలిబాఫ్
- పాతకాలపు వలసవాదం తిరిగొచ్చినటే: బఖాయి హెచ్చరిక
- ఒప్పందానికి వాళ్ళు సిద్ధంగా లేరు: ట్రంప్



టెహ్రాన్: అమెరికా ఆర్థిక–వాణిజ్య ఆంక్షలు దీటుగా ఎదుర్కొంటామని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ చెప్పారు. ఇరాన్ పేరు వింటేనే శత్రువులు భయపడేవిధంగా దేశాన్ని తీర్చిదిద్దుతామని ఇరాన్ సర్వాధినేత ప్రధాన సైనిక సలహాదారు మేజర్ జనరల్ యాహ్యా రహీమ్ సఫవి హెచ్చరించారు. ఈ ఆంక్షలు సరిహద్దులకు అతీతంగా ప్రతి సార్వభౌమాధికార దేశాన్నీ సవాలు చేయడమేనన్నారు. ఇరాన్ రక్షణ పరిశ్రమ దినోత్సవం సందర్భంగా పలువురు ఇరాన్ నాయకులు స్పందించారు.

దేశ సైనిక బలాన్ని పెంపొందించుకోవాలన్న జాతీయ సంకల్పానికి ఈ రక్షణ పరిశ్రమ దినోత్సవం ఒక ప్రతీక అని సఫవి చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆయుధ సామర్థ్యం ద్వారా సైన్యాన్ని బలోపేతం చేస్తామన్నారు.ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయి స్పందిస్తూ, ఇరాన్‌పై ట్రంప్ ప్రకటించిన ఆర్థిక ఆంక్షలు ఐక్యరాజ్యసమితి ఛార్టర్ 2(1)లోని సార్వభౌమాధికార సమానత్వ సూత్రాలను ఉల్లంఘించడమేనన్నారు.ప్రపంచంలో అన్నిదేశాలను సరిహద్దులకు అతీతంగా సవాలు చేయడమేనని విమర్శించారు.ఈ ఉల్లంఘనతో పాతకాలపు వలసవాదాన్ని తిరిగి ప్రవేశపెట్టినట్టేనని విమర్శించారు. ఎక్స్‌వేదికగా పోస్టింగ్ పెడుతూ, ట్రంప్ ఆర్థిక ఆంక్షలు ఐక్యరాజ్యసమితిలో సభ్యులుగా ఉన్న ప్రతిదేశంపైనా అమెరికా తన సార్వభౌమాధికారాన్ని ప్రకటించినట్లే కాగలదని పేర్కొన్నారు.ప్రతి సార్వభౌమాధికార దేశానికీ ప్రత్యేక అధికార పరిధి ఉంటుందని, వాటి బ్యాంకులు,విమానాశ్రయాలు,సంస్థలపై మూడోదేశం ఒత్తిడి తీసుకురాకూడదన్నారు. ఈ విధమైన ఆంక్షలకు అంతర్జాతీయ చట్టాలలో ఎలాంటి అధికారాలు లేవన్నారు.ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ స్పందిస్తూ, అమెరికాపై ఇరాన్ ఆధిపత్యస్థానంలో ఉన్నందువల్ల యుద్ధం ముగించేందుకు ఇదే సరైన తరుణమని అన్నారు. యావత్ ప్రపంచం ఇరాన్ విజయాన్ని ఆమోదించిందన్నారు.

అదేసమయంలో డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, అమెరికాకు అనుకూలంగా 'సరైన ఒప్పందం' చేసుకోవడానికి ఇప్పటికీ ఇరాన్ సిద్ధంగా లేదన్నారు. చరిత్రలో ఏ దేశంమీదా ఇంతవరకూ ప్రయోగించని కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నామని, దీంతోపాటే సైనిక చర్యల ప్రత్యామ్నాయాన్ని కూడా తాము వదులుకోలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏం పరిణామాలు సంభవిస్తున్నాయో అమెరికా జాగ్రత్తగా గమనిస్తోందని అన్నారు. ''ప్రస్తుతం మేం అన్నీ గమనిస్తున్నాం, అంతే'' అన్నారు. ఇరాన్‌కు ఏ విధమైన జీవనాధారాన్ని అందించకూడదని ట్రంప్ ఆంక్షలు విధించారు. ఏదో ఒక మార్గంలో ఇరాన్‌కు జీవనాధారం అందించే, ఆ దేశంతో సంబంధాలు కొనసాగించే దేశాలు కూడా తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటాయని కూడా ఆయన మూడు రోజులక్రితం హెచ్చరించారు. ఈ ఆంక్షలకు సంబంధించిన ప్రణాళికాబద్ధమైన నిబంధనలను సోమవారం (ఆగస్టు 24) ప్రకటిస్తామని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. హోర్ముజ్ జలసంధికి సంబంధించిన మొత్తం ప్రాంతంపైన,దాని లోపలి భాగాలపైన కూడా అమెరికా సైనిక బలగాలు సెంట్‌కామ్‌కు నియంత్రణ ఉందని, అందువల్ల ఇరాన్ అనివార్యంగా తమతో ఒక ఒప్పందం చేసుకోవడానికి ముందుకు రావాల్సి ఉందని, కానీ వారు అందుకు సిద్ధంగా లేరని అన్నారు.

ఇదే సమయంలో హోర్ముజ్ జలసంధిలో అమెరికా ఆధిపత్యాన్ని తిరస్కరిస్తూ ప్రాంతీయ దేశాల సహకారాన్ని కూడగడుతోంది. ఒమన్‌తో మధ్యలో ఆగిపోయిన చర్చలు పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. హోర్ముజ్ జలసంధిని ఒమన్‌తో కలిసి నిర్వహించాలని, కొత్తగా ప్రధాన జలమార్గాలను ఏర్పాటు చేయాలని ఇరాన్–ఒమన్‌లు ఇంతకుముందు జరిపిన చర్చల్లో నిర్ణయించాయి. ఈ ప్రయత్నాలను ముందుకు తీసుకువెళ్ళేందుకు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి శనివారం ఒమన్ విదేశాంగమంత్రి సయ్యద్ బద్ర్ అల్–బుసైదీతో ఫోన్‌లో సంభాషించారు. హోర్ముజ్ జలసంధిలో పరిస్థితి, ప్రాంతీయ పరిణామాలు, చర్చలు పునఃప్రారంభానికి అనువైన సమయం గురించి చర్చించారు. హోర్ముజ్ జలసంధి నిర్వహణలో ఇరాన్‌తో చేతులు కలిపితే మిత్రదేశమని కూడా చూడకుండా దాడులు చేస్తామని అమెరికా ఇప్పటికే ఒమన్‌కు ఒక హెచ్చరిక చేసింది.

(మొదటి పేజీ తరువాయి)

# 'నిర్మల్' పర్యాటకం!

అభివృద్ధి హామీలు కేవలం నీటిమూటలవుతున్నాయి. అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నప్పటికీ, వాటిని సద్వినియోగం చేసుకుని జిల్లాకు ఆదాయం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయం. నిత్యం వేలాది మంది భక్తులు తమ చిన్నారుల అక్షరాభ్యాసం కోసం ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇక్కడికి తరలివస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న క్షేత్రంలో భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. స్వచ్ఛమైన తాగునీరు, తగినన్ని విశ్రాంతి గదులు, పరిశుభ్రమైన శౌచాలయాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి నది తీరంలో స్నానఘట్టాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. మాస్టర్ ప్లాన్ పేరుతో ఎన్నో ఏళ్లుగా ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో జరిగిన అభివృద్ధి శూన్యం.

నిర్మల్ పట్టణానికి తలమానికంగా నిలిచే చారిత్రక నిర్మల్ కోట (శ్యామ్‌గఢ్) పరిస్థితి దయనీయంగా మారింది. ఫ్రెంచ్ ఇంజనీర్ల సహకారంతో ఎంతో వ్యూహాత్మకంగా నిర్మించిన ఈ కోట నేడు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి శిథిలావస్థకు చేరుకుంది. పర్యాటకులకు కనీస భద్రత, రాత్రివేళ లైటింగ్, గైడ్ల సదుపాయం లేకపోవడంతో ఈ అరుదైన చారిత్రక సంపద ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. స్వాతంత్ర్య సమరంలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిన నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ 'వెయ్యిగూడల మర్రి' ప్రాంతం నేడు పాలకుల ఘోర నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. బ్రిటిష్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాట బాట పట్టిన వీరుడు రాంజీ గోండ్ తో పాటు ఆయనతో పోరాడిన 1,000 మంది విప్లవకారులను ఆంగ్లేయులు ఒకే మర్రిచెట్టుకు ఉరితీసిన అత్యంత వీరోచిత, విషాదభరితమైన పోరాట చరిత్ర ఈ నేలకు ఉంది. దేశ చరిత్రలోనే మరే ప్రాంతంలోనూ లేని ఇటువంటి వీరగాథలు ఉన్నప్పటికీ, ఈ ప్రాంతాన్ని కనీసం ఒక ప్రాధాన్య పర్యాటక స్మారక కేంద్రంగా అభివృద్ధి చేయకపోవడం అధికారుల, పాలకుల అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. మరోవైపు, వందల ఏళ్ల ఘన చరిత్ర కలిగిన, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన నిర్మల్ కొయ్య బొమ్మలు, నమూనా పెయింటింగ్స్ కళ కూడా ప్రభుత్వ ప్రోత్సాహం లేక మరుగున పడుతోంది. కళాకారులకు ముడిసరుకైన పొనికి కర్రల కొరత, సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో వారు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్నారు. క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు హామీ ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైంది.

**ప్రకృతి రమణీయతకు గ్రహణం..**

జిల్లాలోని కడెం ప్రాజెక్ట్, పురాతన సదర్మత్ ఆనకట్ట వంటివి ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామా లు. దట్టమైన అటవీ ప్రాంతం, కొండల నడుమ ఉండే కడెం ప్రాజెక్టు వద్ద గతంలో సందడిగా ఉండే పర్యాటక శాఖ బోటింగ్ సౌకర్యం ఇప్పుడు పూర్తిగా నిలిచిపోయింది. అక్కడ ప ర్యా టకుల కోసం నిర్మించిన కాటేజీలు నిర్వహ ణ లేక పాడైపోయాయి. అద్దాలు పగిలి, తలుపులు విరిగిపోయి భూత్‌బంగ్లాలను తలపిస్తున్నాయి. పర్యాటకులు బస చేయడానికి కనీస వసతులు లేవు. ఇంజనీరింగ్ అద్భుతమైన పురాతన సదర్మత్ ఆనకట్ట వద్ద కూడా ఎలాంటి సుందరీకరణ పనులు చేపట్టలేదు. ఇక మమడ మండలంలోని ప్రకృతి రమణీయమైన వాస్తవపూర్ జలపాతానికి వెళ్లేందుకు కనీసం సరైన అప్రోచ్ రోడ్డు కూడా లేదు. సరైన రవాణా మార్గం లేక పర్యాటకులు అష్టకష్టాలు పడి ఆ ప్రాంతానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా బడ్జెట్‌లో పర్యాటక రంగానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా, నిర్మల్ జిల్లాకు మాత్రం ఆ నిధులు కానరావడం లేదు. జిల్లాకు మంజూరైన పర్యాటక నిధులు దారి మళ్లుతున్నాయా లేక అధికారుల నిర్లక్ష్యంతో వెనక్కి పోతున్నాయా అన్నది స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. పర్యాటక రంగానికి గత ఐదేళ్లలో విడుదలైన నిధులు, జరిగిన ఖర్చులపై తక్షణమే పారదర్శకంగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. బాసర ఆలయం, కడెం ప్రాజెక్ట్, వాస్తవపూర్ జలపాతం వద్ద యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు, అప్రోచ్ రోడ్లు నిర్మించాలని, కడెంలో బోటింగ్ పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే శ్యామ్‌గఢ్ కోటతో పాటు వెయ్యిగూడల మర్రి ప్రాంతాన్ని పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పటిష్టంగా సంరక్షించి, పర్యాటకులను ఆకట్టుకునేలా సుందరీకరించాలని, నిర్మల్ కొయ్య బొమ్మల కళాకారులను ఆదుకునేందుకు వెంటనే క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించాలని జిల్లా ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## కుప్పకూలింది
(మొదటి పేజీ తరువాయి)

స్థానికులు, హాస్టల్ విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. అంజయ్య నగర్‌లోని అత్యంత ఇరుకైన 50 గజాల స్థలంలో నాలాను ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భారీ భవనాన్ని నిర్మిస్తున్నారు. శనివారం పనులు జరుగుతుండగా భవనం ఒక్కసారిగా పక్కకు వాలి కూలిపోయింది. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేశ్ కారె, మోపత్ అనే ఇద్దరు కార్మికులు మృతిచెందగా, రమణారెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై శిథిలాలు పడటంతో అందులోని ఇద్దరు వృద్ధుల కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తెలంగాణ ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్, హైడ్రా, డిఆర్‌ఎఫ్, పోలీస్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. విక్టిమ్ లొకేషన్ కెమెరా సాయంతో శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించి, ఇద్దరి మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించారు. మరింత మంది శిథిలాల కింద ఉన్నారేమోనని తనిఖీలు కొనసాగించారు. ప్రభావిత భవనాల్లో నివాసితులు రాత్రి సమయంలో ఉండవద్దని, సిఎంసి స్థిరత్వ పరీక్ష అనంతరమే తిరిగి వెళ్లాలని అధికారులు సూచించారు.

### అక్రమ నిర్మాణంపై ఆగ్రహం

ఘటనా స్థలిని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ 50 గజాల్లో ఏడు అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ కూడా నిర్మిస్తున్నారని, సెట్‌బ్యాక్‌లు వదలలేదని తెలిపారు. నాలాను ఆక్రమించి యథేచ్ఛగా భవనాలు కడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజయ్యనగర్‌లో ఇలాంటి అక్రమ నిర్మాణాలు అనేకం ఉన్నాయని, వాటన్నింటిని తొలగిస్తామని, ప్రత్యేక డ్రైవ్ చేపడతామని ప్రకటించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడుతూ ఈ నిర్మాణంపై గతంలోనే ఫిర్యాదులు అందాయని, నాలుగు నెలల క్రితమే పనులను సీజ్ చేశామని, అయితే బిల్డర్ శుక్రవారం మళ్లీ పని ప్రారంభించాడని చెప్పారు. శనివారం నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతుండగానే ప్రమాదం జరిగిందని తెలిపారు. హాస్టల్ కోసం ఈ భవనాన్ని నిర్మిస్తున్నారని, భవన యజమాని ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు. ఈ నిర్మాణం చేపట్టిన బిల్డర్ సాజిద్ (స్థానికులు ఖాజాగా కూడా పేర్కొంటున్నారు) కోసం పోలీసులు గాలిస్తున్నారు.

### పునరావృతమవుతున్న ప్రమాదాలు

ఇదే అంజయ్యనగర్‌లో రెండేళ్ల క్రితం ఐదంతస్తుల భవనం ఒరిగిన సంఘటన ఉంది. సమీపంలోని సిద్ధిఖీ నగర్‌లో ఏడాదిన్నర క్రితం జి ప్లస్ 4 భవనం వంగిపోవడంతో అధికారులు దానిని పూర్తిగా కూల్చివేశారు. అంతకుముందు మార్చిలో టోలిచౌకిలో నిర్మాణంలో ఉన్న భవనం స్లాబ్ కూలి ఇద్దరు మృతిచెందిన ఘటన కూడా తాజాగా చర్చకు దారితీస్తోంది.

## లండన్ వర్సిటీ
(మొదటి పేజీ తరువాయి)

సమావేశం నిర్వహించింది. తెలంగాణ ప్రతినిధి బృందం రాష్ట్రంలో విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించింది. ఈ సమావేశం సందర్భంగా తెలంగాణ అధికారుల బృందం హైదరాబాద్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ విద్యాసంస్థలకు అందుబాటులో ఉన్న అవకాశాల గురించి వివరించింది. ఈ సందర్భంగా కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, వెంకట్ సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలపై వారు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు, సంయుక్త పరిశోధన, యువ పారిశ్రామికవేత్తల ఇన్క్యుబేషన్, స్టార్టప్ల అభివృద్ధిలో సహకారం కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గాన్ని చూపనున్నాయి. హైదరాబాద్ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి దీనితో మరింత బలం చే కూరుతుంది. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు.

**సిఎంను కలిసిన పలువురు ప్రముఖులు**

లండన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లివర్పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్పూల్ ఫుట్బాల్ క్లబ్‌కు చెందిన పలువురు నేడు మర్యాదపూర్వకంగా కలిశారు. లివర్పూల్ ప్రతినిధులు లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఆసక్తి చూపించారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేసేందుకు లివర్పూల్ ప్రతినిధి బృందం వచ్చే అక్టోబర్లో హైదరాబాద్ను సందర్శించనుంది.

**ఇంపీరియల్ కాలేజీని సందర్శించిన రామకృష్ణ రావు బృందం**

సిఎం సలహాదారు రామకృష్ణ రావు శుక్రవారం లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇంపీరియల్ కాలేజీ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, స్ట్రాటజిక్ ఎంగేజ్మెంట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా, ఆస్ట్రేలియా ప్రాంతాల సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రోసాన్నా గిల్లెస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి తెలంగాణ ప్రత్యేకతలు, విద్యా రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాల గురించి వివరించారు. తెలంగాణతో కలిసి పనిచేయడానికి అందుబాటులో ఉన్న సహకార అవకాశాలపై కూడా చర్చించారు.ఈ చర్చ సందర్భంగా హైదరాబాద్లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. అలాగే పరిశోధన రంగంలో భాగస్వామ్యం, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేయడంలో ఆసక్తి ఉందన్నారు. తెలిపారు. ఈ సందర్భంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్'కు రావాలని రామకృష్ణా రావు ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను ఆహ్వానించారు.

## పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం
(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా ఒక దళిత నాయకుడి పట్ల ఇలాంటి సంఘటన జరగడం దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నిస్తోందని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో దేశం ఇంకా ఎంత దూరం ప్రయాణించాల్సి ఉందో ఈ ఘటన తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**స్వాతంత్ర్యోద్యమంలో పత్రికల చెరగని ముద్ర**

భారతదేశ నిర్మాణంలో జర్నలిజం ఒక అంతర్భాగమని, అది కేవలం వార్తలు రాయడం కాకుండా పౌరులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దిందని భట్టి గుర్తుచేశారు. మహాత్మా గాంధీ 'యంగ్ ఇండియా', 'నవజీవన్', 'హరిజన్' పత్రికల ద్వారా, బాబాసాహెబ్ అంబేద్కర్ 'మూక్ నాయక్', 'బహిష్కృత భారత్' పత్రికల ద్వారా అణగారిన వర్గాలకు గొంతుక ఇచ్చారని, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 'కేసరి', 'మరాఠా' పత్రికల ద్వారా వలస పాలనను సవాలు చేశారని తెలిపారు. దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వంటి నేతలు కూడా పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు వేదికలుగా మలిచారని, అమృత బజార్ పత్రిక, 'ది హిందూ' వంటివి ఆనాడు ప్రజాగొంతుకలుగా నిలిచాయని కొనియాడారు. ఒకప్పుడు సంపాదకుడి స్థానానికి ఎంతో ప్రాధాన్యం ఉండేదని, రా మ్‌నాథ్ గోయెంకా వంటి యజమానులు ప్రభుత్వాలను సైతం ధై ర్యంగా ప్రశ్నించేవారని గుర్తుచేశారు. నేటి వార్తా సంస్థలు కేవలం బ్యాలెన్స్ షీట్లకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని సూచించారు.

**డిజిటల్ యుగంలో 'విశ్వసనీయతే' ఆయుధం**

కృత్రిమ మేధ (ఎఐ), వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతల వల్ల తప్పుడు సమాచారం, పుకార్లు వేగంగా వ్యాపిస్తున్న ఈ కాలంలో జర్నలిస్టులకు 'విశ్వసనీయత' మాత్రమే అసలైన ఆస్తి అని డిప్యూటీ సిఎం ఉద్ఘాటించారు. నేడు సమాచార కొరత లేదని, నమ్మకం కొరత మాత్రమే ఉందన్నారు. 'నా పిడికిలిని ఊపే హక్కు, అది నీ ముక్కు వద్దకు చేరే వరకు మాత్రమే' అన్న సూక్తిని ఉదహరిస్తూ, భావప్రకటనా స్వేచ్ఛ ఇతరుల ప్రతిష్టను దెబ్బతీసే లైసెన్స్‌గా మారకూడదన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌కు భూమి కేటాయింపు ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని, సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. 'అధికారంలో ఉన్న మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి, మీ వృత్తి ప్రమాణాలకు మీరు జవాబుదారీగా ఉండండి.. ఈ రెండింటి ప్రయోజనం అంతిమంగా పౌరుడికే దక్కాలి' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.



**సమైక్య పోరాటంతోనే హక్కుల పరిరక్షణ : ఎన్.రామ్**

జర్నలిస్టులపై చట్టపరమైన వేధింపులు, డిజిటల్ పరికరాల జప్తు వంటి చర్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో జర్నలిస్టు సంఘాలు, ప్రెస్ క్లబ్‌లు ఒక్కటిగా నిలవడం అత్యవసరమని ఎన్. రామ్ అన్నారు. 1988లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివాదాస్పద 'పరువు నష్టం బిల్లు'ను జర్నలిస్టుల ఐక్య పోరాటం ద్వారానే ఉపసంహరించుకునేలా చేశామని గుర్తు చేశారు. ఇటీవలి బ్రాడ్‌కాస్ట్ బిల్లు వెనక్కి తగ్గడం, డిజిటల్ డేటా ప్రైవసీ చట్టంలో సవరణల హామీలు సాధించడంలో కూడా ఐక్య పోరాటాల ప్రభావం ఉందన్నారు.

**స్వేచ్ఛ రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పనిచేయాలి కె.శ్రీనివాస్ రెడ్డి**

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) పరిరక్షణే ఈ సమాఖ్య ప్రధాన లక్ష్యమని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానికంగా జరిగే ఏ దాడినైనా జాతీయ స్థాయి అంశంగా మార్చడం, ఐటి చట్టాలు సహా ఇతర చట్టాల్లో పత్రికా స్వేచ్ఛకు అడ్డుగా ఉన్న నిబంధనలను సమీక్షించడం, వేధింపులకు గురవుతున్న విలేకరులకు ఉమ్మడి న్యాయ సహాయం అందించడం వంటి లక్ష్యాలతో ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. పత్రికా స్వేచ్ఛపై సంకేతాలు కనిపిస్తున్నా, ఎమర్జెన్సీ తరహా పూర్తి సెన్సార్‌షిప్ పరిస్థితి లేదని, దేశంలోని బహుళత్వం కారణంగా మీడియాపై పూర్తి నియంత్రణ సాధించడం రాజ్యానికి అసాధ్యమని అన్నారు. దేశవ్యాప్తంగా విలేకరులు ఎదుర్కొంటున్న సవాళ్లను జాతీయ వేదికపై ఉమ్మడిగా పరిష్కరించడానికి ఈ ఫెడరేషన్ తోడ్పడుతుందని సంగీత బారోచ్ పిషారోటి తెలిపారు.

# కుల్దీప్ యాదవ్ ఔట్.. గంభీర్ హింట్

## రెండో టెస్ట్‌కు భారత తుది జట్టు ఇదే!





శ్రీలంక పర్యటనలో టీమిండియా ఆఖరి పోరుకు సిద్ధమైంది. రెండు టెస్ట్ సిరీస్‌లో భాగంగా కొలంబో వేదికగా జరిగే ఆదివారం ప్రారంభమయ్యే మ్యాచ్లో ఆతిథ్య శ్రీలంకతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్లో 165 పరుగుల భారీతేడాతో శ్రీలంకను చిత్తుచేసిన టీమిండియా 1–0తో ఆధిక్యంలో ఉంది. అదే జోరులో ఆ జట్టును ఓడించి సిరీస్ను 2–0తో క్లీన్ స్వీప్ చేయాలనే పట్టుదలతో భారత్ ఉంది. మరో వైపు ఆఖరి మ్యాచ్ గెలిచి సిరీస్ సమం చేయాలనే లక్ష్యంతో శ్రీలంక బరిలోకి దిగుతోంది.

**కుల్దీప్ యాద్వ వేటు..** రెండో టెస్ట్కు టీమిండియా కాంబినేషన్లో మార్పు జరిగే అవకాశం ఉంది. తొలి టెస్ట్లో దారుణంగా విఫలమైన కుల్దీప్ యాద్వ వేటు పడే ఛాన్స్ ఉంది. తొలి టెస్ట్లో రెండో ఇన్నింగ్స్లో కలిపి కుల్దీప్ యాదవ్ ఒకే ఒక్క వికెట్ తీసాడు. అంతేకాకుండా దారళంగా పరుగులిచ్చాడు. దాంతోనే అతన్ని పక్కనపెట్టి 33 ఏళ్ల సారాన్ష్ జైన్కు అవకాశం ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

**గంభీర్ హింట్..** శనివారం జరిగిన మీడియా సమావేశంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కుల్దీప్ యాదవ్ వేటుపై హింట్ ఇచ్చాడు. కుల్దీప్ గురించి ప్రశ్నించగా.. 20 వికెట్లు తీయగల బౌలింగ్ కాంబినేష్పనే భారత తుది జట్టు ఎంపిక ఆధారపడి ఉందని స్పష్టం చేశాడు. కొన్నిసార్లు కెప్టెన్ నిర్ణయంపై కూడా ఆటగాళ్ల ఎంపిక ఆధారపడి ఉంటుందని బదులిచ్చాడు. అయితే కుల్దీప్ యాదవ్కు శుభ్మన్ గిల్ ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. తొలి టెస్ట్లో అతనికి తగిన ఓవర్లు బౌలింగ్ ఇవ్వలేదు. ఈ లెక్కనే కుల్దీప్ను పక్కనపెట్టి బ్యాటింగ్ సామర్థ్యం ఉన్న సారాన్ష్ జైన్ను ఆడించే అవకాశం ఉంది. మిగతా కాంబినేషన్లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ధ్రువ్ జురెల ఫిట్నెస్ సాధించకపోతే సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా ఆడనుండగా.. దేవదత్ పడిక్కల్, శుభ్మన్ గిల్, రిషభ్ పంత్ మిడిలార్డర్లో బరిలోకి దిగనున్నారు. స్పెషలిస్ట్ పేసర్లుగా మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ ఆడనున్నారు. ఈ ఇద్దరిలో ఒకరికి విశ్రాంతినిస్తే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు.

**శ్రీలంకతో రెండో టెస్ట్కు భారత తుది జట్టు(అంచనా)...** యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/ సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్/సారాన్ష్ జైన్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ.

## నాకు లైక్స్, వ్యూస్ కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యం : గౌతమ్ గంభీర్



భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడవద్దన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టంచేశారు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలువడమే ముఖ్యమని చెప్పారు. శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోందని, గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించిందని గంభీర్ గుర్తుచేశారు. రెండు టెస్టుల సిరీస్లో భారత్ 1–0 ఆధిక్యంలో ఉందని, కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుందని చెప్పారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైందన్నారు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్లో ఓటములు ఎదురయ్యాయని, ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైందని, అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ చెప్పారు. తాము టెస్టు క్రికెట్లో ఇబ్బంది పడటం లేదని, ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నామని అన్నారు. తనకు ట్రోఫీలు గెలువడమే ముఖ్యమని, తాను పట్టించుకునేది అదేనని గంభీర్ స్పష్టంచేశారు. అదేవిధంగా కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తంచేశారు. కొలంబోలో 20వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పారు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నారు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నారు.



## ఈ సీజన్‌లో నీరజ్ అత్యుత్తమ ప్రదర్శన అయినా రెండో స్థానంతోనే సరి

క్రీడల్లో రజతంతో మెరిసిన నీరజ్ చోప్రా ఆసియా క్రీడల ముందు మెరుగైన ప్రదర్శన చేశాడు. ఈ సీజన్లోనే అత్యుత్తమంగా 88.05 మీటర్ల దూరం ఈటెను విసిరిన భారత బడిసె వీరుడు లసానే డైమండ్ లీగ్లో విజేతగా నిలుస్తాడనిపించింది. కానీ, ఊహించినట్టుగానే శ్రీలంక స్టార్ రుమేశ్ థరంగ పథిరంగే నీరజ్ను దాటేసి టైటిల్ను ఎగరేసుకుపోయాడు. రెండో స్థానంలో నిలిచిన నీరజ్.. ఆసియా క్రీడలపై దృష్టి సారించనున్నాడు. ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా వరసగా రెండో ఈవెంట్లోనూ రెండో స్థానంతోనే సరిపెట్టుకున్నాడు. కామన్వెల్త్ క్రీడల్లో వెండి వెలుగులు విరజిమ్మిన అతడు.. లసానే డైమండ్ లీగ్లో మెరుగైన ప్రదర్శన చేసినా సరిపోలేదు. ఈ సీజన్లోనే అత్యుత్తమంగా నీరజ్ 88.05 మీటర్ల దూరం విసిరాడు. రెండో ప్రయత్నంలో ఈ మార్క్ అందుకున్న అతడికి శ్రీలంక అథ్లెట్ షాకిచ్చాడు. కామన్వెల్త్లో పసిడి విజేత అయిన రుమేశ్ థరంగ పథిరంగే ఏకంగా 88.14 మీటర్ల దూరంతో ఇక్కడా మొదటి స్థానం సాధించాడు. దాంతో, భారత బడిసె వీరుడు టైటిల్ చేజార్చుకున్నాడు. 2022, 2023లో ఇక్కడ విజేతగా నిలిచిన నీరజ్.. 2024లో, ఈసారి కూడా రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.




### బులియన్ మార్కెట్

10 (గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,60,480
22 క్యారెట్లు: రూ. 1,47,100
18 క్యారెట్లు: రూ. 1,20,360

(స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో వారం కూడా నష్టాలను ఎదుర్కొంటే, అందుకు భిన్నంగా బులియన్ మార్కెట్ వరుసగా రెండో వారం-లోనూ లాభాల బాటలో కొనసాగింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో, స్టాక్ మార్కెట్ల కంటే బంగారం, వెండిని ఉత్తమ పెట్టుబడిగా మదుపరులు భావించడమే ఇందుకు కారణం. దీనికి తోడు మన దేశంలో పండుగ సీజన్ ప్రారంభమైన కారణంగా, బంగారం ధర పెరుగుతునే ఉంది).

### ఈ వారం స్టాక్ మార్కెట్లు




**బాంబే స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బిఎస్‌ఇ)లో సెన్సెక్స్:** ప్రారంభం 78,009.25 పాయింట్లు. ముగింపు 77,540.83 పాయింట్లు. నష్టం 468.42పాయింట్లు.

**జాతీయ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ:** ప్రారంభం 24,366.00 పాయింట్లు. ముగింపు 24,252.00 పాయింట్లు. నష్టం 114.00 పాయింట్లు.

“(స్టాక్ మార్కెట్లలో వరుసగా రెండో వారం కూడా ‘బేర్’ జోరు కొనసాగింది. జాతీయంగానేకాక, అంతర్జాతీయంగానూ నెలకొన్న అనిశ్చితి ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా భారత్‌లోనూ స్టాక్ మార్కెట్లు కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి)

## మొబైల్ ఫోన్ తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన, రూ.62,500 కోట్ల విలువైన మొబైల్ ఫోన్ తయారీ పథకం అధిక టర్నోవర్గల కంపెనీలకు లాభాలను అందించనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం ద్వారా, 2025–26 ఆర్థికసంవత్సరంలో రూ. 10,000కోట్ల టర్నోవర్ సాధించిన మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీదారులకు వివిధ రకాల ప్రయోజనాలు అందుతాయి. కనీసం 51శాతం భారతీయ యాజమాన్యం ఉన్న ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల సంస్థలకు రూ.1,000 కోట్ల టర్నోవర్ అర్హతగా నిర్ణయించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల ద్వారా దేశీయ మొబైల్ తయారీని పెంచడం పథకం లక్ష్యం. కొత్త భారత్‌లో రూ.10వేల కోట్ల వార్షిక అమ్మకాలు సాధించిన తర్వాతే ప్రయోజనాలు పొందుతాయి. దేశీయంగా డిస్‌ప్లేలు, బ్యాటరీలు, యుఎస్‌బి కేబుళ్ల వంటి విడిభాగాలను కొనుగోలు చేస్తే అదనంగా 1.5 శాతం వరకు ప్రోత్సాహకం లభిస్తుంది.

## వాతావరణానికి అనుగుణంగా ఇంటెలిజెంట్ లూవర్ల వ్యవస్థ



పెద్ద గాజు ఫలకాలతో నిర్మిస్తున్న ఆధునిక భవనాల్లో అధిక ఉష్ణోగ్రత, సూర్యకాంతి, కాంతి ప్రతిఫలనం, విద్యుత్ వినియోగం వంటి అంశాలు కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భవన ముఖభాగాన్ని స్థిరమైన నిర్మాణ అంశంగా కాకుండా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా స్పందించే వ్యవస్థగా మార్చే సాంకేతికతకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని అల్యూమినియం కాంపోజిట్ ప్యానెల్స్, ఫసాడ్ ఉత్పత్తుల రంగంలో పనిచేస్తున్న అల్యూడెకర్ సంస్థ ‘అల్యూబ్రీజ్ ఇంటెలిజెంట్ లూవర్స్’ పేరుతో ఒక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఈ వ్యవస్థలో అమర్చిన మోటరైజ్డ్ మెటల్ లూవర్లు సూర్యకాంతి, వర్షం, గాలి వంటి పర్యావరణ పరిస్థితులను గుర్తించి తమ కోణాన్ని స్వయంచాలకంగా మార్చుకుంటాయి. దీంతో గాజు ముఖభాగంపై పడే సౌర ఉష్ణం, కాంతి తీవ్రత, వాతావరణ ప్రభావాన్ని నియంత్రించవచ్చు. భవన యజమానులు, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ బృందాలు మొబైల్ యాప్, వెబ్ డ్యాష్‌బోర్డ్ ద్వారా ప్రపంచంలో ఎక్కడి నుంచైనా వ్యవస్థను పర్యవేక్షించి నియంత్రించవచ్చు. ఈ సాంకేతికతలో కంట్రోలర్, ‘24 వి’ లీనియర్ యాక్చుయేటర్, పర్యావరణ సెన్సర్లు, ‘అల్యూసిన్క్ క్లౌడ్’ వంటి భాగాలు పనిచేస్తాయి. ‘బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్’ (బిఎంఎస్), ఎపిఐలతో అనుసంధానం చేసుకునే అవకాశం కూడా ఉంది. హాల్‌సెన్సర్ ద్వారా లూవర్ వాస్తవ స్థానం తెలుసుకుని, ఆదేశించిన స్థానంలోనే ఉందో లేదో వ్యవస్థ నిర్ధారిస్తుంది. సూర్యకాంతి అధికంగా ఉన్న సమయంలో లూవర్లు సౌర ఉష్ణం, గ్లేర్‌ను తగ్గించేలా పనిచేస్తాయి. వర్షం, బలమైన గాలుల సమయంలో రక్షణాత్మక స్థానానికి మారేలా ప్రోగ్రామ్ చేయవచ్చు. స్వతంత్ర అధ్యయనాల ప్రకారం, భారతదేశంతో సమానమైన వాతావరణ పరిస్థితుల్లో శీతలీకరణకు అవసరమైన విద్యుత్‌ను 18–40 శాతం వరకు తగ్గించే అవకాశం ఉంది. కార్యాలయాలు, ఆసుపత్రులు, హోటళ్లు, విమానాశ్రయాలు, రవాణా కేంద్రాలు, పార్కింగ్ భవనాలు, ఆవరణలు, ప్రజా భవనాల్లో ఈ వ్యవస్థను ఉపయోగించవచ్చు. 30, 45, 90 డిగ్రీల కోణాల్లో, 100 నుంచి 600 మిల్లీమీటర్ల వరకు వివిధ ప్రొఫైళ్లలో లభించే ఈ లూవర్లు భవనాల శక్తి సామర్థ్యంతో పాటు నిర్మాణ రూపకల్పనకు కూడా అనుగుణంగా పనిచేస్తాయి.

## పెరుగుతున్న పెట్టుబడి ప్రతిపాదనలు




చైనా వాటాదారుల పరిమితికి సంబంధించిన ‘విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు’ (ఎఫ్‌డిఐ) నిబంధనలను సడలించిన తర్వాత భారత్‌కు విదేశీ పెట్టుబడుల ప్రతిపాదనలు పెరుగుతున్నాయి. మే 2026లో నిబంధనలు మార్చినప్పటి నుంచి ఆగస్టు 20 వరకు 29 ఎఫ్‌డిఐ ప్రతిపాదనలు నమోదయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.4,895.65 కోట్లు. చైనా లేదా హాంకాంగ్ సంస్థల వాటా 10 శాతానికి మించకుండా ఉంటే, ఎఫ్‌డిఐకి అనుమతించిన రంగాల్లో ఆటోమేటిక్ రూట్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు కొత్త నిబంధనలు అవకాశం కల్పించాయి. తాజా పెట్టుబడులు ఐటి, కృత్రిమ మేధ (ఎఐ), తయారీ, ఔషధాలు, డేటా సెంటర్లు, రవాణా వంటి రంగాల్లో నమోదయ్యాయి. మారిషస్, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర ప్రాంతాల నుంచి పెట్టుబడులు వచ్చాయి

# ప్రజా ఉద్యమాలకు పోరాట స్ఫూర్తి ‘సురవరం’

## వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ నేతలు





**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు పోరాట స్ఫూర్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాలను అలవర్చుకొన్న గొప్పనేత సురవరం అన్నారు. ఆయన స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి, ప్రజల మధ్య ఉండి ప్రజల కోసం పోరాడతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ సూర్య, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** కులమత భేదాలు, సామాజిక ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం జీవితాంతం పోరాడిన మహానేత సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి.ఫయాజ్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌తో కలిసి సురవరం చిత్రపటానికి నివాళులర్పించారు. అగ్రకులంలో పుట్టినా పీడిత, తాడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీపతి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు, సిపిఐ నాయకులు వంకేశ్వరం శ్రీనివాసులు, కొత్త రామస్వామి, శివకృష్ణ, శేఖర్, ఎఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు కొత్త సంతోష్, ఆంజనేయులు, విజయ్, చెన్నయ్య, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.





**యాదగిరిగుట్ట :** అణగారినవర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి విద్యార్థుల సమస్యలు, విద్యా సౌకర్యాలు, ఉపాధి, యువత హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలను నిర్మించడంలో ముఖ్యపాత్ర పోషించారు. సురవరం సుధాకర్‌రెడ్డి నిరాడంబర జీవితం, ప్రజలతో మమేకమైన తీరు, కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల అచంచలమైన నిబద్ధత, ప్రజా ఉద్యమాల పట్ల అంకిత భావం నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, ఎండి ఇమ్రాన్, మండల కార్యదర్శి కళ్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మల్లిగుడెం సర్పంచ్ బోధాసు స్వప్న జగన్, నాయకులు పేరబోయిన పెంటయ్య, పేరబోయిన బంగారు, గోపగాని రాజు, మునుకుంట్ల నరసమ్మ, ఆరే పుష్ప, ముక్కెర్ల పెంటయ్య మద్దూరి భాగ్యమ్మ, తౌటకుర్ శేఖర్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** సురవరం సుధాకర్‌రెడ్డి జీవితం ప్రతి కమ్యూనిస్టుకి ఆదర్శప్రాయం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3 భూ పోరాట కేంద్రం వేదికలో సిపిఐ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన నివాళి కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్ సామిడి శేఖర్‌రెడ్డి, ఏశాలి నరసింహ, కాటి అరుణ, సిపిఐ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# కొత్త లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

## ఎఐటియుసి కార్యదర్శి ఎస్.విలాస్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విలాస్ డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎండి. ఫయాజ్ అధ్యక్షతన శనివారం ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై విలాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, అలాగే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో ఈ కోడ్‌లను అమలు చేయబోమని తీర్మానం చేస్తేనే కార్మికుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు రూ.18,900, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000 వేతనం ఇవ్వాలని, ఇఎస్ఐ, గ్రాట్యుటీ సీలింగ్ ఎత్తివేయాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విలాస్ డిమాండ్ చేశారు. 2026 సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరగబోయే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అందరి సహకారంతో జిల్లా మహాసభలు ఘనంగా విజయవంతమయ్యాయని తెలిపారు. మహాసభలో ఆమోదించిన తీర్మానాల సాధన కోసం రాబోయే రోజుల్లో పోరాట కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కె.శ్రీనివాస చారి మాట్లాడుతూ సభ్యత్వ రుసుము చెల్లించని యూనియన్లకు రాష్ట్ర మహాసభల్లో ప్రాతినిధ్యం ఉండదని, వెంటనే సభ్యత్వాన్ని చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ 6న నిర్వహించే ర్యాలీ, బహిరంగ సభకు కార్మికులు వందలాదిగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు ఎస్ఎన్.రెడ్డి, పద్మకుమారి, రాజేందర్, మధు, సతీష్, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు

## ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సిందేనని, అందుకు జిల్లాలో జరిగే ఎఐటియుసి జిల్లా మహాసభల్లో కార్యచరణ రూపొందిస్తామని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు వెల్లడించారు. శనివారం పట్టణంలోని స్థానిక వినాయక గ్రాండ్ హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణ కేంద్రంలో సిద్ధారం రోడ్‌లోని లక్ష్మీ ప్రసన్న గార్డెన్స్‌లో ఈనెల 23, 24 తేదీలలో ఎఐటియుసి జిల్లా 17వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 23న అంబేద్కర్ చౌరస్తా నుండి ఫంక్షన్ హాల్ వరకు కార్మిక ప్రదర్శన అనంతరం కార్మిక చట్టాలపై దాడి లేబర్ కోడ్‌ల ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సెమినార్‌కు ఎఐటియుసి రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. 24న జిల్లా నలుమూలల నుంచి ఎంపిక చేయబడిన 500 మంది ప్రతినిధులతో మహాసభను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మహాసభకు సిపిఐ శాసనసభ పక్ష నేత, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి.యూసఫ్, సొంటి బాలరాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు. ఈ మహాసభలలో మున్సిపల్, గ్రామపంచాయతీ, అంగనవాడీ, మధ్యాహ్న భోజనం, ఆశ , నేషనల్ హెల్త్ మిషన్, తదితర కార్మికుల కనీస వేతనాల అమలు కోసం ఉద్యమ రూపకల్పన, సంఘటితంగా కార్మికులు అయినా ఆర్టీసీ, సింగరేణి, సంస్థల పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు కార్మిక చట్టాలు లేబర్ కోడులపై సుదీర్ఘమైన చర్చలు చేసి తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు, రెండు రోజులపాటు జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, బికెఎంయు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, డిహెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తడికమళ్ళ యోబు తదితరులు పాల్గొన్నారు.



# నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్.. నగదు రహిత వైద్య సేవలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు, వారి ఆధారితులకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్) కింద నగదు రహిత వైద్య సేవలు ఇకపై ఎటువంటి అంతరాయం లేకుండా అందనున్నాయి. రాష్ట్రంలోని అన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు ఈ పథకం కింద సేవలు కొనసాగించేందుకు అంగీకారం తెలిపినట్లు ఎస్‌టియు, టిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.సదానందం గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ తెలిపారు. తెలంగాణ సచివాలయంలో ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సిటి) ఆధ్వర్యంలో తెలంగాణ సూపర్ స్పెషాలిటీ హస్పిటల్స్ అసోసియేషన్(టిఎస్‌హెచ్ఎ), ఎంపానెల్డ్ ఆసుపత్రుల ప్రతినిధులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎన్‌హెచ్ఈఎస్ లబ్ధిదారులకు వైద్య సేవలను నిరంతరాయంగా అందించేందుకు ఏకాభిప్రాయం వ్యక్తమైంది. దీంతో అర్హులైన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు, వారి ఆధారితులకు నగదు రహిత వైద్య సేవలు తక్షణమే అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా సదానందం గౌడ్, గజేందర్ మాట్లాడుతూ వైద్య సేవల విషయంలో లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉద్యోగులు, పింఛనుదారుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు సేవలను కొనసాగించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అత్యవసర, తీవ్ర అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న లబ్ధిదారులకు ఆలస్యం లేకుండా నగదు రహిత వైద్యం అందించాలని, అవసరమైన అన్ని సూపర్ స్పెషాలిటీ చికిత్సలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపానెల్డ్ ఆసుపత్రులను కోరారు.

# కాంగ్రెస్ పాలనలో భూదందాలు, సెటిల్‌మెంట్‌లు




కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో భూదందాలు, సెటిల్‌మెంట్‌లు ఎక్కువయ్యాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'భూభారతి' పేరిట లక్షలాది ఎకరాల ప్రైవేట్ భూములను 22ఎ నిషేధిత జాబితాలోకి చేర్చి దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. దీనిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. బాధితులకు బిజెపి లీగల్ సెల్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. పిఎం గరీబ్ కల్యాణ్ అన్న యోజన బియ్యం కార్డులపై కేంద్ర లోగోను తొలగించడంపై ఆయన మండిపడ్డారు. రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యా వ్యవస్థ కుదేలైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే సెప్టెంబర్ 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 'హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని' ఘనంగా నిర్వహిస్తామన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, 'ఇమ్రోజ్' పత్రిక ఎడిటర్ అమరవీరుడు షోయబుల్లా ఖాన్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.

# వెస్ట్రన్ డిఎఫ్‌సిలో తొలి డబుల్ స్టాక్ లాంగ్‌హాల్ కంటైనర్ రైలు

- జెఎన్‌పిటి నుంచి వడోదరకు 360 టిఇయుల రవాణా.. 422 కిలోమీటర్ల ప్రయాణం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ రైల్వే మరో కీలక ఆపరేషనల్ మైలురాయిని సాధించింది. వెస్ట్రన్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డిఎఫ్‌సి)పై తొలిసారిగా డబుల్ స్టాక్ లాంగ్‌హాల్ కంటైనర్ రైలును విజయవంతంగా నడిపింది. జెఎన్‌పిటి ముంబై నుంచి వడోదర డివిజన్‌లోని వర్నామా కన్‌కోర్ గూడ్స్ కంటైనర్ టెర్మినల్ (జిసిటి) వరకు 422 కిలోమీటర్ల దూరాన్ని ఈ రైలు పూర్తి చేసింది. 21న రాత్రి 7 గంటలకు జెఎన్‌పిటి నుంచి రైలు బయలుదేరింది. ఈ లాంగ్‌హాల్ రైలులో రెండు డబుల్ స్టాక్ రేక్‌లను కలిపి నడిపారు. ఒక్కో రేక్‌లో 45ప్లస్ 1 కంటైనర్లు ఉండగా, మొత్తం 360 టిఇయులు కంటైనర్లను ఒకే రవాణా కదలికలో తరలించారు. మొత్తం రైలు బరువు 3,922 టన్నులు. మొదటి రేక్‌కు లోకో 60311ను వినియోగించగా, 1,817 టన్నుల సరుకు ఉంది. రెండో రేక్‌కు లోకో 24690ను వినియోగించగా, 2,105 టన్నుల సరుకు ఉంది. రెండు రేక్‌లను కలిపి ఒక లాంగ్‌హాల్ రైలుగా నడపడం ద్వారా ఒకేసారి భారీ స్థాయిలో కంటైనర్ సరుకును తరలించే సామర్థ్యాన్ని భారతీయ రైల్వే ప్రదర్శించింది. ఒకే రైలులో ఎక్కువ సంఖ్యలో కంటైనర్లను తరలించడం వల్ల పోర్టులు, టెర్మినళ్ల వద్ద కంటైనర్లు నిలిచే సమయం తగ్గుతుంది. దీంతో టెర్మినళ్లపై రద్దీ తగ్గడంతో పాటు సరుకుల వేగవంతమైన తరలింపునకు అవకాశం ఏర్పడుతుంది.

**రైళ్ల నిర్వహణలో ఆదా..**

డబుల్ స్టాక్ విధానంతో ఒకే రవాణా కదలికలో అధిక సంఖ్యలో కంటైనర్లను తరలించవచ్చు. దీంతో సమాన పరిమాణంలో సరుకును తరలించేందుకు అవసరమయ్యే లోకోమోటివ్‌లు, కంటైనర్ ఫ్లాట్ వ్యాగన్ల సంఖ్య తగ్గే అవకాశం ఉంటుంది. అదే సమయంలో అందుబాటులో ఉన్న రైల్వే మార్గ సామర్థ్యాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. లాంగ్‌హాల్ కంటైనర్ రైళ్ల ద్వారా సరుకుల తరలింపు వేగవంతమై మొత్తం ట్రాన్సిట్ సమయం తగ్గే అవకాశం ఉంది. జేఎన్‌పీటీ వంటి ప్రధాన పోర్టుల నుంచి కంటైనర్లను వేగంగా తరలించడంతో పాటు రవాణా వ్యయాలను కూడా తగ్గించేందుకు ఈ విధానం దోహదపడుతుంది.

# విద్యుత్ కొరత లేని తెలంగాణే లక్ష్యం

- భవిష్యత్ విద్యుత్ అవసరాలకు పకడ్బందీ ప్రణాళికలు: భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పెట్టుబడులకు తెలంగాణను అత్యుత్తమ గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని, పరిశ్రమలకు విద్యుత్, నీటి కొరత లేకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసి ఉత్పత్తి, సరఫరా సామర్థ్యాలను పెంచేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో ఎస్‌పిడిసిఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పవర్ ఎగ్జిబిషన్–2026ను భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో చేపడుతున్న సంస్కరణలు, ఆధునిక సాంకేతికత, సాధిస్తున్న విజయాలను ప్రజలకు, ముఖ్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నామని భట్టి తెలిపారు. గతంలో సుమారు 13 వేల మెగావాట్లుగా ఉన్న పీక్ డిమాండ్ ప్రస్తుతం 18 వేల మెగావాట్లకు పైగా చేరిందన్నారు. ట్రాన్స్‌మిషన్ వ్యవస్థను బలోపేతం చేయడం, ముందస్తు ప్రణాళికలు, అవసరమైన విద్యుత్‌ను సకాలంలో సమీకరించడం వల్ల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయగలుగుతున్నామని చెప్పారు. భవిష్యత్ అవసరాల కోసం థర్మల్ విద్యుత్‌తో పాటు సోలార్, హైడల్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్ సామర్థ్యాలను పెంచుతామని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టులకు నాలుగైదేళ్ల సమయం పడుతుందని, అందువల్ల 2047 అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. విద్యుత్‌శాఖ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని భట్టి తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, సేవా రంగం సహా అన్ని ఉత్పత్తి రంగాలకు విద్యుత్ పునాది వంటిదని, రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధికి నిరంతర విద్యుత్ సరఫరా కీలకమని భట్టి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ఎస్‌పిడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్, సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్‌లు పాల్గొన్నారు.

# దేశ జనాభాలో 60 శాతం ఉన్న.. బిసిల రిజర్వేషన్లను ఎత్తివేస్తే చూస్తూ ఊరుకోం

- ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో కొనసాగుతున్న బడుగు, బలహీన వర్గాల రిజర్వేషన్లను అమలు కాకుండా చేసేందుకు బిజెపి కుట్ర చేస్తోందని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు(వి.హెచ్) మండిపడ్డారు. గాంధీభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 60 శాతం ఉన్న బిసిల రిజర్వేషన్లను ఎత్తివేయాలని చూస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. రిజర్వేషన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాలు చేయడం దారుణమన్నారు. దీని వెనుక ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఉన్నారని ఆరోపించారు.

**ఇందిరాపార్క్ వద్ద సోమవారం ధర్నా..**

రిజర్వేషన్ల పరిరక్షణ కోసం హైదరాబాద్ నుంచే ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హనుమంతరావు ప్రకటించారు. వచ్చే సోమవారం ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అన్ని పార్టీలకు చెందిన బిసి నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇబిసి రిజర్వేషన్ బిల్లు తీసుకొచ్చినప్పుడు తాము అడ్డుపడలేదని, అలాంటప్పుడు బడుగు బలహీన వర్గాల రిజర్వేషన్లను ఎందుకు రద్దు చేయాలని చూస్తున్నారని ప్రశ్నించారు. రిజర్వేషన్లపై రాహుల్‌గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజల నుంచి వస్తున్న స్పందనతో బిజెపి భయపడుతోందని విహెచ్ అన్నారు.

# లండన్‌లో అంబేద్కర్ హౌస్‌ను సందర్శించిన సిఎం రేవంత్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి శనివారం లండన్‌లోని ప్రసిద్ధ అంబేద్కర్ హౌస్‌ను సందర్శించారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 1921–22లో లండన్‌లోని ప్రిమ్రోజ్ ప్రాంతంలోని 10 కింగ్ హెన్రీ'స్ రోడ్‌లో నివసించిన ఇంటిని సీఎం సందర్శించారు. మహనీయులు డాక్టర్ అంబేద్కర్ హౌస్‌ను సందర్శించడం ఒక ఆధ్యాత్మిక క్షేత్రాన్ని సందర్శించడం లాంటిది. ఇది జీవితకాలపు స్ఫూర్తినిస్తుంది. సామాజిక న్యాయం కోసం అంకితభావంతో పనిచేయాలన్న నా ఆకాంక్ష మరింత పెరిగింది అని సీఎం రేవంత్ రెడ్డి సందర్శకుల డైరీలో రాశారు. అంబేద్కర్ హౌస్‌ను ప్రస్తుతం డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అంకితమైన మ్యూజియంగా ఏర్పాటు చేశారు. రాజ్యాంగబద్ధత, సమానత్వం, కులరహిత సమాజం, అణచివేత లేని సమాజం, సామాజిక న్యాయానికి అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వడం వంటి ఆయన సిద్ధాంతాలను ఈ మ్యూజియం ప్రతిబింబిస్తుంది. దాదాపు గంట పాటు సాగిన పర్యటనలో అంబేద్కర్ మ్యూజియం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన యాంటీ కాస్ట్ డిస్క్రిమినేషన్ అలయన్స్ (ఏసిడిఏ) చైర్ పర్సన్ సంతోష్ దాస్ యూకేలో బాబాసాహెబ్ జీవితానికి సంబంధించిన వివిధ అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. పర్యటన పూర్తయిన అనంతరం సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నా జీవితంలో ఇది గొప్ప క్షణాల్లో ఒకటి. భారతీయుల్లో గొప్ప వ్యక్తుల్లో ఒకరైన డాక్టర్ అంబేద్కర్ జీవితంలోని వ్యక్తిగత కోణాన్ని చూసి, ఆయనతో ముడిపడిన వస్తువులను తాకగలగడం ఎంతో గొప్ప అనుభూతి అని అన్నారు.

# ఆర్ఎఫ్‌సిఎల్ షట్‌డౌన్‌పై కేంద్రం జోక్యం

- కేంద్రమంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సిఎల్) ప్లాంట్ ఈ నెల 22 నుంచి మరోసారి షట్‌డౌన్‌లోకి వెళ్లడంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. కీలకమైన ఖరీఫ్ సీజన్‌లో యూరియాకు డిమాండ్ అధికంగా ఉన్న సమయంలో సుమారు 10 రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడడం రాష్ట్ర రైతులకు ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు తుమ్మల లేఖ రాశారు. ఆర్ఎఫ్‌సిఎల్ షట్‌డౌన్‌పై తక్షణమే జోక్యం చేసుకుని, తెలంగాణకు యూరియా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. తెలంగాణ యూరియా అవసరాలను తీర్చడంలో రామగుండంలోని ఆర్ఎఫ్‌సీఎల్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి తెలిపారు. అయితే గత ఖరీఫ్ సీజన్‌లోనూ ప్లాంట్ పలుమార్లు షట్‌డౌన్ కావడంతో మొత్తం 112 రోజుల పాటు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని గుర్తుచేశారు. 2025లో మే 5 నుంచి జూన్ 14 వరకు 39 రోజులు, జూలై 10 నుంచి ఆగస్టు 4 వరకు 24 రోజులు, ఆగస్టు 14 నుంచి అక్టోబర్ 1 వరకు 49 రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోయిందని వివరించారు. ప్రస్తుతం ఈ నెల 22 నుంచి మరోసారి షట్‌డౌన్ ప్రారంభమైందని, సుమారు 10 రోజుల పాటు ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉందని తెలిపారు. ఖరీఫ్ సాగు పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో యూరియాకు డిమాండ్ పెరగడం ఆందోళన కలిగించే అంశమన్నారు. రైతులకు పారదర్శకంగా, సమానంగా ఎరువులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ (ఎఫ్ఎఫ్ఎస్) విధానాన్ని తెలంగాణలో దశలవారీగా అమలు చేస్తున్నామని తుమ్మల తెలిపారు. ఈ విధానం విజయవంతం కావాలంటే రిటైల్ స్థాయిలో తగినంత యూరియా అందుబాటులో ఉండటం అత్యంత కీలకమన్నారు. తెలంగాణ రైతులకు ఖరీఫ్ సీజన్‌లో నిరంతరాయంగా యూరియా అందేలా కేంద్ర ప్రభుత్వం అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు.

# తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కృషి అభినందనీయం

- ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రశంసలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి నైపుణ్యాల పెంపు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధులు ప్రశంసించారు. శనివారం ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ప్రతినిధి బృందం తెలంగాణ మీడియా అకాడమీ భవనాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, జర్నలిస్టుల సంక్షేమ పథకాలను వివరించారు. కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు ప్రతినిధులకు స్వాగతం పలికారు. జర్నలిస్టులకు ప్రభుత్వం అందిస్తున్న అక్రిడిటేషన్ సౌకర్యాలు, విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయం, వారి పిల్లలకు ట్యూషన్ ఫీజు సహాయం తదితర సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తుండటాన్ని ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో 23 వేల మందికి పైగా జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం కల్పించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ ఫెడరేషన్ ప్రతినిధులు అకాడమీ చైర్మన్‌శ్రీనివాస్ రెడ్డికు వినతిపత్రం అందజేశారు. అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు, అవగాహన కార్యక్రమాలతో పాటు జర్నలిస్టులకు ఉపయోగపడేలా ప్రచురిస్తున్న పుస్తకాలు, మోనోగ్రాఫ్‌లను ప్రతినిధులు పరిశీలించారు. ఐదు అంతస్తుల ఆధునిక భవనంలోని శిక్షణా తరగతులు, గ్రంథాలయం, కంప్యూటర్ సౌకర్యాలు, సమావేశ మందిరం, 250 మంది సామర్థ్యం కలిగిన సెంట్రల్ ఎసి ఆడిటోరియాన్ని సందర్శించారు. తెలంగాణ మీడియా అకాడమీ చేపడుతున్న కార్యక్రమాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రతినిధులు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తి ప్రమాణాలు, పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ బలమైన వేదికగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షుడు గౌతమ్ పహాని, జనరల్ సెక్రటరీ సౌరభ్ దుగ్గల్, సెక్రటరీ జనరల్ రాజేష్ ధల్, ఇతర ప్రతినిధులు, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి రమేష్, మీడియా అకాడమీ మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, ఓఎస్‌డి ఎం.కె.రహమాన్ పాల్గొన్నారు.



# అర్జున అవార్డు గ్రహీత, ధనుష్ శ్రీకాంత్‌కు స్పోర్ట్స్ అథారిటీ సన్మానం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అర్జున అవార్డు గ్రహీత, తెలంగాణకు చెందిన ప్రముఖ షూటర్ ధనుష్ శ్రీకాంత్ శనివారం ఎల్‌బి స్టేడియంలోని స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏ. సోనీ బాలా దేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. సోనీ బాలా దేవి ధనుష్ శ్రీకాంత్‌ను అభినందించి, షూటింగ్ క్రీడలో సాధించిన అద్భుత విజయానికి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు, దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం స్పోర్ట్స్ అథారిటీ అధికారులు ధనుష్ శ్రీకాంత్‌ను ఘనంగా సన్మానించి, షూటింగ్ క్రీడలో ఆయన సాధించిన విశిష్ట విజయాలను అభినందించారు. తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన ధనుష్ శ్రీకాంత్‌కు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ అనిత డిప్యూటీ డైరెక్టర్లు శ్రీనివాస్ రవితేజ రవీందర్, పిఆర్‌ఓ కాలేరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ పాఠాలు

- టి-సాట్‌తో స్కూల్ ఎడ్యుకేషన్ ఒప్పందం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన డిజిటల్ విద్యను అందించేందుకు స్కూల్ ఎడ్యుకేషన్, టిసాట్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. హైదరాబాద్‌లోని డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, టిసాట్ సిఇఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ కంటెంట్‌ను అన్ని వేళలా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో డిజిటల్ లెర్నింగ్ కీలక పాత్ర పోషిస్తుందని నవీన్ నికోలస్, వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

**తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు**

ఎంఓయు ద్వారా 9, 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో ప్రత్యేక ఆన్‌లైన్ డిజిటల్ తరగతులను టిసాట్ వేదికగా ప్రసారం చేయనున్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతో నిర్వహించే 'ముఖాముఖి', 'మా జిల్లా మా పాఠశాల' వంటి కార్యక్రమాలను కూడా టిసాట్ ద్వారా ప్రసారం చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 28 వేల ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉపయోగపడేలా ఈ కార్యక్రమాలను రూపొందించనున్నారు. ఉపాధ్యాయుల కోసం 'టిఎల్‌ఎం మేళా'తో పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను కూడా టిసాట్ ద్వారా నిర్వహించనున్నారు. డిజిటల్ ప్రసారాలకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను టిసాట్ ద్వారా నిర్వహించేలా సమగ్ర శిక్ష, ఎస్‌ఇఆర్‌టి తదితర విభాగాలు తగిన చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ నవీన్ నికోలస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ అడిషనల్ డైరెక్టర్ పివి శ్రీహరి, టిసాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎండి సాధిక్, జనరల్ మేనేజర్ లింగారెడ్డి, ప్రాజెక్ట్ జెడిలు, కోఆర్డినేటర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 75 దేశాల వలస ప్రజలపై ట్రంప్ వీసా నిషేధాన్ని కొట్టేసిన ఫెడరల్ జడ్జి

**మన్‌హటన్:** వలస ప్రజలకు వీసాలు ఇవ్వకుండా నిషేధించే డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ విధానాన్ని అమెరికా ఫెడరల్ కోర్టు కొట్టివేసింది. ట్రంప్ ఉత్తర్వు చట్టబద్ధమైన అధికార పరిధిని ఉల్లంఘించిందని మన్‌హటన్‌లోని ఫెడరల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి జీనెట్ వర్గాస్ శనివారం స్పష్టం చేశారు. దీంతో ట్రంప్ అనుసరిస్తున్న వలస వ్యతిరేక విధానాలకు మరో ఎదురుదెబ్బ తగిలింది. 75 దేశాలకు చెందిన వలస ప్రజల జాతీయతలను ఈ వీసా నిషేధం లక్ష్యంగా చేసుకుందని న్యాయమూర్తి తన తీర్పులో వ్యాఖ్యానించారు. జాతీయత ఆధారంగా వీసాలను తిరస్కరించకూడదన్న 1965 నాటి విధానానికి ఈ విధానం విరుద్ధంగా ఉందని ఆమె వ్యాఖ్యానించారు. ఒక వసల ఉద్యోగి తనను తాను పోషించుకోగల సామర్థ్యం ఉందని రుజువైనప్పటికీ, జాతి,దేశం ఆధారంగా వీసాలను తిరస్కరించాలని విదేశీమంత్రిత్వశాఖ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్న విషయాన్ని తన పరిశీలనలో న్యాయమూర్తి వర్గాస్ కనుగొన్నారు. ఒక వలస ఉద్యోగి ఉద్యోగం పోయినప్పటికీ 60 రోజుల్లో తిరిగి సంపాదించుకోవడానికి ఒక గ్రేస్ పీరియడ్ ఉంది. ఈ లోపు వారు ఉద్యోగం సంపాదించుకోలేకపోతే దేశం వదిలి వెళ్ళిపోవాలి. ఐతే ఈ 60 రోజుల విరామ కాలాన్ని కూడా రద్దు చేయాలని ట్రంప్ యంత్రాంగం ఆలోచిస్తోంది.

# వెంకట రామిరెడ్డి సేవా స్ఫూర్తి పోలీసులకు ఆదర్శం

- పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాసేవ, పోలీసింగ్ వ్యవస్థలో క్రమశిక్షణ, విద్యాభివృద్ధికి విశేష కృషి చేసిన రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి సేవా స్ఫూర్తి నేటి పోలీసు అధికారులకు ఆదర్శప్రాయమని తెలంగాణ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ కె.ఆర్.కె. ప్రసాద్ అన్నారు. రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి 157వ జయంతి వేడుకలను శుక్రవారం రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో అకాడమీ అధికారులు, ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీ ప్రాంగణంలోని రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి విగ్రహానికి పోలీస్ అధికారులు, అకాడమీ అధికారులు, ఆర్‌బీవీఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కె.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ.. రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి పేరు తెలంగాణ పోలీస్ అకాడమీతో పాటు మొత్తం పోలీస్ వ్యవస్థకు నిరంతర స్ఫూర్తినిస్తోందన్నారు. పేదలు, బలహీన వర్గాల ప్రజలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శిక్షణార్థుల సంక్షేమం కోసం ఆయన ఏర్పాటు చేసిన నిధి ద్వారా శిక్షణార్థుల పట్ల ఆయనకున్న శ్రద్ధ, దూరదృష్టి స్పష్టమవుతుందని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్ పోలీస్ అధికారులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్‌బివిఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. విద్య ద్వారా సమాజ అభివృద్ధికి బాటలు వేసిన మహనీయుడు రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి అని అన్నారు. అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వేలాది మందికి విద్యావకాశాలు కల్పించిన ఆయన సేవలను కొనియాడారు. సమాజ సేవ, విద్యాభివృద్ధి, ప్రజాసేవలో ఆయన చూపిన మార్గం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.

**ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పోలీసింగ్**

రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ తిరుపతి రెడ్డి రాజాబహద్దూర్ వెంకట రామిరెడ్డి బాల్యం నుంచి హైదరాబాద్ కొత్వాల్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతల వరకు పలు అంశాలను వివరించారు. నిజాం కాలంలో కొత్వాల్‌గా ప్రజలతో ఆయన వ్యవహరించిన తీరు, ప్రజల భద్రత, సంక్షేమం, క్రమశిక్షణకు ఇచ్చిన ప్రాధాన్యతను గుర్తుచేశారు. ఆయన అనుసరించిన ప్రత్యేక పోలీసింగ్ విధానం నేటికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రస్తుత పోలీస్ అధికారులు, శిక్షణార్థులు ఆయన సేవా స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం తెలంగాణ పోలీస్ అకాడమీ తరఫున ఆర్‌బివిఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు కొండ లక్ష్మీకాంతరెడ్డి, రిటైర్డ్ అడిషనల్ ఎస్‌పి తిరుపతి రెడ్డిలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమీ అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, నరహరి, డిఎస్‌పిలు ఆదూరి శ్రీనివాసరావు, కృష్ణ, తోట శ్రీనివాసులు, తిరుపతి, జగదీశ్వర్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, అకాడమీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



**DOCUMENTS LOST**

I, **PAGADALA DEVENDER, S/O. PAGADALA RAVI,** R/o. C398, Irwin Village, Madgul Mandal, Rangareddy Dist. - 509321, Telangana. Have lost my original sale deed Doc No. **8010/2005.** dated: 28.12.2005 registered at **S.R.O. Kalwakurthy**, Mahabubnagar District. **Survey No. 395/ఆ, Extent Ac.5-30 Guntas.** while Travelling from Irwin to Madgul. If found Contact: **8187059323**



## లయన్స్ క్లబ్ సేవలు గ్రామాలకు విస్తరించడం అభినందనీయం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు నగరంతో పాటు గ్రామాలకు విస్తరించి నిరుపేదలకు సహాయం చేయడం ఎంతో గొప్ప విషయమని సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనేజర్ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. కీసర రామలింగేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో దేవాలయ శాఖ సిబ్బందికి లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ జోన్ చైర్ పర్సన్ లయన్ వడ్లోజు జ్యోతిర్మయాచారి ఆధ్వర్యంలో ప్రత్యేక గొడుగులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. భక్తులకు ప్రజలకు ఆరోగ్యాలను సైతం లెక్క చేయకుండా పనిచేస్తున్నారని చైర్ పర్సన్, విబిఎస్ ట్రస్ట్ చైర్మన్ జ్యోతిర్మయాచారి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ సిబ్బంది, సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్‌సిఆర్ జోన్ సబ్ ఇన్‌స్పెక్టర్ మేతరి రాజు, లయన్స్ క్లబ్ సభ్యులు సునీల్, అంజిగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** జవహర్‌నగర్ పరిధిలోని గాంధీనగర్, అంబేద్కర్ నగర్ ప్రాంతాలలో తీవ్రంగా ఉన్న డ్రైనేజీ సమస్యల శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. రూ,22 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, మాజీ మేయర్, భూమి పూజ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి సదానందు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... డివిజన్ పరిధిలోని ప్రతి వార్డులోనూ ప్రజలెదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను క్రమంగా పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. స్థానికులకు ఎలాంటి మురుగు నీటి ఇబ్బందులు కలగకుండా త్వరలోనే నాణ్యతా ప్రమాణాలతో ఈ డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాట్లా వినయ్, ముఖ్య నాయకులు భాస్కర్, గజ్వేల్ శంకర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ దర్యాప్తు తీరు భేష్



**ప్రజాపక్షం/చర్లపల్లి:** కేసును రిజిస్టర్ చేయడం నుండి మొదలుకొని చేధించి శిక్షపడే వరకు తన ప్రతిభను కనబరిచిన కుషాయిగూడ సబ్ ఇన్‌స్పెక్టర్ నిర్మల వెంకన్న సేవలను గుర్తించి మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్ సుమతి బెస్ట్ ఇన్వెస్టింగేషన్ అధికారిగా పురస్కారాన్ని అందించారు. మల్కాజ్ గిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఆయనకు మెరుగైన పురస్కారాన్ని అందజేశారు. ఉన్నతాధికారులు ప్రశంసించడంతో పాటు ఆయన సేవలను ప్రజలు కొనియాడుతున్నారు. గతంలో జవహర్‌నగర్ పిఎస్‌లో పనిచేసిన సమయంలో కరుడుకట్టిన భూకబ్జాదారులు, రౌడీ షీటర్లు నుండి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దూరం చేయడానికి నిర్భయంగా భూకబ్జాదారులపై పిడి యాక్ట్ విధించి చర్లపల్లి జైలుకు పంపించిన ఉత్తమ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా గుర్తింపు లభించింది.



## ఫార్మసీ విద్యార్థులకు భారీ ఉద్యోగాలు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఘట్‌కేసర్‌లోని సంస్కృతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నిర్వహించిన ప్రాంగణ నియామకాలు విజయవంతమయ్యాయి. వివిధ ఫార్మసీ కళాశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా ప్రముఖ ఔషధ సంస్థలు నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 42 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ నియామక కార్యక్రమంలో 18 ఫార్మసీ కళాశాలలకు చెందిన136 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెటెరోలాబ్స్ లిమిటెడ్, రెట్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్, ఇనోవైన్ సైంటిఫిక్ సంస్థలు పాల్గొని వివిధ దశల్లో ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపిక ప్రక్రియ అనంతరం 42 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఎంపికైన విద్యార్థులను సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ ఏవి మరణా రెడ్డి,ప్రిన్సిపాల్ డా.స్వాతి, శిక్షణ నియామక విభాగం, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ భవిష్యత్ అవకాశాలు కల్పించిన సంస్థల ప్రతినిధులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. వంద శాతం ఉద్యోగ నియామక సహకారం అందించేందుకు కళాశాల నిరంతరం కషి చేస్తుందని యాజమాన్యం వెల్లడించింది.

## భవన నిర్మాణ పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం/నవాబుపేట:** నవాబుపేట్ మండలం ఎల్లకొండ గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న మహిళా భవన నిర్మాణ పనులు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళల సౌకర్యం, అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగపడేలా నిర్మిస్తున్న మహిళా భవన స్లాబ్ నిర్మాణ పనులను నవాబుపేట్ మండలం సర్పంచుల సంఘం అధ్యక్షులు కొండల్ యాదవ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తిచేసి మహిళలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధిలో మహిళా భవనం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రామచందర్, విలేజ్ సెక్రటరీ వెంకటయ్య, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కుమ్మరి శివ, గ్రామ పెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల ముసుగులో గంజాయి రవాణా.. ఐదుగురు అరెస్ట్

### హైదరాబాద్‌లో రూ.10 లక్షలు డ్రై గంజాయి స్వాధీనం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వయసు పైబడిన ప్రయాణికులపై సాధారణంగా అనుమానం తక్కువగా ఉంటుందనే విషయాన్ని ఆసరాగా చేసుకుని గంజాయిని రవాణా చేస్తున్న ఐదుగురిని హైదరాబాద్ సిసిఎస్ ప్రత్యేక క్రైమ్ టీమ్, గాంధీనగర్ పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. వారి నుంచి సుమారు 38 కిలోల డ్రై గంజాయి, దీని విలువ దాదాపు రూ.10లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఆగస్టు 21న విశ్వసనీయ సమాచారం అందడంతో సిసిఎస్ క్రైమ్ టీమ్, గాంధీనగర్ పోలీసులతో కలిసి దాడిచేసి నిందితులను అదుపులోకి తీసుకుంది. అరెస్టైన వారిలో రాజారాం స్వామి కన్ను పడయాచి (78), సంతోష్ బాలారం ప్రజాపతి (65), విజయలక్ష్మి కలియ మూర్తి పిల్లై (66), సిల్మినా కుజూర్ (36), షీలా దేవి (48) ఉన్నారు. వీరిలో కొందరు కూలీలు, మరికొందరు గృహ సహాయకులుగా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**అరకు నుంచి హైదరాబాద్ మీదుగా ముంబైకి..**

పోలీసుల వివరాల ప్రకారం.. నిందితులు విశాఖపట్నం జిల్లా అరకు ప్రాంతం నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని సేకరించి, బ్రౌన్ కలర్ పార్సిల్ కవర్లలో ప్యాక్ చేసేవారు. అనంతరం బస్సుల్లో గంజాయి పార్సిళ్లను హైదరాబాద్‌కు తరలించి, ఇక్కడ మరో బస్సు ఎక్కి ముంబైకి వెళ్లేవారు. అక్కడ ముందుగా సూచించిన ప్రాంతాలో గంజాయి పార్సిళ్లను అప్పగించేవారు.

**వయసును అడ్డుపెట్టుకుని..**

వృద్ధ ప్రయాణికులపై అనుమానం తక్కువగా ఉంటుందనే విషయాన్ని అక్రమ రవాణా నిర్వాహకులు తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు అరకు నుంచి బయలుదేరే సమయంలో పార్సిళ్లను తమ సాధారణ సామాన్లతో కలిపి తీసుకెళ్లేవారు. అనుమానం రాకుండా హైదరాబాద్ చేరుకున్న తర్వాత కొంతసేపు వేరే లాడ్జిలో బస చేసి, ముందుగా నిర్ణయించిన మరో బస్సులో ముంబైకి వెళ్లేవారని పోలీసులు తెలిపారు. ప్రతి డెలివరీకి నిందితులకు సుమారు రూ.10వేల నుంచి రూ.12వేల వరకు కమీషన్ చెల్లించేవారని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

**గతంలోనూ గంజాయి రవాణా ?**

అరెస్టైన నిందితులకు గతంలోనూ గంజాయి రవాణాకు సంబంధించిన నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారం వెనుక ఉన్న ప్రధాన వ్యక్తి ఎవరు? అరకు నుంచి గంజాయిని సరఫరా చేస్తున్న నెట్‌వర్క్ ఎంత విస్తరించింది? ముంబైలో పార్సిళ్లను స్వీకరిస్తున్న వ్యక్తులు ఎవరు? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది.ఈ ఆపరేషన్‌ను సిసిఎస్ క్రైమ్ టీమ్ ఇన్‌స్పెక్టర్ చి. సుధాకర్ రావు, ఎస్ఐ ఎన్. గౌరేందర్ గౌడ్ తమ సిబ్బందితో కలిసి గాంధీనగర్ పోలీసుల సమన్వయంతో నిర్వహించారు. డిసిపి, సిసిఎస్ ఎస్. చైతన్య కుమార్ మార్గదర్శకత్వంలో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## 'సర్' రెండో దశ బాధ్యతాయుతంగా పూర్తి చేయాలి

### ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** సర్ రెండో దశలో బిఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లు భాధ్యతయుతంగా పని చేసి ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం తూంకుంటలోని కార్యాలయంలో ఎఇఆర్‌ఓ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఎస్ఐఆర్ రెండవ దశపై బిఎల్‌ఓలు, బిఎల్‌ఎలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్ రెండవ దశ అత్యంత కీలకమైందని, ఇందులో సూపర్‌వైజర్‌లు, కంప్యూటర్ ఆపరేటర్, బిఎల్‌ఓలు, బిఎల్‌ఎలు తమ బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు.



ఓటర్లకు సంబంధించిన వివరాలను జాగ్రత్తగా పరిశీలించి సరైన సమాచారాన్ని నమోదు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎక్కడైన సందేహాలు, సాంకేతిక సమస్యలు ఎదురైతే ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జాన్, తదితరులు పాల్గొన్నా రు.

## ఆన్‌లైన్‌లో నమోదైతేనే బోనస్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** రైతులు తాము పండిస్తున్న సన్న రకాల విత్తన ధాన్యాల ను కొనుగోలు చేసే సమయంలో డీలర్ల వద్ద ఆన్‌లైన్‌లో వరి రకాలను నమోదు చేసుకోవాలని శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి డాక్టర్ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సిఫార్సు చేసిన 7 సన్న రకాలైన బిపిటి 520 4, కెఎన్‌ఎం 1638, కెఎన్‌ఎం 7715, జై శ్రీరామ్, హెచ్‌ఎంటి, డబ్ల్యూజిఎల్ 44 తెలంగాణ సోనా ఈ రకాల్లో ఎవరైనా రైతులు వేసినట్లయితే విత్తనం కొనుగోలు చేసిన డీలర్ల వద్ద ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ సొంతంగా, ఇతర మార్గాల ద్వారా ఎవరైనా వేస్తే వారు అలియాబాద్ రైతు వేదికలో స్వీయ ధృవీకరణ పత్రం తేది 10/09/ 2026 లోపు నమోదు చేసుకోవాలని తెలిపారు.

## ఫార్మా రంగంలో జీరో ఫైర్ లక్ష్యం

### ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జి.వి. నారాయణరావు



**ప్రజాపక్షం/దుండిగల్ :** ఫార్మా రంగంలో ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తు నివారణ, నిరంతర భద్రతను అలవర్చుకోవాలని ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఏఐ) నిర్వహించిన ఫసా 2026 సదస్సు స్పష్టం చేసింది. జీడిమెట్లలో ఉన్న జీడిమెట్ల ఇండస్ట్రీస్ అసోసియేషన్లో ఈ సదస్సును ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రభుత్వ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జీవీ నారాయణరావు ప్రారంభించారు. ఫైర్ అండ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఏఐ) హైదరాబాద్ చాప్టర్, కౌన్సిల్ ఆఫ్ ఈహెచ్ఎస్ ప్రొఫెషనల్స్ (సీఈపీ) సహకారంతో ఫసా 2026 (ఫైర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ అండ్ ఆటోమేషన్) ఫర్ ఫార్మా సదస్సును నిర్వహించారు. ఫార్మా రంగంలోని భద్రతా సవాళ్లను పరిష్కరించేందుకు పరిశ్రమల ప్రముఖులు, ఈహెచ్ఎస్ నిపుణులు, అగ్నిమాపభద్రతా రంగ నిపుణులు, సాంకేతిక ప్రదాతలు, విధాన నిర్ణేతలు ఈ సదస్సులో ఒకే వేదిక పైకి వచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఫార్మాస్యూటికల్, లైఫ్‌సైన్సెస్ హబ్‌గా ఎదుగుతున్న నేపథ్యంలో అగ్నిప్రమాదాల నివారణ, ప్రాసెస్, ఎలక్ట్రికల్ భద్రత, అత్యవసర స్పందన (ఎమర్జెన్సీ రెస్పాన్స్) సాంకేతికత ఆధారిత రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఈ సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది. ఈ సందర్భంగా తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జి.వి. నారాయణరావు మాట్లాడుతూ, ఫార్మా పరిశ్రమలో జీరో యాక్సిడెంట్ విధానం అమలు చేయాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే, ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించడంపై పరిశ్రమలు దృష్టి పెట్టాలని అన్నారు.

# గ్రామీణ ప్రాంతాల భద్రతకు 'రక్షణ నేత్రం'

### వికారాబాద్ జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా





**ప్రజాపక్షం/నవాబ్‌పేట్ :** గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపిఎస్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వికారాబాద్ రక్షణ నేత్రం కార్యక్రమంలో భాగంగా నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన 110 సిసిటివి కెమెరాలను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా శనివారం ప్రారంభించారు. ఆరు గ్రామాల్లో 110 కెమెరాలు నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యావపూర్‌లో 24, నవాబ్‌పేట్‌లో 16, గొల్లగూడలో 12, పులుమామిడిలో 14, కొజ్జావనం పల్లిలో 16, ముబారక్‌పూర్‌లో 28 చొప్పున మొత్తం 110 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన ప్రాంతాలు, రహదారులు, కూడళ్లలో జరిగే కార్యకలాపాలను పోలీస్ స్టేషన్ నుంచే నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఏర్పడింది. నేరాల నియంత్రణకు సిసిటివిలు కీలకం అని ఈ సందర్భంగా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ వికారాబాద్ రక్షణ నేత్రం ద్వారా జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సిసిటివి నిఘా వ్యవస్థను మరింత విస్తరిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం ద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నేరాలు జరిగిన అనంతరం నిందితులను గుర్తించడం, వారి కదలికలను పసిగట్టడం, నేర పరిశోధనలో కీలక ఆధారాలను సేకరించడంలో సీసీటీవీలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన కెమెరాల ద్వారా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను గుర్తించడం, శాంతిభద్రతలను పర్యవేక్షించడం, రోడ్డు భద్రతను మెరుగుపరచడం, నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవడం సులభతరం అవుతుందని తెలిపారు. గ్రామాల భద్రత కోసం సిసిటివి వ్యవస్థ ఏర్పాటులో ప్రజలు భాగస్వాములు కావాలని, పోలీసులకు సహకరించాలని సూచించారు.

షటిల్ కోర్టు, ప్రహరీ గోడ ప్రారంభం నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన షటిల్ కోర్టు, ప్రహరీ గోడను కూడా ఎస్పీ స్నేహ మెహ్రా ప్రారంభించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, విధుల్లో ఒత్తిడితో పనిచేసే సిబ్బంది శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు క్రీడా సదుపాయాలు ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. సిబ్బంది క్రీడల్లో పాల్గొని ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండాలని సూచించారు. సిసిటివి కెమెరాలు, ప్రహరీ గోడ, షటిల్ కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలను ఎస్పీ అభినందించారు. ప్రజల సహకారంతో సిసిటివి నిఘా వ్యవస్థను మరింత విస్తరించి సురక్షిత వికారాబాద్ నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, నవాబ్‌పేట్ ఎస్ఐ గిరి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌బి కాలనీ సమస్యలను పరిష్కరించాలి

### కాలనీలో పర్యటించిన డిప్యూటీ కమిషనర్‌కు వినతి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** ఎంఎంసి నాచారం సర్కిల్ పరిధిలోని హెచ్‌బి కాలనీ ఫేజ్ 2 కాలనీ సమస్యలను పరిష్కరిస్తానని డిప్యూటి కమిషనర్ నిత్యానంద్ హామీ ఇచ్చారు. శనివారం కాలనీలో పర్యటించిన ఆయనను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రమోహన్, భువన్‌చంద్ర, నరేంద్రరెడ్డిలు సమస్యలను విన్నవించారు. కాలనీ 40 అడుగుల రోడ్డు ప్రాంతంలో వర్షపు నీటి డ్రైన్ ట్రెంచ్‌లో పూడిక తీయించాలని, 1982లో హౌసింగ్ బోర్డు నిర్మించిన పాత బాక్స్ డ్రైయిన్ పని చేయకుండా పోయినందున దాని స్థానంలో కొత్త బాక్స్ డ్రైన్ పనులు చేపట్టాలని, హనుమాన్ దేవాలయం, సాయి దుర్గా వైన్స్ సమీపంలో స్పీడ్ బ్రేకర్లు అవసరం ఉందని, రాఘవేంద్రనగర్‌లో హెచ్‌బి కాలనీ సరిహద్దు చెత్త సమస్యను పరిష్కరించాలని కాలనీ ప్రతినిధులు కోరారు.

## అక్రమ నిర్మాణాల కూల్చివేత

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** జవహర్ నగర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూ ముల్లో వెలిసిన అక్రమ నిర్మాణాలపై రెవె న్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు . శనివారం కాప్రా తహసీల్దార్ మతిన్ ఆదేశాల మేరకు, గిర్దావర్ సత్యనారాయణ పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది భారీ బందోబస్తు మధ్య జెసిబి సాయంతో అక్రమ కట్టడాలను నేల మట్టం చేశారు. సంతోష్ నగర్, చెన్నాపూర్, వికలాంగుల కాలనీ, అలాగే కార్మికనగర్ ప్రాంతాల్లో సర్కారు భూములను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మతిన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.



## సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళులు

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ మండలంలో సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రజా ఉద్యమకారుడు సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఐ నాయకులు శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి అనేక ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించి జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందారని అన్నారు. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ పేదలు, కార్మికుల సమస్యలపై పార్లమెంట్‌లో గళం వినిపించారని, ప్రజా సంక్షేమం కోసం అనేక సంస్కరణలకు కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్‌రావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు హైమావతి, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు, యువజన నాయకులు కీర్తి, రమేష్, మహేష్, సిపిఐ నాయకులు వెంకటేష్, రవి, ఇమామ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ మండలం గాంధీనగర్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో




శనివారం కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ యూసుఫ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం, జిల్లా ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మండల ఎఐటియుసి అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్‌రావు, స్వామి, సిపిఐ మాజీ కౌన్సిలర్ నర్సయ్య, గిరినగర్ శాఖ కార్యదర్శి యాకూబ్, సీనియర్ నాయకులు యాదగిరి, బాలనర్సయ్య, హమాలీ యూనియన్ నాయకులు, తదితరులు నివాళులు అర్పించారు.

## ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా..?

### జై భవాని టిఫిన్ సెంటర్‌లో పురుగులు పడిన అన్నం!


**ప్రజాపక్షం/నవాబుపేట్ :** ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాల్సిన హోటల్ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నవాబుపేట్ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం లోని జై భవాని టిఫిన్ సెంటర్ హోటల్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా వినియోగదారులకు పురుగు లు పడిన అన్నాన్ని వడ్డిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హోటల్‌లో ఆహార పదార్థాల నాణ్యతపై నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహార పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో తయారు చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సి ఉన్నప్పటికీ, అన్నంలో పురుగులు కనిపించడం పట్ల వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఆహారం తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే విషయంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు. జై భవాని టిఫిన్ సెంటర్‌లో కూడా సంబంధిత అధికారులు తనిఖీ చేసి, ఆరోపణ లు నిజమని తేలితే తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.





## ప్రత్యామ్నాయ రబీ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలి : దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్:** వరి సాగును నియంత్రించినా ప్రత్యామ్నాయ రబీ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో పంటల సాగు పరిస్థితి ,పప్పు ధాన్యాల విత్తనాల ,పంఫిణీ డిజిటల్ క్రాప్ సర్వే ,వనమహోత్సవం కార్యక్రమాల పురోగితిపై సమీక్ష నిర్వహించారు. వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించేందుకు చర్యలు జిల్లాలోప్రస్తుతం సాగు చేసిన వరి విస్తీర్ణాన్ని సమీక్షించి,ఇకపై వరి సాగు విస్తర్ణాన్ని పెరగకుండా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను అదేశించారు. ఇప్పటివరకు వరిసాగుకు ఉద్దేశించిన మిగిలిన భూములను ముందస్తు రబీ పంటలు, ముఖ్యంగా కుసుమ, పంప్పు దినుసులు, వేరుశెనగవంటి పంటల వైపు మంళించాలా రైతులకు సూచనలు , సాంకేతిక మార్గదర్శకాలు అందించాలని తెలిపారు. ఈనెల 24,25 తేదిల్లో రైతులకు విత్తనాలు అందించాలని అన్నారు. డిజిటల్ క్రాప్ సర్వే జిల్లాలోని అన్ని రెవెన్యూ గ్రామాలను సంబంధించిన ప్రైవేట్ సర్వేయర్లను ఈనెల 24నాటికి గుర్తించి నియమించే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, తదితరులు పాల్గోన్నారు.



## కొత్త రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన


**ప్రజాపక్షం/వికారాబాద్ :** పట్టణఅభివృద్ధి ద్యేంగా వికారాబాద్ మున్సిపల్ లోని 26,31,33,వార్డులో 1.5 కోట్లతో నూతన రోడ్లుకు మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్యశంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా పట్టణ ప్రజలకు మెరుగైనమౌలిక వసతులు కల్పించడమే పాలకవర్గం లక్ష్యంఅన్నారు.రోడ్ల నిర్మాణపనుల్లో నాణ్యత ప్రమాణాలు పాలించాలని అదేశించారు. త్వరగా పూర్తి ,చేసిఅందుబాటులోకితీసుకురావాలనికోరాఉ. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విక్రమంసింహరెడ్డి ,కౌన్సిలర్లు తదితరులు పాల్గోన్నారు.

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జి స్టూడియోస్ సమర్పిస్తున్నాయి.

# రీల్

## 'కకా' పుట్టిస్తున్న చిరంజీవి

* టైటిల్ గ్లింప్స్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న చిరంజీవి 158వ సినిమాకు నామకరణం చేశారు. వెంకట్ కే నారాయణ నిర్మాణ సారథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ ను చిరంజీవి వేడుకల సందర్భంగా శనివారం రిలీజ్ చేశారు.ఈ టైటిల్ గ్లింప్స్ స్టైల్, యాక్షన్, రా మాస్ అప్పీల్‌తో ఆ అంచనాలను మరింత పెంచింది. కె. సత్యం, సూపర్‌వైజర్‌గా చిరంజీవి ఆక్వా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ తన డైనమిక్ విజువల్ లాంగ్వేజ్‌తో గ్లింప్స్‌ను మరింత ఆసక్తికరంగా మలిచారు. ప్రారంభ సన్నివేశాల్లో కెమెరా దాదాపు చిరంజీవి పాత్రతో పాటు ప్రయాణిస్తున్నట్టుగా ఇమ్మర్సివ్ ఫీల్‌ను కలిగిస్తుంది. ఆ తర్వాత గ్లింప్స్ ముందుకు వెళ్లే కొద్దీ హై ఎనర్జీ ఫ్రేమ్స్, మాస్ ఎలివేషన్స్‌తో విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్ ఇంటెన్సిటీని మరింత పెంచింది. 'గ్యాంగ్ లీడర్'లోని ఐకానిక్ 'గ్యాంగ్ గ్యాంగ్' పాటను రీమిక్స్ చేసి ఉపయోగించడం నోస్టాల్జియాతో పాటు చిరంజీవి స్టైల్‌కు మరింత స్వాగ్‌ను జోడించింది. ఈ చిత్రంలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్లా, ఎడిటర్‌గా ఆంటోనీ ఎల్ రూబెన్, రచయితలుగా కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి పనిచేస్తున్నారు. భాను–నందు డైలాగ్స్ అందిస్తున్నారు.2027 జనవరి 13న సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

మెగాస్టార్ చిరంజీవి, అనశ్వర రాజన్, నివేదా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి **క్రియేటివ్ ప్రొడ్యూసర్:** లోహిత్, **ఎడిటర్:** ఆంటోనీ రూబెన్, **ప్రొడక్షన్ డిజైన్:** అవినాష్ కొల్లా, **స్క్రీన్ ప్లే రైటర్స్:** కోన వెంకట్, కె చక్రవర్తి రెడ్డి, **ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:** శరణ్య పోట్ల, **యాక్షన్:** రామ్ లక్ష్మణ్, **నబకాంత్ డైలాగ్స్:** భానునందు, **అడిషినల్ స్క్రీన్ ప్లే రైటర్స్:** హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి.

## సెప్టెంబర్ 4న 'సహా' విడుదల



నిశాంత్ దోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ డ్రామా 'సహా (లైఫ్ ఆఫ్ సంజు)'. శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు, జీవితంలో ఎదురయ్యే భావోద్వేగ సంఘర్షణల చుట్టూ సాగనుంది. సుమైరా స్టూడియోస్ బ్యానర్‌పై తేజ వెల్పుచర్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'సహా' సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ జర్నీలో ఆత్మీయంగా కనిపించారు. ఈ విజువల్ ఇద్దరి మధ్య ప్రేమ, అనుబంధాన్ని సహజంగా చూపిస్తూ సినిమా నేపథ్యంపై ఆసక్తిని పెంచుతోంది. సంజు జీవితంలోని వివిధ దశలను ఈ సినిమా ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, విడిపోవడం, మధురమైన జ్ఞాపకాలు, కష్టాలను అధిగమించేందుకు అవసరమైన మనోధైర్యం వంటి అంశాలను కథలో చూపించనున్నారు. పాత్రలు, వాటి మధ్య ఉండే అనుబంధాల ద్వారా ఒక మనసుకు దగ్గరయ్యే ఎమోషనల్ జర్నీగా అందించనున్నాయి. ఈ చిత్రంలో ప్రజనా పాండ్యా, మహిపాల్, అప్పాజీ, భారతి, మేఘన సునీల్, బాంబే పద్మ, కొండారెడ్డి, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా కరుణాకర్ కె, ఎడిటర్‌గా దినేష్ పెద్ది, సంగీత దర్శకుడిగా శేఖర్ చంద్ర పనిచేస్తున్నారు.

## 'కామ్రేడ్ కళ్యాణ్' లో సరస్వతమ్మగా రాధిక



శ్రీవిష్ణు హీరోగా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన పీరియాడ్ బ్యాక్‌డ్రాప్‌తో పాటు రొమాన్స్, ఎమోషన్స్ తో రూపొందిస్తున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ ఎల్ పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992లో ఆంధ్ర– ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆమె 'సరస్వతమ్మ'గా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'జై బాలయ్య' హెడ్‌బ్యాండ కట్టుకుని, సీరియస్ లుక్‌లో కనిపిస్తున్న రాధికా శరత్‌కుమార్ పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ఆమె బాడీ లాంగ్వేజ్ సరస్వతమ్మ పాత్రకు కథలో మంచి ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా బాలయ్య అభిమానిగా పాత్రను డిజైన్ చేయడం ఆసక్తికరంగా ఉంది. సరస్వతమ్మగా రాధికా శరత్‌కుమార్ ఫస్ట్ లుక్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. ఈ చిత్రంలో షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.

'కామ్రేడ్ కళ్యాణ్' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. **ఈ చిత్రానికి సంగీతం:** విజయ్ బుల్గానిన్, **సినిమాటోగ్రఫీ:** సాయి శ్రీరామ్, **ఎడిటర్:** చోటా కె. ప్రసాద్.

## అలాంటి పాత్రలు చెయ్యొద్దని నాఅన్న బిడ్డ చెప్పింది

### 'నేను సినిమా చూడను' అని మా ఆవిడ అన్నది

### 'ప్రజాపక్షం' స్పెషల్ ఇంటర్వ్యూలో 'బలగం' సుధాకర్ రెడ్డి

'బలగం' సినిమా తెలుగు సినిమా చరిత్రను తిరిగి రాసింది. వందేళ్ల తెలుగు సినిమా చరిత్రలో ఒక సినిమా రిలీజ్ తరువాత కూడా గ్రామాల్లో ప్రజలందరూ ఒకచోట కూర్చొని ఎల్ ఈ డీ లో సినిమా వేసుకుని చూసిన చరిత్ర 'బలగం' సినిమా సొంతం. బలగం సినిమా చూసి విడిపోయిన బంధాలు, బంధుత్వాలు కలిసిపోయాయి. బలగం సినిమా కథ మొత్తం ఒక ఇంటి పెద్ద చుట్టూ తిరుగుతుంది. ఆ ఇంటి పెద్ద పాత్రను పోషించాడు నటుడు కేతిరి సుధాకర్ రెడ్డి. ఈ ఇంటి పెద్ద మనిషి పాత్ర చనిపోవడంతోనే కథ మొదలవుతుంది. ఆ తరువాత బలగం కథ ఎలా సాగింది అనేది సినిమా చూసిన ప్రతి ఒక్కరికి తెలిసిందే. బలగం సినిమాలో ఇంటి పెద్ద పాత్రను పోషించిన సుధాకర్ రెడ్డిని 'ప్రజాపక్షం' పలకరించింది. ఈ సందర్భంగా ఆయన అనేక ఆసక్తికర విషయాలను ప్రజాపక్షంతో పంచుకున్నారు. ఆ విశేషాలు పాఠకుల కోసం....



**ప్రశ్న : మీ నేపథ్యం ఏమిటి ?**

**సుధాకర్ రెడ్డి :** మాది కరీం నగర్ జిల్లా. తండ్రి కేతిరి రాజి రెడ్డి, అమ్మ సుశీలమ్మ.జూపాక గ్రామంలో బాల్యం గడిచింది ప్రాథమిక విద్య మొత్తం జూపాక లోనే. నాలుగవ తరగతి వరకు జూపాక లో చదువుకున్న. తరువాత చిలుపూరు గ్రామంలో అయిదవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు చదుకున్న.ఎనిమిదవ తరగతి నుంచి కాలేజీ చదువుల వరకు వరకు హుజురాబాద్ సాగింది. కాకతీయ యూనివర్సిటీ వరంగల్ లో డిగ్రీ చేసిన. ఆ తరువాత బీఈడీ చదువుకోసం తిరుపతికి వెళ్లిన. శ్రీ వెంకటేశ్వరా స్వామి యూనివర్సిటీలో బీఈడీ పట్టా సాధించిన. బీఈడీ పూర్తి అయినాక సరస్వతి శిశు మందిర్ లో టీచర్ గా ఉద్యోగంలో చేరిన. రిటైర్మెంట్ అయ్యేవరకు ఉపాధ్యాయుడిగా పని చేసిన. పదవి విరమణ తరువాతే సినిమా రంగానికి వచ్చిన.

**ప్రశ్న : మీరు చదువుకునే రోజుల్లో నాటకాలు ఆడేవారా?**

**సుధాకర్ రెడ్డి :** అవును నాటకాలు ఆడేవాన్ని. కొన్ని బహుమతులు కూడా వచ్చాయి. కానీ అవి ఇప్పుడు గుర్తుకు రావడం లేదు. పౌరాణిక నాటకాలు, యక్ష గానం, చిడతల రామాయణం హరికథలు, బుర్ర కథలు, వీధి భాగోతాలు, ఏకపాత్ర నాటికలు..., నటించడమే కాదు కొన్ని రాసిన కూడా. నాటకాల పోటీలకు వెళ్తుండేవాణ్ణి. నంది నాటకోత్సవాలకు కూడా జడ్జిగా వెళ్లిన. స్కూల్ లో పిల్లలకు పిల్లలకు నాటకాలు నేర్పించేవాన్ని. శిశుమందిర్ లో ఐచ్చిక రంగస్థల అనే ప్రత్యేక కార్యక్రమం ఉండేది. దీంట్లో నేను ప్రముఖంగా పని చేసిన.

**ప్రశ్న : మీకు రచన ఎలా అలవాటు అయింది ?**

**సుధాకర్ రెడ్డి :** ఆరుట్ల రంగాచార్య అని ఉపాధ్యుడు ఉండేవారు. వారు మాకు సంస్కృతం భోదిస్తుండేవారు. ఆయన రచనలు చెయ్యమని ప్రోత్సహించారు. దీంతో మొట్ట మొదలు ఇందిరా గాంధీ గురించి ఒక పాట రాసిన. ఆ తర్వాత ఆమెకు వ్యతిరేకంగా కూడా పాట రాసిన. పాట ఎలా రాయాలో చెప్పిండు. అట్లా రచయితనైనా.

**ప్రశ్న : తొలిసారిగా కెమెరా ముందుకు ఎప్పుడు వచ్చారు?**

**సుధాకర్ రెడ్డి :** నిజానికి సినిమాలంటే దూరమే. మైకేల్ అన్వేష్ అనే దర్శకుడు 'కొత్త పోరడు' అనే వెబ్ సిరీస్ చేశారు. దాంట్లో ఫస్ట్ టైం నటించిన. అప్పుడే మొట్ట మొదటిసారి కెమెరా ముందుకు వచ్చిన. సినిమాగా చెప్పుకుంటే 'మల్లేశం' నాతొలి సినిమాగా చెప్పవచ్చు.

**ప్రశ్న : బలగం సినిమాలో ఎలా అవకాశం వచ్చింది ?**

**సుధాకర్ రెడ్డి :** 'కొత్త పోరడు' సినిమా దర్శకుడు అన్వేష్ కు బలగం వేణు స్నేహితుడు. నా గురించి వేణుకు చెప్పాడట. వెబ్ సిరీస్, నాటకాలు చాలా బాగా యాక్టింగ్ చేస్తాడు అని ఇలా నాగురించి వేణుకు తెలిసింది. దీంతో ఆయన పిలిపించి బలగం సినిమాకు సెలక్ట్ చేశాడు.

**ప్రశ్న : బలగం సినిమాలో మీరు చనిపోయే పాత్ర ? ఎలా ? ఒప్పుకున్నారు**

**సుధాకర్ రెడ్డి :** మనం నిజంగానే చనిపోతాం కదా... సినిమాలో చనిపోయే పాత్ర చేస్తే ఏమైతది అనుకున్న. మా అన్నయ్య బిడ్డ ఇటువంటి పాత్ర చేయొద్దని. మా ఆవిడా ఇటువంటి పాత్ర అయితే సినిమా చూడను అన్నది. మనం నిజంగా కూడా చచ్చిపోతాం.. ఏమైతది ఈ క్యారెక్టర్ చేస్తే అని చేసేసిన.

**ప్రశ్న : నటుడిగా మీరు ఎవరిని స్ఫూర్తిగా తీసుకుంటారు ?**

**సుధాకర్ రెడ్డి :** నేను ఎవరిని అనుకరణ చేసేవాన్ని కాదు. అలా అని ఎవరిని స్ఫూర్తిగా కూడా ఎవరిని స్వీకరించలేదు. ఎందుకంటే సినిమా అంటేనే మాకు దూరం. కానీ సినిమాల్లోకి వచ్చాను. నాకు ఉన్న పరిధిలో నేను ఎలా చెయ్యగలను,ఎలా ఉన్నాను అనేది చూసుకుంటా. నాకు కొన్ని నియమాలు ఉన్నాయి. అందుకని నాకు ఏం తెలుసో అది చెప్తా. అదే చేస్తా. కాబట్టి ఎవరిని స్ఫూర్తిగా స్వీకరించలేదు. ఎవరిని జ్ఞాపకం కూడా పెట్టుకోలేదు.

**ప్రశ్న : ఇప్పుడు చేస్తున్న సినిమాలు ఏంటి?**

**సుధాకర్ రెడ్డి :** ఇప్పుడు కొంచెం బిజీగానే ఉన్న 'పళ్ళబురుసు' అనే సినిమా చేసిన . ఇందులో చాలా మంచి పాత్ర. తండ్రి కొడుకుల మధ్య సాగే డ్రామా ఈ సినిమా కథ. నాగార్జున సార్ వాళ్ళు ఈ సినిమాను తీశారు. 'ఎల్లమ్మ' సినిమాలో కూడా నటిస్తున్న. ఇందులో కూడా చాలా మంచి పాత్ర. ఇది దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఇది బలగం లాగానే సూపర్ అవుతుంది. ఇంకా కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.

## సెప్టెంబర్ 3న 'రోమాంచకం'



డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న విడుదలకు ముస్తాబవుతోంది. ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ సునీల్ నారంగ్ మాట్లాడుతూ రోమాంచకం సక్సెస్ పై మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ సినిమా డెఫనెట్ గా హిట్ అవుతుంది అన్నారు.హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్ మాట్లాడుతూ 8 వసంతాలు సినిమా తర్వాత అనేక స్క్రిపట్స్ విన్నాను. కానీ వేణుగోపాల్ చెప్పిన ఈ కథకు కనెక్ట్ అయ్యాను. ఇదొక బ్యూటిఫుల్ స్క్రిప్ట్. నేను వివిధ తరహా చిత్రాల్లో నటించాలని అనుకుంటున్నా. అలా నేను కోరుకున్న జానర్స్ లో రోమాంచకం కూడా ఉంది. ఇది నా టైప్ మూవీ అని చెప్పొచ్చు అన్నారు.ప్రొడ్యూసర్ ప్రణయ్ రెడ్డి వంగా మాట్లాడుతూ డైరెక్టర్ వేణుగోపాల్ పదిహేను నెలల క్రితం ఈ కథ చెప్పారు. స్క్రిప్ట్ మొత్తం హిలేరియస్ గా నెరేట్ చేశారు. అన్ని క్యారెక్టర్స్ ను తనే పర్ ఫార్మ్ చేసి చూపించారు. మూడు నెలలు ఆర్టిస్టులతో రిహార్సల్స్ చేయించి మంచి పర్ ఫార్మెన్స్ వారి దగ్గర నుంచి తీసుకున్నారు. ఆ పర్ ఫార్మెన్స్ లను మీరు కొత్తగా ఫ్రెష్ గా ఫీలవుతారని నమ్ముతున్నాం. పేపర్ మీద ఏ బడ్జెట్ అనుకున్నామో ఆ బడ్జెట్ లోనే సినిమా చేశాడు. చిన్న సినిమా అనే ఫీల్ మీకు ఎక్కడా రాదు. నేను నమ్మిన కథ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం అన్నారు.నటి కీర్తన ,ప్రొడక్షన్ డిజైనర్ ఖుషి, డీవోపీ పవన్ పప్పుల, నటుడు నరేంద్ర ,నటుడు మణి, నటుడు సోహన్ , హీరో సుమంత్ ప్రభాస్ , డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.






(మొదటి పేజీ తరువాయి)

# జీవితం స్ఫూర్తిదాయకం

ఆవిష్కరించారు. సురవరం సుధాకర రెడ్డిపై ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ రచించిన పాటను నాయకులు ఆవిష్కరించారు. అంతకు ముందు సురవరం సుధాకర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఐ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు, తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఈ.టి.నరసింహ, కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, కలవేన శంకర్, ఎం.బాల నరసింహ, వి.ఎస్.బోస్, బాగం హేమంత్ రావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వేదికపై ఆసీనులయ్యారు.

### సురవరం సుధాకర రెడ్డి గొప్ప కమ్యూనిస్టు : ఘంటా చక్రపాణి

సురవరం సుధాకర రెడ్డి ఓ గొప్ప ఉద్యమకారుడు, రచయిత, వ్యాసకర్త, ఓ గొప్ప విద్యార్థి, యువజన, రాజకీయ నాయకుడు అయినప్పటికీ ఆయన ఎప్పుడూ నిరాడంబరుడిగా జీవించిన మహానేత అని ఘంటా చక్రపాణి కొనియాడారు. ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఒక్కడినైనా మార్చగలిగితే ఆయన గొప్ప కమ్యూనిస్టు అవుతాడని, అందుకు ప్రత్యక్ష ఉదారణ సురవరం సుధాకర రెడ్డి అని అన్నారు. ఆయన ఆదర్శాల ప్రభావం గ్రామీణ ప్రాంత యువతపై ఎంతో ఉందని, ఇందుకు ఉదహరణ కల్వకుర్తిలో ఓ దళిత యువకుడి గాథ నిదర్శమని చెప్పారు. సురవరం ప్రయాణం, ఆయన జీవితం నేర్పిన విషయాలు చాలా మందికి స్ఫూర్తిదాయకమైనవని పేర్కొన్నారు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన సురవరం సుధాకర రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న జన్ జీ ఉద్యమ సమయంలో ఆయన లేకపోవడం తీరని లోటు అన్నారు. సుధాకర రెడ్డి బతికి ఉంటే జన్‌జీల ఉద్యమానికి ఓ వ్యూహం, ధైర్యం ఇవ్వడంతో పాటు దిశా నిర్దేశం చేసేవారని అన్నారు.

### సుధాకర రెడ్డి ఆశయాల బాటలో నడవాలి : పల్లా వెంకట రెడ్డి

సురవరం సుధాకర రెడ్డి జీవితాన్ని, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని సిపిఐ శ్రేణులు ముందుకు సాగాలని పల్లా వెంకట రెడ్డి అన్నారు. కమ్యూనిస్టు భావజాలం ఒక వ్యక్తి మాటల్లో కాకుండా వారి ప్రవర్తనలో ప్రతిబింబించాలని, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవత్వం, ప్రజా సంక్షేమం దెబ్బతింటున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టులు మరింత నిబద్ధతతో ఉద్యమించాలని, ఇందుకు సురవరం సుధాకర రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సుధాకర రెడ్డి తుది శ్వాస వరకు ప్రజా సంఘాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ప్రజా సంఘాలు బలంగా ఉంటేనే పార్టీ నిర్మాణం కూడా బలపడుతుందని ఆయన పదే పదే చెప్పేవారని వెంకట రెడ్డి పేర్కొన్నారు. బాధ్యత ఏదైనా సరే వ్యక్తిగత నిర్ణయాలకు కాకుండా సమిష్టి నిర్ణయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సుధాకర రెడ్డి సూచించేవారని చెప్పారు. సురవరం ఎప్పుడు కూడా తన ప్రసంగంలో సమస్యల గురించే తప్ప ఏ ఒక్కరి వ్యకిగతం గురించి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. ఆ మహానేత సుధాకర రెడ్డి రచనలు, వ్యాసాలను సేకరించి ఇప్పటికే నవ చేతన పబ్లిషింగ్ హౌజ్ ద్వారా పలు పుస్తకాలు తీసురావడం జరిగిందని, మరిన్ని పుస్తకాలను కూడా తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని పల్లా వెంకట రెడ్డి చెప్పారు.

### నాయకత్వం లక్షణాలను గుర్తించడంలో సురవరం దిట్ట : డాక్టర్ నారాయణ

కమ్యూనిస్టు ఉద్యమంలో దూరదృష్టి, నిబద్ధత, కార్యకర్తల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడు సురవరం సుధకర రెడ్డి అని డాక్టర్ కె.నారాయణ కొనియాడారు. అపారమైన మేధస్సు, సహనం కలిగిన సుధాకర రెడ్డి భూమి కంటే ఎక్కువ ఓర్పు ఉన్న వ్యకి అని అన్నారు. రాజకీయ జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆవేశానికి లోనుకాకుండా, ఎంతో సంయమనంతో వ్యవహారించడం ఆయన ప్రత్యేకత అని, అందుకే ఆయనను 'అపొలిటికల్ అండ్ పొలిటికల్ మ్యాన్'గా అభివర్ణించేవారని గుర్తు చేశారు.

### కమ్యూనిస్టు భావజాలాన్ని ఎవరూ ఏమి చేయలేరు : కూనంనేని సాంబశివరావు

కమ్యూనిస్టులను ఏరివేయవచ్చని, కానీ ఆ భావజాలాన్ని ఏమి చేయలేమని ప్రధాని మోదీకి అర్థమయ్యే దిమాగి నక్సల్స్ పదాన్ని అందుకున్నారని కూనంనేని సాంబశివ రావు తెలిపారు. కమ్యూనిస్టు భావజాలం సమాజంలో ఇంకా బలంగా ఉందని, మేధోపరమైన ఉద్యమాలు, వాటి ప్రభావంతో ఏర్పడిన భావజాల పునాదులే ఉద్యమాలకు నాంది పలుకుతున్నాయని చెప్పారు. విద్యావంతులు, ప్రొఫెసర్లు, న్యాయవ్యవస్థ, ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల్లోనూ కొంతమందిలో కమ్యూనిస్టు భావజాలం ఉందని, ఆ భావజాల ప్రభావాన్ని పూర్తిగా తొలగించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మేధావులు, విద్యావంతులు, అధ్యాపకులు, విద్యార్థులను కలుపుకొని సురవరం సుధాకర రెడ్డి స్ఫూర్తితో మేధో ఉద్యమాన్ని విస్తరించాలని సాంబశివ రావు పిలుపునిచ్చారు. సుధాకర రెడ్డి స్ఫూర్తితో మేధోరంగంలో మరింత విస్తృతంగా పనిచేయాలని, ఇందుకు సుధాకర్‌రెడ్డి పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేసి, ఆయన ఆలోచనలు, అధ్యయన పద్ధతి, భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

### అసంఘటిత రంగం కోసం సుధాకర్‌రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయం : బి.వి. విజయలక్ష్మి

కార్మికులు, అసంఘటిత రంగం కోసం సురవరం సుధాకర రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని డాక్టర్ బి.వి.విజయలక్ష్మి కొనియడారు. కార్మిక శాఖ పార్లమెంటరీ స్టాడింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సురవరం సుధాకర రెడ్డి పార్లమెంట్ వేదికను కార్మికుల హక్కుల కోసం వినియోగించారన్నారు. సుధాకర రెడ్డి తన అనుభవాలను ఆధారంగా చేసుకుని రాజకీయ, సామాజిక సమస్యలపై ఎప్పుడు, ఏ విధంగా స్పందించేవారో అంతో స్పష్టంగా వివరించేవారని అన్నారు. ఏ ఉద్యమానికైనా, ఏ కార్యక్రమానికైనా విద్య, అధ్యయనం ఎంతో ముఖ్యమనే విషయాన్ని సుధాకర్‌రెడ్డి జీవితం నుంచి నేర్చుకోవాలని విజయలక్ష్మి సూచించారు.






# సురవరం ఆదర్శ కమ్యూనిస్టు

## మొదటి వర్థంతి సభలో డి.రాజా

**న్యూఢిల్లీ:** సిపిఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి స్ఫూర్తి ప్రదాత అని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా కొనియాడారు. సుధాకర రెడ్డి జీవితం భావి తరాలకు ఓ ప్రేరణ అన్నారు. న్యూఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో సురవరం సుధాకర రెడ్డి మొదటి వర్థంతి సభ శనివారం జరిగింది. సురవరం సుధాకర రెడ్డి చిత్రపటానికి పూల మాటలు వేసి డి.రాజా సహా నాయకులు అరుణాంజలి ఘటించారు. అనంతరం డి.రాజా మాట్లాడుతూ సుధాకర రెడ్డి జీవితం, తోడ్పాటు, వారసత్వాన్ని గుర్తుచేశారు. సురవరం సుధాకర రెడ్డి నిబద్ధతలగల ఆదర్శ కమ్యూనిస్టు అని శ్లాఘించారు. ఆయన తుది వరకు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడ్డారన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి తరపున అనేక పోరాటాలు చేశారని, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించారని గుర్తుచేశారు. శ్రామిక వర్గానికి సురవరం సుధాకర రెడ్డి అన్ని వేళలా అండగా నిలిచారని, వారి పక్షాన పోరాటాలు చేశారని డి.రాజా తెలిపారు. సురవరం సుధాకర రెడ్డి కమ్యూనిస్టు ఉద్యమానికి కట్టుబడి... న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువలను పాటించారని కొనియాడారు. ఆయన నాయకత్వం, నిడాంబరత, ప్రజల కోసం పడిన తపన భావి తరాలకు ఆదర్శనీయమని డి.రాజా అన్నారు. కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శులు పి.సంతోశ్ కుమార్, అనీరాజాతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యుడు, ప్రొఫెసర్ దినేశ్ వర్షినే తదితరులు పాల్గొన్నారు. సురవరం సుధాకర రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## 'ఆత్మనిర్భర భారత్' (మొదటి పేజీ తరువాయి)

భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? 3. దేశంలో చక్కెర కొరత ఉండి, ప్రభుత్వం విదేశాల నుండి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, ఇ–20 ఇంధనం కోసం ఇథనాల్‌ను తయారు చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు? ఇది ఎలాంటి ఆత్మనిర్భర్ భారత్ అని ఖర్గే పేర్కొన్నారు.

## వేధింపులు (మొదటి పేజీ తరువాయి)

నిరాకరించబడుతున్నాయన్నారు. సురక్షిత ప్రయాణం కోసం మహిళలు ఏటా అదనంగా రూ. 17,500 ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు. మహిళలు అనేక విధాలుగా ఆంక్షలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్న కాంగ్రెస్ నాయకుడు, 60 శాతం మంది మహిళలు ఒంటరిగా ఇంటి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉందని అన్నారు. 'అబ్బాయిలు ఎప్పుడైనా బయటకు వెళ్లవచ్చు, ఆలస్యంగా ఇంటికి రావచ్చు, కానీ అమ్మాయిలు మాత్రం రాత్రి 8 గంటలకే తిరిగి రావాలి. అబ్బాయిలు ఏ పరీక్షనైనా ఎన్నిసార్లైనా రాయవచ్చు, కానీ అమ్మాయిలకు మాత్రం ఒక్క అవకాశం మాత్రమే లభిస్తుంది. వారికి పెళ్లి వయసు వచ్చిందని, ఇక పరీక్ష రాయాల్సిన అవసరం లేదని చెబుతుంటారు' అని వాపోయారు. పెళ్లి లేదా ఇంటి బాధ్యతల కారణంగా 45 శాతం మంది మహిళలు విద్య లేదా ఉద్యోగాన్ని వదిలేయాల్సి వస్తుండగా, కేవలం 8 శాతం మందికి మాత్రమే సొంత భూమి ఉంది. ఇళ్లలో ఉన్న అసమానతలను ఎత్తిచూపుతూ, 15 నుండి 29 ఏళ్ల వయస్సు గల మహిళలు ఇంట్లో 5.5 గంటల పాటు పని చేస్తుంటే, అదే ఇంట్లో అబ్బాయిలు కేవలం 30 నిమిషాలు మాత్రమే పని చేస్తున్నారని గాంధీ చెప్పారు. అలాగే, 84 శాతం మంది మహిళలు ఉద్యోగం చేయడానికి తమ కుటుంబం అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉందని ఆయన పేర్కొన్నారు. పురుషులతో పోలిస్తే మహిళలు 25 శాతం తక్కువ సంపాదిస్తున్నారని, వారికి సులభంగా పదోన్నతులు లభించడం లేదన్నారు. మహిళలు తమకు తామే చెందుతారని, వారు తమ తండ్రులు, భర్తలు లేదా కుమారులకు చెందరని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శనివారం అన్నారు. జీవితంలోని ప్రతి దశలోనూ మహిళ పురుష బంధువుల ఆధీనంలోనే ఉండాలనే మనుస్మృతి నిబంధన సిగ్గుచేటని ఆయన పేర్కొన్నారు. 'బాల్యం'లో స్త్రీ తన తండ్రి ఆధీనంలో ఉండాలి, యవ్వనంలో ఆమె తన భర్తకు చెందుతుంది, భర్త మరణించిన తర్వాత ఆమె తన కుమారులకు చెందుతుంది. స్త్రీ ఎప్పుడూ స్వతంత్రంగా ఉండకూడదు. ఈ మాటలు సిగ్గుచేటు. ఇలాంటి మాటలు చెప్పి ఉండకూడదు' అని గాంధీ అన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com